
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 121

సోమవారం 15-1-2024



SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆడుతూ పాడుతూ...

టీ20 సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

వివరాలు 12లో ▶



జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం

మణిపూర్‌లో థౌబాల్ నుంచి భారత్ జోడో న్యాయ్ యాత్రను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రారంభించారు.

వివరాలు 6లో ▶



బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

సముద్ర జలాలపైకి బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా ప్రయోగించగా..ఆ విషయాన్ని దక్షిణ కొరియా సైన్యం ధ్రువీకరించింది.

వివరాలు 6లో ▶




మిలింద్ దేవ్‌రా రాజీనామా

మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా ఆ పార్టీకి రాజీనామా చేసి శివసేనలో చేరారు.

వివరాలు 6లో ▶

ఇసుక బకాసురుడు బాబు

తవ్వుకో.. తినుకో!



ఇసుక ఉచితమంటూ ఊడ్చేశారు

- పచ్చ ముఠా లూటీ రూ.10 వేల కోట్లు.. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు బేఖాతర్
- ఆర్థిక శాఖ ఆమోదం, మంత్రి మండలి తీర్మానం లేదు
- 'ప్రత్యేక మెమో' ముసుగులో యథేచ్ఛగా దోపిడీ
- ఏ1 పీతల సుజాత, ఏ 2 చంద్రబాబు, ఏ 3 చింతమనేని, ఏ 4 దేవినేని ఉమా
- నేడు పారదర్శక విధానాలతో ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం

10లో

సెలవు

సంక్రాంతి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.



ఇది పల్నాడు జిల్లాలోని కనవర్లపూడి పంచాయతీ కార్యాలయం. ఐదేళ్ల క్రితం 3 గ్రామాలకు కలిపి పంచాయతీ కార్యదర్శి ఒకరే ఉండటంతో దీన్ని మొక్కుబడిగా తెరిచేవారు. మండల కేంద్రానికి చేరువలో ఉన్న పంచాయతీ పరిస్థితే ఇలా ఉంటే నాడు మారుమూల గ్రామాల పరిస్థితిని ఇట్టే ఊహించుకోవచ్చు.



అదే కనవర్లపూడిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ఇదీ..

ఇదీ మార్పు

ఊరిస్తున్న ఊరు

రాష్ట్రంలో ఏ గ్రామాన్ని చూసినా మారిపోయిన రూపురేఖలు

గతంలో ఏది కావాలన్నా టౌన్‌కే.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు

- ఇప్పుడు విద్య నుంచి వైద్యం దాకా విత్తనాల నుంచి విక్రయాల వరకూ అన్నీ సొంతూళ్లోనే
- రైతులకు తొలగిపోయిన వ్యయ ప్రయాసలు.. పేదలకు ఊరట
- అక్క చెల్లెమ్మలకు సాధికారత.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- నాలుగున్నరేళ్లలో పల్లెలకు కదలి వచ్చిన ప్రభుత్వ పాలన
- రోజంతా గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌ల సేవలు
- ఆ పక్కనే అన్ లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో డిజిటల్ లైబ్రరీలు
- సొంత భవనాల నిర్మాణంతో సకల మౌలిక వసతులు
- టీచర్లు మినహా ఒక్క ప్రభుత్వ ఉద్యోగీ లేని గ్రామాల్లో నేడు పది మంది శాశ్వత ఉద్యోగులు

సాక్షి, అమరావతి: గ్రామంలోకి అడుగు పెట్టగానే కనిపించే సచివాలయాలు.. మరో నాలుగు అడుగులు వేస్తే రైతన్నల కోలాహలంతో సందడిగా ఆర్బీకేలు.. అనారోగ్య సమస్యలు తలెత్తితే చికిత్స అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్స్.. ఆధునిక సదుపాయాలతో సరికొత్తగా మారిపోయిన ప్రభుత్వ పాఠశాలలు.. ఆ పక్కనే అన్ లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో సిద్ధమవుతున్న డిజిటల్ లైబ్రరీలు.. సంతృప్త స్థాయిలో సేవలు అందించేందుకు ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్.. ప్రతి గ్రామంలో పది మంది క్వాలిఫైడ్ శాశ్వత ఉద్యోగులు.. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలతో జీవనోపాధులు పొందుతూ సాధికారత దిశగా అడుగులు వేస్తున్న అక్క చెల్లెమ్మలు.. ఇలా రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లి చూసినా

మిగతా 5వ పేజీలో ▶

సంబరంగా సంక్రాంతి వేడుక

సీఎం క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహణ

- ప్రజలందరికీ మంచి జరగాలంటూ రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు
- భోగి మంటలు వెలిగించి సంబరాలను ప్రారంభించిన సీఎం దంపతులు
- గోశాలలో గోవులకు, తులసి మొక్కలకు పూజ.. గంగిరెద్దులకు అరటి పండ్లు తినిపించి, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించిన సీఎం వైఎస్ జగన్ దంపతులు
- కళాకారులను ఆప్యాయంగా పలకరించి, అందరితో ఫొటోలు

2లో



సీఎం క్యాంపు కార్యాలయంలో భోగి మంటలు వెలిగిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు

18 లక్షల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

- కొనసాగుతున్న మిగిలిన కార్డుల పంపిణీ
- మొత్తం 1.42 కోట్ల స్మార్ట్ కార్డులను ఇస్తున్న ప్రభుత్వం.. ఆరోగ్యశ్రీ సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన
- వైద్య ఖర్చుల పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు.. సేవలు సులభంగా అందుకోవడానికి ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్

5లో



రాజ్యసభలో టీడీపీ అడ్రస్ గల్లంతే

- ఏప్రిల్ 2తో పూర్తి కానున్న టీడీపీ సభ్యుడు 'కనకమేడల' పదవీకాలం
- వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి, బీజేపీ సభ్యుడు సీఎం రమేష్‌ల పదవీకాలం ముగిసేదీ అప్పుడే
- రాష్ట్ర కోటాలో ఖాళీ అయ్యే ఈ 3 స్థానాలకు ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్నికలు
- అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే
- చివరికి రాజ్యసభలో ఉనికే లేకుండాపోనున్న టీడీపీ

- వివరాలు 10లో



తొలిరోజే 'పుంజు'కున్నాయ్

కత్తులు దూసిన పందెం కోళ్లు

- బరుల వద్ద క్యాష్ కౌంటింగ్ మెషిన్లు, బౌన్సర్లు, ట్యాగ్‌లు
- గోదావరి జిల్లాల్లో పందేలు
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జూలు విదిల్చిన పుంజులు
- పొరుగు రాష్ట్రాల నుంచి సైతం తరలివచ్చిన బెట్టింగ్ రాయుళ్లు

- వివరాలు 14లో


సీఎం వైఎస్ జగన్ దంపతులకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు


హరిదాసుకు స్వయంపాకం ఇస్తున్న సీఎం దంపతులు


గోశాలలో గోమాతకు చీర సమర్పిస్తున్న వైఎస్ భారతమ్మ


వినాయకునికి పూలు, పండ్లు, గరిక సమర్పిస్తున్న వైఎస్ భారతమ్మ

సంబరంగా సంక్రాంతి వేడుక

సీఎం క్యాంపు కార్యాలయంలో ఘనంగా వేడుకలు


సంక్రాంతి సంబరాల సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం దంపతులు


సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదిస్తున్న ముఖ్యమంత్రి జగన్, భారతమ్మ


గంగిరెద్దుకు సారె సమర్పిస్తున్న సీఎం జగన్ దంపతులు


కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి సేవలో..


తన సతీమణి భారతమ్మకు కంకణ ధారణ చేస్తున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంప్రదాయ పంచెకట్టుతో సతీసమేతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గంగిరెద్దులకు సారెను సమర్పించడం, భోగిమంటలు, గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు, హరిదాసుల కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల సంక్రాంతి నృత్యాలతో వేడుకలు కన్నులపండువగా జరిగాయి. సీఎం క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న గోశాలను చక్కగా పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. నవరత్నాలతో ముఖ్యమంత్రి ప్రతిఇంటికీ సంక్షేమ ఫలాలను అందించిన నేపథ్యంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, మెడికల్ కాలేజీ, నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా తీర్చిదిద్దిన స్కూల్ భవనం, పాల కేంద్రం నమూనాలు వంటి ప్రభుత్వ ప్రాధాన్యతలను తెలియజేస్తూ.. ముత్యాల ముగ్గులు, రంగురంగుల రంగవల్లులు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, ధాన్యాగారాలు, గడ్డివాములు, ఎడ్లబండ్లు ఇలా అచ్చం అసలు సిసలైన గ్రామీణ వాతావరణ ప్రతిబింబించేలా, మన సంస్కృతి సంప్రదాయాలు వెల్లివిరిసేలా.. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి నేతృత్వంలో గ్రామ స్వరాజ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. సీఎం దంపతులను మంత్రముగ్ధుల్ని చేసేలా ఆ ప్రాంతం శోభాయమానంగా అలంకరించారు. ప్రాంగణంలోకి ప్రవేశించే ముందు ఏర్పాటుచేసిన శిలాతోరణం అందరినీ ఆకట్టుకుంది.

ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఇక ఈ కార్యక్రమానికి సంప్రదాయ దుస్తులతో హాజరైన సీఎం జగన్ దంపతులను వేదపండితులు నుదుట తిలకం దిద్ది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం.. వారిరువురూ భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించారు. హరిదాసుకు స్వయంపాకం, సారె సమర్పించారు. అలాగే, గోశాలలోని గోవులకు పూజచేసి వాటిని నిమురుతూ కొద్దిసేపు అక్కడ గడిపారు. గంగిరెద్దులకు, తులసి చెట్టుకు పూజలు చేశారు. గ్రామీణ సంక్రాంతి వేడుకల్లో ప్రధానంగా కనిపించే వివిధ కళాకారులను సీఎం ఆప్యాయంగా పలకరించారు. అంతేకాక.. తెలుగింటి సంక్రాంతి పిండివంటలను ముఖ్యమంత్రి దంపతులు రుచి చూశారు. అనంతరం.. కలియుగ దైవమైన శ్రీహరికి పూజలు నిర్వహించటం, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు ఏర్పాటుచేసిన వందేళ్ల క్రితం నాటి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ నమూనా ప్రాంగణంలోకి అడుగుపెట్టారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి సీఎం జగన్ దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం.. అక్కడున్న మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులను పలకరిస్తూ ముందుకు కదిలారు. తొలుత.. కాణిపాక వినాయక విగ్రహానికి సీఎం జగన్ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తర్వాత.. కనకదుర్గమ్మకు.. అనంతరం శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదపండితుల ఆశీర్వాదం స్వీకరించారు. ఈ సందర్భంగా వేదపండితులు సీఎంకు కంకణం కట్టగా.. వేదపండితులు అందించిన మరో కంకణాన్ని భారతమ్మకు ముఖ్యమంత్రి జగన్ కట్టారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ప్రముఖ సినీ నేపథ్యగాయని గోపిక పూర్ణిమ, ప్రముఖ గాయని శ్రీలలిత పాటల కార్యక్రమం శ్రవణపేయంగా సాగింది. అలాగే, సినీ రంగానికి చెందిన ప్రముఖ ఇన్‌స్ట్రుమెంట్ ప్లేయర్స్ రాఘవ, కౌండిన్య, మెహర్, మానస్, చందు, రమేష్, హరేరాము, మహేష్, భాను తదితరుల లైవ్ పెర్ఫామెన్స్.. ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారులు రిత్విక్ వెంకట్, చార్మి, చిన్నారి కేతనరెడ్డి నాట్య ప్రదర్శన.. నీలకంఠం మిమిక్రీ, ప్రముఖ కొరియోగ్రాఫర్ ఉదయ్ బృందంచే సంక్రాంతి ప్రత్యేక గీతాల నృత్యం, మాస్టర్ భువనేష్ ప్రత్యేక గీతాలు.. వీటితో పాటు ప్రముఖ సినీగేయ రచయిత, సంగీత దర్శకులు విశ్వ.. ప్రముఖ సినీ మరియు ప్రజా గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, ప్రజా రచయితలు మానుకోట ప్రసాద్, మాట్ల తిరుపతి, గాయకులు గద్దర్ నర్సిరెడ్డి, తేలు విజయల కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా కృష్ణవేణి మల్లావఝుల వ్యవహరించారు. చివర్లో వీరందరిని సీఎం జగన్ దంపతులు సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అంతేకాక.. ప్రాంగణంలో ఉన్న అందరితో సీఎం జగన్ దంపతులు ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు కొట్టు సత్యనారాయణ, నారాయణ స్వామి, మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చెవిరెడ్డికి సీఎం అభినందనలు..

ఇదిలా ఉంటే.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా.. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలా.. చక్కని ఏర్పాట్లతో, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిని సీఎం జగన్ ప్రత్యేకంగా అభినందించారు.

విజయానందాలతో అడుగులు ముందుకేయాలి..

సీఎం జగన్ ట్వీట్

ఊరూ వాడా ఒక్కటై.. బంధుమిత్రులు ఏకమై.. అంబరమంత సంబరంగా జరుపుకునే తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. భోగి మంటల సాక్షిగా చెడును దహనం చేసి.. సంతోషాల కాంతిని ఇంటి నిండా నింపుకుని.. సుఖ సంతోషాలతో.. విజయానందాలతో ప్రతి ఒక్కరూ అడుగులు ముందుకేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అంటూ ఆదివారం 'ఎక్స్' (ట్విట్టర్)లో తెలిపారు.


సీఎం దంపతులకు వేదపండితుడి ఆశీర్వచనం.. తీర్థం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి భారతమ్మ


పరస్పరం నుదుట కుంకుమ దిద్దుకుంటున్న ముఖ్యమంత్రి దంపతులు

విమానమెక్కి.. శ్రీరాముణ్ణి మొక్కి!

అయోధ్యకు హెలికాప్టర్, చార్టర్డ్ విమానాలు

- ఈనెల 22న రామమందిరం ప్రాణ ప్రతిష్ట
- రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులకు ఆహ్వానం
- సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి రూ.10–20 లక్షలు చార్జీ



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో గర్భగుడిలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ట చేయనున్నారు. ఈ వేడుకకు దేశవ్యాప్తంగా రామ భక్తులు, సినీ తారలు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు ఆహ్వానాలు వెళ్లాయి. దీంతో అయోధ్యకు వెళ్లే హెలికాప్టర్, చార్టర్డ్ విమానాలకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే ఈనెల 22న అయోధ్య విమానాశ్రయంలో 100 చార్టర్డ్ విమానాలు దిగుతాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ తెలిపారు. లక్షమందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా.

ఇప్పటికే క్యాబ్‌లు, రైళ్లు ఫుల్

ఇప్పటికే జనవరి 22 నాటికి రైల్వే టికెట్ బుకింగ్‌లు 60 శాతం మేర పెరిగాయి. అలాగే అయోధ్యలో క్యాబ్ ఆపరేటర్ల బుకింగ్‌లు 50 శాతం పెరుగుతాయని ట్రావెల్ పోర్టళ్ల అంచనా. ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా విమానయాన సంస్థలు డిసెంబర్ 30 నుంచి దేశంలోని ప్రధాన మెట్రో నగరాల నుంచి అయోధ్యకు సాధారణ విమాన సేవలను ప్రారంభించాయి. ప్రస్తుతం అయోధ్యకు రోజుకు నాలుగు విమాన సర్వీస్‌లు నడుస్తున్నాయని, రాబోయే రోజుల్లో ఇది 20–24కు పెరుగుతుందని అయోధ్య విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే చార్టర్డ్ ఫ్లయిట్ ఆపరేటర్ల నుంచి 42 ఎంక్వయిరీలు వచ్చినట్లు చెప్పాయి. అయోధ్య విమానాశ్రయంలో విమానాల కోసం తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఈనెల 22న ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థలు ప్రయాణికులను పికప్, డ్రాప్ మాత్రమే చేయాలని, విమానాలను లక్నో, వారణాసి, ఖుషీనగర్, పాట్నా, ఢిల్లీ వంటి పొరుగు విమానాశ్రయాల్లో పార్కింగ్ చేయాలని సూచించారు.

మెట్రో నగరాల నుంచి డిమాండ్

మిలియన్ ఎయిర్, క్లబ్ వన్ ఎయిర్, ఎంఏబీ ఏవియేషన్, జెట్‌సెట్‌గో వంటి ప్రైవేట్ చార్టర్డ్ విమాన సంస్థలు అయోధ్యకు విమాన సేవలను అందిస్తున్నాయి. ఈ ఏడాది చార్టర్డ్ ఫ్లయిట్లు, హెలికాప్టర్లకు డిమాండ్ పెరిగిందని ఎయిర్ చార్టర్డ్ సంస్థ క్లబ్ వన్ ఎయిర్ సీఈఓ రాజన్ మెహ్రా తెలిపారు. తెలంగాణ, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో శాసన సభ ఎన్నికలు, అహ్మదాబాద్‌లో వైబ్రంట్ గుజరాత్ ఇన్వెస్టర్ సమిట్‌లతో ప్రైవేట్ చార్టర్డ్ ఆపరేటర్లకు గిరాకీ పెరిగిందని తెలిపారు. తాజాగా రామమందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యకమంతో చార్టర్డ్ ఫ్లయిట్ల కోసం ఎంక్వయిరీలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే 12 సీట్ల జెట్ ఫాల్కన్ 2000 బుక్ అయిందని చెప్పారు. ఆలయ ప్రారంభోత్సవం రోజున చార్టర్డ్ విమానాల కోసం 25 ఎంక్వయిరీలు వచ్చాయని మరో ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ ప్రతినిధి తెలిపారు. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ముంబై, పుణే, నాగ్‌పూర్ వంటి మెట్రో నగరాల నుంచి అభ్యర్థనలు వచ్చాయని చెప్పారు.

సీటింగ్‌ను బట్టి చార్జీలు

విమానం సైజు, సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి ఈ మార్గంలో ధర రూ.10–20 లక్షలు ఉంటుందని ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీలు తెలిపాయి. అయితే చలికాలం నేపథ్యంలో పొగమంచు, తక్కువ విజిబిలిటీ కారణంగా అయోధ్యకు విమాన సర్వీసులు సవాలేనని, దీంతో అయోధ్యకు ప్రైవేట్ చార్టర్డ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల అనుమతులపై విమానాశ్రయ వర్గాల నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉందని తెలిపాయి. ప్రస్తుతం అయోధ్య విమానాశ్రయం రోజుకు 6 గంటలు మాత్రమే తెరిచి ఉంటుంది. ఈనెల 22న ఆలయ ప్రారంభోత్సవం రోజున మాత్రం 24 గంటలు తెరిచి ఉండేలా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాట్లు చేస్తోంది.

మిలాన్-2024 @ విశాఖ

త్రీ 'సీ' థీమ్‌తో ఫిబ్రవరి 19–27 వరకు నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: మరో అంతర్జాతీయ విన్యాసాలకు వేదికగా నిలిచేందుకు విశాఖ సన్నద్ధమవుతోంది. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్–2022ని నిర్వహించిన విశాఖ.. తాజాగా మిలాన్ విన్యాసాలకు రెండోసారి ఆహ్వానం పలుకుతోంది. నౌకాదళ విభాగంలో కీలకమైన మిలాన్ కోసం భారీ ఏర్పాట్లు చేసేందుకు ఇండియన్ నేవీ ఏడాదిగా ప్రణాళిక రచిస్తోంది. మిలాన్‌కు భారత నౌకాదళం 50 దేశాలకు ఆహ్వానం పంపగా 38 దేశాలు పాల్గొంటున్నట్లు అంగీకారం తెలిపాయి. ఫిబ్రవరి 19 నుంచి 27 వరకు జరిగే మిలాన్‌లో కీలకమైన సిటీ పరేడ్ 22న ఆర్కే బీచ్‌లో జరగనుంది. మిలాన్ అంటే.. హిందీలో సమావేశం అని అర్థం. 2023లో మిలాన్ అండమాన్ నికోబార్ దీవుల్లో దీన్ని నిర్వహించారు. పలు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణంలో స్నేహ పూర్వక సత్సంబంధాల్ని మెరుగు పరచుకోవడంతో పాటు శత్రుసైన్యానికి బలం, బలగం గురించి తెలిపేందుకు ఈ విన్యాసాలు నిర్వహిస్తుంటారు. మిలాన్ బహుపాక్షిక విన్యాసాలకు భారత నౌకాదళం సారథ్యం వహించనుంది. ఈసారి కమరడెరీ (స్నేహం), కొహెషన్(ఐక్యత), కొలాబరేషన్ (సహకారం) థీమ్‌తో దీన్ని నిర్వహిస్తున్నారు. మిలాన్-2024 విన్యాసాలు సీ ఫేజ్, హార్బర్ ఫేజ్‌ల్లో నిర్వహిస్తారు. కాగా, 1995లో మిలాన్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. తొలిసారి జరిగిన విన్యాసాల్లో భారత్‌తో పాటు ఇండోనేసియా, సింగపూర్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలు పాల్గొన్నాయి. రెండేళ్లకోసారి నిర్వహించే మిలాన్‌లో ఏటా దేశాల సంఖ్య పెరుగుతోంది. 2005లో సునామీ కారణంతో మిలాన్ రద్దయింది. 2001, 2016ల్లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలు వల్ల విన్యాసాలు జరగలేదు. 2010 వరకూ 8 దేశాలు మాత్రమే పాల్గొనగా.. 2012లో జరిగిన విన్యాసాల్లో దేశాల సంఖ్య రెట్టింపై 16 దేశాలు పాల్గొన్నాయి. 2014లో 17 దేశాలు పాల్గొని అతి పెద్ద ఫ్లీట్ రివ్యూగా చరిత్రకెక్కింది.

ఈ సారి పాల్గొంటున్న దేశాలివే...

భారత్‌తో పాటు యూఎస్ఏ, రష్యా, జపాన్, యూకే మొదలైన 50 దేశాలకు భారత నౌకాదళానికి చెందిన ప్రతినిధులు ఆహ్వానాలు అందించారు.

క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు

అద్దంకి: నియోజకవర్గంలోని ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడుతూ సుఖసంతోషాలతో సంక్రాంతి వెలుగులు నిండాలన్నారు. ప్రజల జీవితాల్లో కాంతిని వెదజల్లాలని ఆయన ఆకాంక్షించారు.

కాలువలో పడిన బైక్, ఇద్దరికి గాయాలు

బల్లికురవ: బైకు దుపుతప్పి కాలువలో పడి ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శనివారం అర్ధరాత్రి అద్దంకి–బల్లికురవ ఆర్ అండ్ బీ రోడ్డులోని అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన సీహెచ్ చెన్నయ్య, జీ. చిన్న శివయ్య ఇరువురు పని నిమిత్తం బైకుపై బల్లికురవ వైపు వస్తున్నారు. కాలువ సమీపంలో మలుపు ఉండటంతో బైక్‌ను అదుపుచేయలేక కాలువలో పడ్డారు. రాత్రి సమయం కావడంతో ఎవరికీ కనిపించలేదు. దీంతో క్షతగాత్రులు కేకలు వేయసాగారు. అటుగా కొందరు వాహనదారులు అద్దంకి వైపు వెళ్తుండటంతో వారికి కేకలు వినిపించసాగాయి. అనంతరం వారు సెల్‌ఫోన్ల లైట్ల వెలుతురులో క్షతగాత్రులను గుర్తించి 108కు సమాచారం ఇచ్చారు. అద్దంకి నుంచి వచ్చిన 108 ఈఎంటీ హరిబాబు, పైలట్ రామచంద్రయ్య ప్రథమ చికిత్సకు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన చికిత్సకు ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఇదే మలుపులో ప్రతి నెల రెండు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మనసే పెద్ద రంగస్థలం

పర్చూరు(చినగంజాం): మన మనసే పెద్ద రంగస్థలమని కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త గోరంట్ల రమేష్ బాబు అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఆదివారం పర్చూరు మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో జాతీయస్థాయి కళానికేతన్, కళాపరిషత్ నాటిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో మార్పుకోసం నాటికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నాటిక పోటీలు 16వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ముఖ్యుల ప్రసంగం అనంతరం ప్రదర్శించిన తొలినాటికగా చైతన్య కళాభారతి వారి' చీకటిపువ్వు', శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం శ్రీకాకుళం వారు ప్రదర్శించిన 'కొత్తపరిమళం', తెలుగు కళా సమితి విశాఖపట్నం వారు ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కందిమళ్ల సాంబశివరావు, బుచ్చయ్యచౌదరి, పాటిబండ్ల ఆనందరావు, నాయుడు గోపి పాల్గొన్నారు.

ఘనంగా భావనాఋషి స్వామి కళ్యాణం

చీరాల అర్బన్: పట్టణంలోని చీరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉదయం భోగి మంటలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 216 మంది మహిళలు జలబిందెలతో నగర ప్రదక్షిణ చేసి స్వామివార్లకు అభ్యంగన స్నానం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బహుమతుల అందజేత

మేదరమెట్ల: యనగాల సుబ్బారావు స్మారక ప్రతిభా పోటీల పరీక్ష ఫలితాలు పురస్కరించుకొని రావినూతల జెడ్పీ హెచ్ఎస్‌లో ప్రతిభా పురస్కార బహుమతులు ఆదివారం అందచేశారు. ఈప్రతిభా పోటీల బహుమతులను మూడు కేటగిరీలలో(ఓసీ, బీసీ, ఎస్సీఎస్టీ) మొదటి, రెండవ, మూడు బహుమతులను అందజేశారు. ప్రథమ రూ.15 వేలు, ద్వితీయ రూ.10వేలు, తృతీయ రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చీరాల డిప్యూటీ డీఈవో ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ యనగాల గోపీచంద్, హెచ్ఎం రామాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.


కారంచేడు మాస్కో బజారులో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు


చీరాలలో భోగి మంటలు వేసి ఆనందం వ్యక్తం చేస్తున్న వాకింగ్ సభ్యులు



వేటపాలెం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

భోగి.. ఆనందాల లోగిలి

- భోగితో ప్రారంభమైన సంక్రాంతి పండుగ
- ప్రతి ఇంటా భోగి మంటలు, రంగవల్లులు
- సందడి చేసిన చిన్నారులు, యువత

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: తెలుగు వారి అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఎక్కడెక్కడో ఉన్న బంధువులు, ఆత్మీయుల రాకతో ఇళ్లల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగలో భాగంగా ఆదివారం మొదటి రోజు భోగి పండుగను వైభవంగా జరుపుకున్నారు.

■ రాష్ట్ర ప్రజలందరూ భోగభాగ్యాలతో, సుఖ, సంతోషాలతోను వర్థిల్లాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మార్కెటింగ్, సహకార రంగ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదిన్నాన్ని పురస్కరించుకొని ఆయన స్వగ్రామం యర్రవారిపాలెంలో భోగి పండుగను కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో నిర్వహించారు. ప్రజలు గతంలో కంటే జగనన్న పాలనలో ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి జగనన్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. మండల కేంద్రమైన కారంచేడు మాస్కో బజారు, పెద బజారు సెంటర్, చినవంతెన సెంటర్, కాలువ సెంటర్, కట్టమీద, గోడమూల బజారు, దేవరింటి బజారుల్లో మహిళలు పెద్ద ఎత్తున భోగి మంటలు వేసుకొని సంతోషంగా గడిపారు.

■ యద్దనపూడి, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో, మార్టూరు మండలం కేంద్రం మార్టూరు ఇసుక దర్శి గ్రామాల్లోని పాండురంగ స్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలలపూడి కోదండ రామాలయంలో నిర్వహించిన గోదాదేవి కళ్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


అద్దంకిలో వేస్తున్న భోగి మంటలు

ఆకట్టుకున్న రంగవల్లులు..

వేటపాలెం/చీరాల రూరల్/చీరాల అర్బన్/చీరాల టౌన్/చీరాల: గ్రామాల్లో సంక్రాంతి పండగ మొదటి రోజు భోగి పర్వదినాన్ని చీరాలలో ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలకు భోగి పళ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. యువకులు, పెద్దవారు తెల్లారుజాము నుంచే మంటలు వేసి చలి కాచుకున్నారు. ఇళ్లల్లో ఉన్న పాత వస్తులను మంటల్లో వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

■ వాకర్స్ ఇంటర్నేషనల్ ఎస్ఆర్అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైస్కూలు క్రీడా మైదానంలో భోగి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా సభ్యుల ఆనందోత్సహాల మధ్య భోగి మంటలువేసి స్వీట్స్ పంచిపెట్టారు. కొత్త సంవత్సరంలో చెడును విసర్జించి మంచిని ఆహ్వానించాలని సభ్యులు పేర్కొన్నారు. అనంతరం వాకింగ్ సభ్యులు గ్రంధి నారాయణ మూర్తి ఆర్థిక సహకారంతో 30 మంది వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల ప్రసాద్, అమరా వీరాంజనేయులు, దోగుపర్తి వెంకట సురేష్, మామిడాల శ్రీనివాసరావు, గుర్రం బదరి నాథ్, నారాయణ మూర్తి, బాలగంగాధరరావు, రామదాసు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

■ వేటపాలెం గ్రంథాలయం రోడ్డులో సంతూర్, ఆర్యవైశ్య సంఘం వాసవీ క్లబ్స్, వనితా వైష్ణవీ, లెజెండ్స్ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు 50 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం బహుమతులు పంపిణీ చేశారు.

గోదా రంగనాథస్వాముల కల్యాణం..

బల్లికురవ/అద్దంకి రూరల్/అద్దంకి/మేదరమెట్ల/జే పంగులూరు: భోగివేడుకలు అద్దంకి నియోజవర్గంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బల్లికురవలో విప్రో సంతూర్ సోప్ తిరుమల ట్రేడర్స్ అద్దంకి వారిచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. హరిప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భోగి వేడుకలు

■ అద్దంకి మండలం, పట్టణంలోని ప్రతి వాడలో యువతీ, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా భోగిమంటలు వేసి ఆనందాన్ని పొందారు. సాయంత్రం చిన్నారులకు భోగిపండ్లు పోశారు. చిన్నారులు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. కొత్త అల్లుళ్లు, కొత్త కోడళ్లు, బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

■ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదారంగనాథ స్వాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మేదరమెట్లలో గోదారంగనాథస్వాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు


స్వర్ణ మొయిన్ రోడ్డులో భోగి మంటలు వేస్తున్న మహిళలు


చీరాల: భోగి మంటలు వేస్తున్న న్యాయవాదుల సంఘ నాయకులు


కోలలపూడి కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న గోదాదేవి కళ్యాణం


కొత్తపాలెంలో భోగి మంటలు వేస్తున్న యువత

తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతే


హనిమిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- 'పల్లె పల్లె'కులో హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతు లేకుండా పోతుందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని వేలమూరిపాడు, ధేనువుకొండ గ్రామాల్లో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి విచ్చేసిన హనిమిరెడ్డికి గ్రామస్తులు స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రజలను పలకరిస్తూ జగనన్న పాలనలో అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనిమిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హమీని నెరవేర్చిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మరలా జగనన్ననే సీఎం చేసుకోవాలన్నారు. జగన్ ఆదేశాలతో అద్దంకి వచ్చిన నెల రోజుల్లోనే ప్రజలు తన వాడుగా చూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకుపూర్తి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గుజ్జుల జగన్ మోహన్‌రెడ్డి, స్థానిక నేతలు జజ్జర ఆనందరావు, అవిశెన ప్రభాకరరెడ్డి, సోని, పాదయాత్ర రోశయ్య, ఆదిరెడ్డి, గ్రామనాయకులు పాల్గొన్నారు.


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న హనిమిరెడ్డి

ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

అద్దంకి: కులమతాలకు అతీతంగా అందరికీ అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో మాల మహానాడు, అంబేడ్కర్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ మాలల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరో ముఖ్య అతిథిగా ఆ పార్టీ నియోజవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ మాలలకు నేను అండగా ఉంటానని చెప్పారు. నాకు కులమత వర్గ ప్రసక్తి లేదన్నారు. ఏ సమస్య అడిగినా చేసి పెడతానన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సోనీ, మార్కెట్ యార్డు చైర్మన్, జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, పట్టణ ఏజేసీ మండల జేఏసీ ఇన్‌చార్జి మాల జేఏసీ ఇన్‌చార్జి, మాల మహానాడు నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

యువత క్రీడల్లో రాణించాలి

కారంచేడు: యువత క్రీడల్లోనూ రాణించాలని సినీ నటుడు కొల్లా అశోక్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన కారంచేడు గ్రామంలో సందడి చేశారు. గ్రామంలో డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి షటిల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించి మాట్లాడారు. డాక్టర్ రామానాయుడు మెమోరియల్ సౌజన్యంతో డబుల్స్ బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించగా కారంచేడు, ఇంకొల్లు, పర్చూరు, చీరాల మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న సినీనటుడు అశోక్‌బాబు

42 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

అద్దంకి: వారంతా నాలుగు దశాబ్దాల క్రితం ఒకే పాఠశాలలో పదో తరగతి చదుకున్న విద్యార్థులు వృత్తి రీత్యా, ఉద్యోగ, వ్యాపార రీత్యా వేరు ప్రాంతాల్లో ఉంటూ ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో ఒకే చోట కలుసుకున్నారు. ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. చదువుకునే నాటి రోజులను నెమరేసుకుని కాసేపు చిన్న పిల్లలుగా మారారు. వారంతా 1981–82లో ప్రకాశం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ప్రస్తుతం ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల)లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు. కోవి శ్రీనివాసరావు, నాగసూరి సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వంచారు. తమకు విద్యను నేర్పించిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి గురువులు జ్యోతి చంద్రమౌళి, నాగయ్య, ఎస్‌కే ఫాచ్చా, మారం కోటేశ్వరరావు, రోజలీల పాల్గొన్నారు. కార్యక్రమంలో 100 మంది పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

భక్తిశ్రద్ధలతో కోత పండుగ


వాక్య సందేశాలు అందిస్తున్న శ్యామ్‌సంపత్

చీరాల రూరల్: బేరుపేటలోని సెయింట్ ల్యూక్ ప్యారిష్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం కోత పండుగ కార్యక్రమాలను పాస్టర్ డేవిడ్ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏఈఎల్‌సీ డాక్టర్ జి. శ్యామ్‌సంపత్ పాల్గొని దేవునిడివాక్య సందేశాలు అందించారు. కోత పండుగ విశిష్టతను విశ్వాసులకు ఎంతో విపులంగా వివరించారు. హైదరాబాదులో ఏసీటీసీ దైవజ్ఞాన కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జాయ్ రాజేంద్రప్రసాద్, పలువురు ట్రెనింగ్ పాస్టర్స్ పాల్గొని రోడ్ల కూడలిలో పాటలు పాడి వాక్య సందేశాలు అందించారు. కార్యక్రమ నిర్వహణను ఎల్‌సీసీ, పీసీసీ సభ్యులు పర్యవేక్షించారు.


సుదర్శన యాగం నిర్వహిస్తున్న పూజారులు

భక్తి శ్రద్ధలతో సుదర్శన యాగం

వేటపాలెం: ఆణుమల్లిపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణలో సంక్రాంతి బోగి పండుగను పురస్కరించుకొని గోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవాన్ని తిరుమలకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం ప్రాంగణంలో సుదర్శన యాగం నిర్వహించారు. హోమంలో అగ్నికి ప్రత్యేకంగా ప్రకృతి సిద్ధంగా కర్రల సాయంతో రూపొందించి హోమాన్ని వెలిగించారు. ధనుర్మాసం ప్రారంభించిన నెల రోజుల నుంచి అలయంలో తిరుప్పావై పారాయణం నిర్వహించారు. అలయ పూజారి దివి సీతారామ చక్రవర్తి పర్యవేక్షించారు. రాపూరిపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రాంగణలో గోదాదేవి రంగనాథ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గట్టా రమేష్, శ్రీరాం గోవర్ధన్ పాల్గొన్నారు.



ఓ పరమాత్మా! నా సకల అంగాలు - వాక్, చక్షు(కన్ను), శ్రోత్రమ్(చెవి), ఇంకా ప్రాణం, మొదలైన సర్వేంద్రియాలు, నా శారీరక, మానసిక శక్తులన్నీ పరిపుష్టం చేయుము.

- ఉపనిషత్తు

సాక్షి

సోమవారం, 15 జనవరి 2024

శ్రీ సూర్యనారాయణా...

బతుకులో పండుగ కాని క్షణం ఏముంటుంది! జీవితాన్ని కేవలం జీవించడం కాదు, ఉత్సవీకరించుకోమని చెబుతుంది ఒక సూక్తి. కాకపోతే ఒక షరతు; మహాకవి చెప్పినట్టు, మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అవి మనకేనని ఆనందించే పసికూనలమైపోవాలి అందరం. జీవితం అనుక్షణ ఉత్సవభరితమే అయినా ప్రకృతిలో మారే ప్రతి ఋతువూ, కాలం వెంబడి మనిషి వేసే ప్రతి కీలకమైన అడుగూ పెద్దపండుగ అవుతుంది. ధనూరాశి నుంచి మకరరాశి లోకి సూర్యుడి సంక్రమణాన్ని సంకేతించే అలాంటి పెద్ద పండుగే సంక్రాంతి.

ఏటా నెల నెలా రాశి విడిచి రాశిలోకి సూర్యుడు అడుగుపెట్టే ప్రతి సందర్భమూ సంక్రాంతే అయినా, మకర సంక్రాంతి మాత్రమే ఎందుకు మైలురాయి అయిందంటే; అప్పటికి మంచుపొరలు, చీకటి తెరలు క్రమంగా తొలగి వెలుగు వాకిళ్ళు తెరచుకోవడం మొదలవుతుంది. కొత్త పంట చేతికొచ్చిన ఆనందంలో పశువులు, పక్షులతో సహా ప్రకృతి సమస్తం భాగమై మనిషిలో కృతజ్ఞత ఉప్పొంగుతుంది. అలా ప్రతి ప్రాణితోనూ, చెట్టుతోనూ, పుట్టతోనూ తన ముడిని గుర్తుచేసుకునే సందర్భమే సంక్రాంతి. ఆ మాటకొస్తే ఏ పండుగైనా అంతే. చిత్రవిచిత్రమైన రంగవల్లులను తీర్చిదిద్దేది, కొత్త బియ్యపు పిండిని చీమల వంటి సూక్ష్మజీవులకు ఆరగింపు చేసి భూతదయను చాటుకునేందుకేనని పెద్దలంటారు. ఒక్కోసారి తత్త్వం అడుగంటి తంతు మిగలడం కాలం చేసే మాయ.

మనిషి ఊహలో తొలిదైవంగా ముద్రపడిన ప్రాకృతిక అద్భుతమే సూర్యుడు. పరోక్ష దేవతలకు భిన్నంగా ఆయన ప్రత్యక్ష దైవం. అందుకే సర్వసాక్షి, కర్మసాక్షి సహా ఆయన చుట్టూ ఎన్నో కల్పనలు. దేవతల్లో పెద్దాయన ఆయనే. ప్రపంచమంతటా తొలి కొలుపులు అందుకున్నవాడిగా ఆయన వైశ్విక దైవం. దేవుడి గురించిన తొలి ఎరుక కలిగించిన ఆ మెరుపు, మైమరపు ఋగ్వేదంతో సహా ఆదిమ కృతులన్నింటిలో నిసర్గసుందరంగా వ్యక్తమవుతాయి. మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఒకప్పుడు ప్రధాన దైవమైన సూర్యుడికి మన పౌరాణిక ప్రసిద్ధుడైన నారాయణుని పేరు చేర్చిన ఫలితంగానే ఆయన సూర్యనారాయణుడయ్యాడని గుంటూరు శేషేంద్రశర్మ అంటారు. ఒకప్పుడు పశ్చిమాసియాలో మిత్రారాధన పేరుతో వర్ధిల్లిన సూర్యారాధన ప్రభావం ఇతర మతాలపై ఎలా పడిందో అత్యంత ఆశ్చర్యకరంగా వివరిస్తాడు జి.జె.ఎం. ఫ్రేజర్ తన 'గోల్డెన్ బౌ' అనే బృహద్రచనలో. మన శ్రీరామచంద్రుడే కాక, ఒకనాటి పశ్చిమాసియా రాజులు, పర్షియన్ చక్రవర్తులు కూడా తమను సూర్యుడితో ముడిపెట్టుకున్నారు. ఆదిత్యహృదయోపదేశం పొందిన తర్వాతే రాముడు రావణుని జయించగలిగాడని రామాయణం అంటుంది.

సంక్రాంతినీ, సూర్యునీ లోతుగా తడిమిన కొద్దీ ఇంకా ఎన్నెన్ని విశేషాలో! సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఘట్టాన్నే మనం మకర సంక్రాంతిగా జరుపుకొంటాం కానీ నిజంగా సూర్యుడికి గమనమంటూ ఉంటుందా? భూమే సూర్యుడి చుట్టూ ఒకింత వంపుతో తిరుగుతూ దూరమూ, దగ్గరా అవుతున్న క్రమంలోనే కాలాలూ ఋతువులూ ఏర్పడుతున్నాయి. మకర సంక్రాంతిని ఇప్పుడు జనవరి 15న జరుపుకొంటున్నాం కానీ, క్రీ.శ. 1000లో డిసెంబర్ 31న, క్రీ.శ.272లో డిసెంబర్ 21న జరుపుకొనేవారట. మరో తొమ్మిదివేల సంవత్సరాల తర్వాత మకర సంక్రాంతి జూన్ నెలలో వస్తుందట. జ్యోతిశ్శాస్త్ర సంబంధమైన కాలగణనాలు ఇలాంటి విచిత్రాలను ఆవిష్కరిస్తే, శాస్త్రవిజ్ఞానం మరో రకమైన విలక్షణ దృశ్యానికి తెరతీసి ఒక్కోసారి వెన్నులో వణకు పుట్టిస్తుంది. సూర్యుడు ఎంత పెద్దాయనంటే, ఆయన వయసు 460 కోట్ల సంవత్సరాలకు పైనేనట. మరో 500 కోట్ల సంవత్సరాలు గతిస్తే, తన చుట్టూ తిరిగే భూమితో సహా అన్ని గ్రహాలనూ తనలో కలిపేసుకుని ఓ తెల్లని మరుగుజ్జు నక్షత్రంగానూ, ఆ తర్వాత నల్లని నక్షత్రంగానూ మారిపోతాడట. ఆ లోపల తన కేంద్రంలో నిరంతరాయంగా జరిగే కోట్ల టన్నుల హైడ్రోజన్, హీలియమ్‌ల కలయిక నుంచి లక్షల టన్నుల పదార్థం శక్తిగా మారిపోయే క్రమంలోనే మన మనుగడకు అవసరమైన వెలుగు, వేడి లభిస్తున్నాయి. శీతోష్ణాల నిర్విరామ ఘర్షణ నుంచే జీవి పుట్టి మనతో సహా అనేక ప్రాణుల రూపంలో పరిణామం చెందడం వేరే కథ.

మన ఊహకు అతీతమే కాక, మన నిత్యజీవన సంతోషాలకు ఏమాత్రమూ అడ్డురాని సూర్యుని వైశ్విక మూలాలను ఈ పండుగ వేళ మరీ లోతుగా తడమడమెందుకు? ప్రకృతితో మమేకమై వెలుగూ వేడిలో స్నానిస్తూ ఈ క్షణాలను మధురమధురం చేసుకుందాం. పొన్న, ఉల్లి, జాజి, సంపంగి, మల్లె, మంకెన, ములగ, ఆవ, వంగ, గుమ్మడి పూచాయలు ధరించే ఆ సూర్యనారాయణుడికి నోరారా మేలుకొలుపు పాడుకుందాం. కవయిత్రి కుప్పిలి పద్మ అన్నట్టు, ఒక్కుమ్మడిగా పండుగను పిలిచేందుకు ఈ చేతులతో చుక్కల ముగ్గుల్ని, రంగుల చామంతుల్ని పూయిద్దాం. ఎక్కడెక్కడి చుట్టాలనో ఏడాదికొకచోట కలిపే సారంగధర మెట్ట మీది తనివితీరని తిరునాళ్ళ పుట్టినిల్లు జ్ఞాపకాల నెగడు దగ్గర చలి కాగుదాం. చెట్టుకొకరుగా పుట్టకొకరుగా తుప్పల వెంటా పుంతల వెంటా పడి తిరుగుతూ, ముళ్ళు గుచ్చుకోకుండా, ఒక్క మొగ్గనీ తెంపకుండా, ఒక్క పువ్వునూ వదలకుండా మృదువైన పూల వేట సాగిద్దాం.

ఇలా కాదే వీళ్లు ఉండాల్సింది!

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ భిన్నమైన దేశం. బ్రిటన్ దేశస్థులు విలక్షణమైనవారు. ఎవరి వ్యక్తిగత జీవితాలలోకీ తొంగిచూడరు. నిత్య జీవిత భౌతిక సంభాషణలలో అంతర్లయగా ఉన్న హాస్యాన్ని చక్కగా పట్టుకోగలరు. విధి నిర్వహణలలో ఘటనాఘట సమర్థులు. మర్యాద ఇవ్వడంలో మన రామన్నలను మించినవారు. ఎంతటి విపత్తుకైనా ముందస్తుగా సిద్ధమై ఉండేవారు. పరదేశీ అతిథులను గౌరవించి, ఆదరించేవారు. తలవని తలంపుగానైనా తమ దేశానికి అప్రతిష్ఠను తీసుకురాని వారు. అంతటి ఉత్కృష్ట ప్రజల పైన, అంతటి నాగరిక దేశం మీద గత డిసెంబరు 23న హీత్రో విమానాశ్రయంలోని మూడవ నంబరు టెర్మినల్ పూర్తి విరుద్ధమైన నీడల్ని ప్రసరింపజేసింది! 'ఇలా కాదే వీళ్లు ఉండాల్సింది' అన్న భావనను ఆనాటి ప్రయాణికులకు కలిగించింది.

ఇక్కడి నా వ్యాసాల సరళిని బాగా ఎరిగివున్న వారికి ఆ వ్యాసాలలో తరచు నేను బ్రిటన్ దేశాన్ని, బ్రిటన్ దేశస్థులను ఆకాశానికి ఎత్తేసినంతగా వెనకేసుకు రావటమన్నది గ్రహింపునకు వచ్చే ఉంటుంది. బ్రిటన్ దేశస్థుల గుండె ధైర్యాన్ని నేను ఇష్టపడతాను. వ్యక్తుల జీవితాలలోని గోప్యతను గౌరవించి, వారి ఆంతరంగిక విషయాలలోకి చొరబడకుండా ఉండే ఆ స్వభావాన్ని ప్రశంసిస్తాను. అంతేకాదు, ప్రపంచంలోనే బ్రిటిషర్ గొప్ప హాస్యచతురత ఉన్నవారనీ దృఢంగా విశ్వసిస్తాను. ఇది చాలా వరకు ఉద్దేశపూర్వకమైన అతిశయోక్తి, తేలికపాటి వ్యంగ్యోక్తి, పైనుంచి కిందివరకు కూడా నర్మగర్భ విమర్శ. ఇదంతా ఎక్కువగా బ్రిటన్ రాచకుటుంబం పైన! ఈ క్రమంలో వారి అసహజ ప్రవర్తనల్ని అభినందించడం, వారి అసాధారణతల్లోని అవకరాలను కనుకొనల్లోంచి చూసీచూడనట్లుగా వదిలేయడం, వారు మాటిమాటికీ చేస్తుండే తప్పులను మన్నించడం వంటి మనో నైపుణ్యాలను నేను పెంపొందించుకున్నాను.

కానీ డిసెంబర్ 23 సాయంత్రం హీత్రో విమానాశ్రయంలోని 3వ టెర్మినల్‌లో ఏదైతే జరిగిందో అది మాత్రం క్షమించలేనిది. నిజానికి క్షమించ తగనిది. మరోమాటకు ఆస్కారం లేకుండా అదొక వాదనలకు తావులేని అసమర్థతకు నిదర్శనం. బ్రిటన్‌ను సందర్శించే వ్యక్తుల పట్ల నమ్మశక్యం కానంతటి అమర్యాదకరమైన ధోరణి. బహుశా ఎన్నడూ లేనంతగా పూర్తిస్థాయి ఆత్మాశ్రయ ఓటమి. బ్రిటన్ స్వరూపాన్ని గరిష్ఠ స్థాయిలో ఘోరాతిఘోరంగా వీక్షింపజేసిన ఉదాసీనత.

రాత్రి ఎనిమిది గంటలకు విమానం దిగిన ప్రయాణికులు విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం కిక్కిరిసిపోయి, మందకొడిగా మెలికలు తిరుగుతూ ముందుగు సాగుతూ ఉన్న పొడవాటి వరుసలో రెండున్నర గంటలసేపు విధిలేక వేచి ఉండవలసి వచ్చింది. పాదం నొప్పితో నేను అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఇంకా ల్యాండ్ అవుతున్న విమానాల నుంచి కొత్త ప్రయాణికులు మా వరుసలోకి వెనుక నుంచి జమ అవుతుండటం గమనించాను. ఇప్పుడు వరుసలో వేచి ఉండే కాలం బహుశా రెండున్నర నుంచి నాలుగు గంటలు అవుతుందా! ఫస్ట్ క్లాస్, అంతకంటే కాస్త మాత్రమే దిగువ శ్రేణిలో ఉండే క్లబ్ క్లాస్ ప్రయాణికులు కూడా మా క్యూలో ఉన్నారు. వారి కోసం వేరుగా ఏర్పాటై ఉండే 'ఫాస్ట్ ట్రాక్'ను బ్రిటన్ తొలగించి ఉండటమే అందుకు కారణం.

విమానాశ్రయ అధికారులకు ఇదేమైనా పట్టి ఉంటుందా? నిజం ఏమిటంటే, వారిలో ఒక్కరు కూడా విచారం వ్యక్తం చేయటం లేదు. క్షమాపణ కోరటం అటుంచండి, అడిగిన దానికి సమాధానం చెప్పిన వారైనా ఎవరు? ఒకవేళ క్యూలో ఉన్న ప్రయాణికులు బాత్‌రూమ్‌కి వెళ్లవలసివస్తే వారి పరిస్థితి ఏమిటన్న కనీస ఆలోచనైనా వారికి వచ్చి ఉంటుందా? నాకు గుర్తున్నంత వరకు క్యూలో ఉన్న వారెవరికీ అదృష్టవశాత్తూ ఆ అవసరం రాలేదు. లేదా, అలాంటి అవసరం వచ్చినప్పటికీ వారు క్యూలో తమ స్థానం కోల్పోయి, మరిన్ని అంతులేని గంటలపాటు వేచి ఉండవలసి వస్తుందన్న భయంతో ఆ బాధను అలాగే ఉగ్గబట్టి ఉండాలి.



అదీంకా క్రిస్మస్‌కు వచ్చిపోయే వారు ఎక్కువలో ఎక్కువగా ఉండే సమయం. ఆ రద్దీని ముందే ఊహించి, అందుకు సిద్ధంగా కదా అధికారులు ఉండాలి. పైగా హీత్రో విమానాశ్రయానికి గతంలో ఇలాంటివి చాలినన్ని అనుభవాలు ఉన్నాయి. 2019లో ఈ విమానాశ్రయం ద్వారా దాదాపు 8 కోట్ల 10 లక్షల మంది రాకపోకలు సాగించారు.

అయినప్పటికీ 23న సగానికి పైగా ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌లు సిబ్బంది లేకుండా కనిపించాయి. చివరికి ఎట్టకేలకు నా వంతు వచ్చినప్పుడు, క్లియరెన్స్ కోసం నా దగ్గరికి వచ్చిన అధికారి దగ్గర కనీసం పెన్ను కూడా లేదు! పెన్ను కోసం అతడు తన సహ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పుడు నేను మరికొన్ని ఆవేదనా భరితమైన నిమిషాలను గడుపుతూ అతడి కోసం వేచి ఉండవలసి వచ్చింది. అదృష్టవశాత్తూ నాల్గవ వ్యక్తి దగ్గర అతడికి - మళ్లీ తిరిగి ఇచ్చే షరతుపై - ఒక పెన్ను లభించింది.

అప్పటికి మా బ్యాగులు లగేజ్ బెల్టుల నుంచి జారి వచ్చి, తీరూతెన్నూ లేకుండా కలగాపులగంగా పడిపోయాయి. కొన్ని అసలైన చోటులో, మిగతావి చాలా వరకు విసిరివేసినట్లుగా అక్కడికి దూరంగా చెల్లాచెదురైన వాటిలో! వాటి నుంచి నా రెండు బ్యాగుల్ని కనిపెట్టి తీసుకోడానికి మరొక అరగంట! దాదాపు మూడు వందల మంది ప్రయాణికుల బ్యాగులతో అవి కిందా మీదా అయి కేవలం కలిసిపోవడం మాత్రమే కాదు, వాటిని వెతికి పట్టుకోడానికి అవి ఏమాత్రం పడి ఉండే అవకాశం లేని చోట వాటిని కనిపెట్టాల్సి వచ్చింది.

ఢిల్లీ నుంచి ముందురోజు రాత్రి బుక్ చేసుకున్న క్యాబ్ డ్రైవర్ నేను హీత్రోలో ల్యాండ్ అయిన వెంటనే నాకు ఫోన్ చేసి, తను విమానాశ్రయ నిష్క్రమణ మార్గం వైపు ఉన్న డబ్ల్యు.హెచ్. స్మిత్ కౌంటర్ దగ్గర నా కోసం వేచి ఉన్నానని చెప్పాడు. కానీ నేను అతడిని చేరడానికి మూడు గంటల సమయం పడుతుందని అనుకుని ఉండడు. నా కోసం ఓపికగా వేచి ఉండటం తప్ప అతడికి వేరే దారి లేదు. లేకుంటే హీత్రో బాడుగకు అతడికి డబ్బు రాదు కదా!

ఇది ఆమోదయోగ్యం కాదని బ్రిటీష్ ప్రభుత్వానికి గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉన్నందున నేను ఇదంతా నిజాయితీగా రాస్తున్నాను. ఇంతకుమించి వేరే మార్గం లేదు. ఎవరికి నేనీ అనుభవాన్ని చెప్పినా భయపడిపోయారు. కానీ ఇది నాకు మాత్రమే ప్రత్యేకమైన అనుభవం కాదు. ఇలా వేల మందికి, బహుశా పదుల వేల మందికి జరిగి ఉంటుంది. టెర్మినల్ 3లో ఇది సర్వసాధారణం. అయితే ఈ సర్వసాధారణత్వాన్ని ఒక మామూలు విషయంగా బ్రిటీష్ అధికారులు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

కనుక ఒక వ్యంగ్య వ్యాఖ్యతో, ఒక విధమైన ప్రతీకారం వంటి సూచనతో ఈ వ్యాసాన్ని నేను ముగిస్తాను. టెర్మినల్ 3లో దిగితే భారతదేశ పాస్‌పోర్టు కలిగివున్న తన అత్తమామలకు కూడా ఇదే జరుగుతుందని రిషి సునాక్ గ్రహించగలరా... బహుశా ఆయన వాళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తే తప్ప?

నా సలహా. ప్రతి భారతీయ విమానాశ్రయంలో ఫాస్ట్ ట్రాక్‌ను ఉపయోగించకుండా బ్రిటిష్ పౌరులందరినీ నిరోధించాలి. అది నిజంగా జరిగితే హీత్రోలో పరిస్థితులు చాలా త్వరగా మెరుగు పడతాయి. నిజం! నా మాట నమ్మండి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇవీ తేడాలు!



గుర్తుంచుకోండి: హిందూయిజం హిందూత్వ కాదు. హిందూత్వ జాతీయవాదం కాదు. జై శ్రీరామ్ అనేది జై సియారామ్ లేదా రామ్ రామ్ లాంటిది కాదు. ప్రభుత్వం, ప్రధాని మాత్రమే దేశం కాదు. అయోధ్యలోని రామాలయ లక్ష్యాలు: ఒక మనిషిని అమితంగా పెంచడం, రాజకీయ లబ్ధి.

- ఉర్విశ్ కోఠారీ, గుజరాతీ రచయిత

జెంటిల్‌మన్ల కోసం...



టాయ్‌లెట్లలో కొంతమంది మగవాళ్లు సీటును ఎత్తకుండానే మూత్రం పోస్తుంటారు. ముఖ్యంగా విమానాలు, రైళ్లలో కామన్ టాయ్‌లెట్ ఉన్నప్పుడు ఆ సీటు మీద కూర్చోలేక స్త్రీలు చాలా ఇబ్బందిపడతారు. అందుకే నా జీవితాన్ని, టాయ్‌లెట్‌ను ఒక స్త్రీతో పంచుకోవడం మొదలుపెట్టినప్పుడు, నేను కూడా మహిళల్లాగే కూర్చుని మూత్రం పోయాలని నిర్ణయం తీసుకున్నాను. వాళ్లకోసం కనీసం టాయ్‌లెట్‌ను శుభ్రంగా ఉంచడమైనా మనం చేయగలం.

- రాహుల్ రవీంద్రన్, నటుడు

విలువైన బహుమానం



అందమైన నేపాలీయులు (అయోధ్యలోని) రామాలయం కోసం సాలగ్రామాలను బహూకరించారు. రాముడు, సీత విగ్రహాలను వాటినుంచి చెక్కుతారు. 1951లో నేపాల్ రాజు త్రిభువన్ వీర్ విక్రమ్ షా నేపాల్‌ను భారత్‌లో విలీనం చేస్తానని అన్నారు. ఆ ప్రతిపాదనను నెహ్రూ తిరస్కరించారు.

- ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

అంత కష్టమా?



యెమెన్ మీద యూకే నావిక సైనిక చర్యకు పాల్పడగలదు; కానీ పడవల మీద అక్రమంగా వలస వచ్చేవారిని అడ్డుకోవడానికి ఇంగ్లీష్ ఛానల్‌ను మాత్రం మూసివేయలేదా?

- ఇంతియాజ్ మహమూద్, థింకర్

కొత్త చీదర



రెస్టారెంట్లలో క్యూఆర్ కోడ్స్‌ను సాధారణీకరించడాన్ని నిర్మూలించడానికి పూనుకునే ఏ అతివాద గ్రూపునకైనా నిధులు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

- కబీర్ తనేజా, ఫెలో

అందరికీ దూరంగా...



తన జీవితమంతా మా తాతయ్య నన్ను ఎంతో ప్రేమించాడు. ఆయన ఈరోజు (జనవరి 13) చనిపోయాడు. ఆయన్ని నేను 14 ఏళ్లుగా చూడలేదు. 4 ఏళ్లుగా ఆయనతో కనీసం మాట్లాడలేదు. ఇస్లాంలో మతభ్రష్టతకు చెల్లించాల్సిన మూల్యానికి అంతం లేదు.

- అలీ మాలిక్, పాకిస్తాన్ నాస్తికుడు

ఇన్ బాక్స్

పుష్యలక్ష్మి



గోమయంబుతో గొబ్బెమ్మలు
శోభాయమానమై కొలువుదీరే
ముంగిళ్ళందు రంగవల్లులు
ముస్తాబై మురిసే
భుగ భుగల భోగి మంటలు
భోగ భాగ్యాలనిచ్చే భవ్య భోగి!

పుడమినందు పాడిపంటలు
పొంగిపొరలే
దండిగా ధాన్యపు రాశులు
రైతు లోగిళ్ళకు తరలే
వచ్చేను క్రాంతి తెచ్చేను శాంతి
స్వాగతంబు పలికే సంక్రాంతి!

పసుపు కుంకుమలద్ది
పశువుల పూజించి
పాలి చెలకల్లో పొంగళ్ళు జల్లి
మన్ను మిన్నులకు ప్రణమిల్లి
కాచు మమ్మేలు కనుమ గౌరి!!

- బోనగిరి పాండురంగ

పచ్చా పొంగలి... పాలా పొంగలి... పొంగలో పొంగలి!

సందర్భం



ప్రొ॥ నాగపట్ల భక్తవత్సల రెడ్డి

గొబ్బియాళ్లో గొబ్బియని పాడారమ్మ
కంచి వరదరాజులే గొబ్బియాళో
గొబ్బియాళో పతిని పార్వతినీ దలసి
పరమ గొబ్బి తట్టారే గొబ్బియాళో
గొబ్బియల్లో భామలందరు గూడి భజన
గొబ్బి తట్టరే గొబ్బియల్లో
గొబ్బియల్లో భామలందరూ గూడి
బాయినీళ్ళకు పోయిరే గొబ్బియల్లో
గొబ్బియల్లో గొబ్బియని పాడారమ్మ
కంచి వరదరాజులే గొబ్బియల్లో

డిసెంబరు 15 లేదా 16 మొదలు జనవరి 14 లేదా 15 వరకు ఉండే నెల తిరుపతి ప్రాంతంలో పండగ నెల. ధనుర్మాసం, మార్గళి మాసం అని కూడా అంటారు. ఈ మాసం చాలా పవిత్రమైంది. ఈ నెల మొత్తం పొద్దున్నే ఇంటి ముందర కళ్లాపి చల్లి ముగ్గు వేసి పేడతో చిన్న చిన్న ముద్దలు చేసి, గుమ్మడి పువ్వు పెట్టి గొబ్బెమ్మలు బేసి సంఖ్యలో పెడతారు. ఈ గొబ్బెమ్మల్ని తర్వాత గోడమీదనో లేక కాలు తగలడానికి అవకాశం లేని చోటో పిడకలు తట్టి ఎండ బెడతారు. ప్రతిరోజు ఆడవారు రాత్రి పూట గాని లేదా వీలు చూసుకొని పగటి పూట గాని గొబ్బి తట్టుతూ గొబ్బి పాటలు పాడుకుంటారు. ఒకపుడు పెండ్లి కావలసిన వారు మాత్రమే పాడేవారని అంటారు కాని ఇపుడు అందరూ పాడుతున్నారు. గొబ్బి పాటల్లో గొబ్బెమ్మను మేల్కొల్పి, నిద్రబుచ్చే పాటలు ఉండేవి. గొబ్బియాళ్లో, గొబ్బియల్లో అని పాట పాదానికి ముందు చివర, లేదా పాదాంతంలో లేదా ఆ పదమే లేకుండా పాడే గొబ్బిపాటలు మార్గళి మాసంలో మార్మోగుతుండేవి. వందలకొద్దీ ఉండిన ఈ పాటలు కనుమరుగవుతున్నాయి.

ఈ నెలలో ఆడవారు పోటీలు పడి ముగ్గుపిండి ముగ్గులు, రుబ్బిన బియ్యపు పిండితో వేసే ముగ్గులు పెట్టేవారు. చుక్కల ముగ్గులు, గీతల ముగ్గులు కూడా ఉంటాయి. ముగ్గులతో పాటు ఎర్రమట్టి (కాషాయ రంగు) పట్టీలు గీసేవారు. సంక్రాంతి నాలుగు రోజుల పండగ- భోగి, పెద్ద పండగ, పశువుల పండగ, కనుమ పండగ (ఊరిని బట్టి పండగ పేర్లు, రోజులు మారవచ్చు). తెల్లవారు జామున వేసే భోగి మంటల్లో పాత లేదా పనికిరాని పనిముట్లు, గంపలు, చేటలు, చింకి చాపలు, ఒక నెల ముందు నుంచి సేకరించి భద్రపర్చిన తుట్లు లేదా కంపతో పాటు వేస్తారు. పొద్దున్నే భోగిలోనే అండాలు పెట్టి నీళ్లు కాచి, ఆ నీళ్లతో తలంటు స్నానాలు చేసేవారు. ఇంటిలోని నులక మంచాలు, పనిముట్లు ఆ వేడి నీళ్లతోనే కడిగేవారు. ఇది మాంసాహారం (తినేవారికి) తప్పనిసరి.

రెండో రోజు పెద్దపండగ. పూర్తిగా శాకాహారం (కొన్ని కులాల్లో మద్యం, మాంసాహారం కూడా) ఉంటుంది. ఇల్లంతా అలికి పిండి ముగ్గులు వేసి, ఎర్రమట్టి పట్టీలు గీసి, రంగులద్ది, గుమ్మాలకు మామిడాకు తోరణాలు కట్టి అలంకరించుకొనేవారు. ఒకనాడు పడమటింటిలో నైరుతి మూల గోడకు చిన్న చతురస్రాకారంలో ఆకులు నలిపి పచ్చగా రుద్ది దానిమీద పసుపుబొట్లు పెట్టేవారు. ఇది పేరంటాలుకీ, పెద్దలకూ పెట్టుకొనే స్థలం. అదే ఇంటిలో వాయవ్య మూల దేవుళ్ల పటాలు ఉండేవి. చనిపోయిన వారికి బట్టలు పెట్టి, మూడు తరాల వారికి తర్పణాలు వదిలి, బేసి సంఖ్యలో అరటి విస్తర్లు వేసి, పలురకాల వంటలతో, అవిశాకు, గుమ్మడి పొరుటు తప్పనిసరిగా వడ్డించి, నైవేద్యం ఇచ్చి కొనియాడే పండగ ఈ పెద్దపండగ. పెద్దపండగ రోజు అన్నం కన్నా కూరలు ఎక్కువ తినాలన్న నమ్మకం ఉంది. రాత్రి మిగిలిన కూరలన్నింటిని రాత్రి కుంపటి మీద ఉంచి ఆ కలగూర మర్నాడు కూరగా వాడుకునేవారు. గొబ్బి తట్టుతూ పాడే పాటలతో (బాణీ, పాటల్లో కూడా బతుకమ్మ పాటలతో సామ్యం చూడవచ్చు) ఊరు సంగీతాత్మక లోకంగా మారిపొయ్యేది. గొబ్బిపాటలు పాడడానికి ఇదే చివరి రోజు.



మర్నాడు పశువుల పండగ. తెల్లవారు జామున పొద్దు మొలవడానికి ముందే తూర్పు దిక్కున పడమటి ముఖంగా కొత్త పొయ్యి పెట్టి మూడు పొంగళ్లు - పెద్ద పొంగలి, సూర్య పొంగలి, గొబ్బి పొంగలి - పెట్టేవారు. పొంగు వచ్చేటపుడు 'పచ్చా పొంగలి పాలా పొంగలి పొంగలో పొంగలి' అంటారు. తూర్పు లేదా ఉత్తరం వైపు పొంగితే మంచిదన్న నమ్మకం. తెల్లవారేటప్పటికి ఎద్దుల్ని కడిగి, కొమ్ములకు రంగులు పూసి నల్లేరు, తంగేడు ఆకులు పూలతో దండలు కట్టి అలంకరిస్తారు. ఆ రోజు దొడ్డిలోని పేడనంతా ఒక కువ్వగ పోసి దాని మీద నల్లేరు, తంగేడు వేసి సింగారిస్తారు. పెద్ద పొంగలిలోని అన్నాన్ని విస్తరిలో, పొంగిన నీటిని చెంబులో పేడ కువ్వ ముందర పెట్టి పూజిస్తారు. ఆ విస్తరిలోని అన్నంలో పసుపు కుంకుమ (ఒకప్పుడు పసుపు సున్నం) కల్పి దాన్ని ఇంటి పైన, దొడ్డిలో, ఇంకా పొలంలో కూడా 'పొలో పొలో' అంటూ పొలి చల్లుతారు. ఇంకొకరు పొంగటి నీటిని అదే సమయంలో 'పొంగలో పొంగలి' అంటూ అనుసరిస్తారు. సూర్యపొంగలి పెట్టి సూర్యుడికి నైవేద్యం, గొబ్బి పొంగటి కూడు పెట్టి గొబ్బెమ్మను పూజిస్తారు. గొబ్బెమ్మకు ఇది చివరి రోజు. నాలుగో రోజు గ్రామదేవతకు పొంగళ్లు పెడతారు. రాత్రి 'ఊరు మెరవణి' ఉంటుంది (ఇది కొన్ని ఊర్లలో మాత్రమే).

ఈ నెల మొత్తం పవిత్రం కనుక శుచీ శుభ్రతకు పెద్ద పీట. పండగకు ఇంటిల్లిపాదికీ, పెద్దలకూ, కొత్త అల్లుళ్లకు కూడా కొత్త బట్టలు. మొత్తం మీద ఈ నెల అంతా సంక్లిష్టంగా, భిన్న అంశాలతో కూడుకొని ఉంటుందని చెప్పవచ్చు.

ఇదే నెలలో ఉత్తర కేరళ ప్రాంతంలో 'ధనుర్మాసత్తిల్ తిరువాదిర ... తిరువాదిర' అంటూ ధనుర్మాసంలోని అరుద్ర నక్షత్రం రోజున తెల్లవారు జామునే నదికి వెళ్లి స్నానం చేసి ఉపవాసాలతో పూజలతో తమ భర్త చిరాయువుగా ఉండాలని కోరుకొంటూ ఆచరించే వ్రతం ఒకటి ఉంది. తెల్లవారు జామున చేసే స్నానం ఒక వారం ముందు నుంచే ప్రారంభిస్తారు. చాలా సాంగ్యాలున్నాయి. తిరువా దిర సమయంలో ప్రతి ఇంటిలోనూ ఉయ్యాలలు కట్టి ఊగడం కూడా ఒక ఆచారం. అలాగే కొంతమంది సర్ప కావు - పాముల పొదల్లకు కూడా పోతారు. ఆ రోజున తమ భర్త చిరాయువుగా ఉండాలని 108 తమలపాకుల తాంబూలం కూడా సేవిస్తారు.


ఆడి (ఆషాఢం) మాసంలో భార్యాభర్తలు కలిస్తే ఎండాకాలంలో, పండగ నెలలో కలిస్తే వర్షాకాలంలో ప్రసవం ఉండడానికి అవకాశం ఉంది. ఆ రెండు కాలాలు కూడా పుట్టిన బిడ్డకు - బహుశా వాతావరణ మార్పు వల్ల - మంచిది కాదన్న సందేశం పండగనెల పీడనెల అనీ, ధనుర్మాసం శూన్యమాసం అనీ, ఈ నెలలో ఏ పనీ చేయరాదని, ప్రతీకాత్మకంగా దానికి సంబంధించిన అంశాల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రచారంలో పెట్టారని అనిపిస్తుంది.

వ్యాసకర్త జానపద విజ్ఞాన పరిశోధకులు
మొబైల్: 94401 70703

సంక్రాంతి సంబరం

సూర్యుడు నెలనెలా ఒక రాశి దాటి మరొక రాశిలోకి సంక్రమిస్తూనే ఉంటాడు. కానీ ఆయన మకరరాశిలో ప్రవేశించే సమయానికి ఉన్న ఆధ్యాత్మిక, భౌగోళిక, ఆర్థిక పరమైన ప్రాముఖ్యాలు మరే ఇతర సంక్రమణానికీ వర్తించవు. మకరంలో ప్రవేశించిన సూర్యుడు ఆరు నెలల పాటు (జనవరి-జూలై) ఉత్తర దిశగా ప్రయాణం చేస్తాడు. ఆ ఉత్తరాయణంలో మనకు దగ్గరవుతాడు. చలి తగ్గి, వెచ్చదనం క్రమంగా పెరుగుతుంది. తరవాతి ఆరు నెలలు (జూలై-జనవరి) ఆయన దక్షిణంగా వెళతాడు. క్రమంగా మనకు వేడిమి తగ్గి చలి పెరిగిపోతుంది.

ఆధ్యాత్మిక పరంగా కూడా ఉత్తరాయణం పుణ్య కాలం. ఉత్తరాయణంలో శరీరం త్యజించిన బ్రహ్మవేత్తలు అర్చిరాది మార్గాన ప్రయాణించి బ్రహ్మ సాయుజ్యం పొందగలరని భగవద్గీత చెప్తుంది. ఇక ఆర్థిక పరంగా చూస్తే, మకర సంక్రాంతి కాలానికి మన ప్రాంతాల కర్షకులకు ధాన్య సంపద చేతికందుతుంది. ప్రజలు కొంత తృప్తిగా ఉంటారు. గ్రామాలు, ముఖ్యంగా సంపన్నగ్రామాలు కళకళలాడుతూ ఉంటాయి. ఆర్థిక పుష్టి ఉన్నప్పుడు సాంస్కృతిక సమృద్ధి కూడా సాధారణంగా అనుసరించి వస్తుంది.



సంక్రాంతి సమయం సాంప్రదాయికంగా సమకూరుస్తూ వస్తున్న కళకళలకు ముఖ్య కారణాలు మూడు. ఒకటి - దైవానుగ్రహం వల్ల కలిగిన వర్షపాతం, శీతోష్ణస్థితుల ఆనుకూల్యం. రెండు - చెమటోడ్చిన కర్షకుల, కార్మికుల శ్రమశక్తి. మూడు - పశుగణం అందించిన సహకారం. అందుకే, మూడు రోజుల పెద్దపండగ జరిపి, కొంత సమయం దైవారాధనకూ, మరికొంత సమయం రైతన్నలూ, వాళ్ళ కుటుంబీకులు, సహాయకుల సరదాలకూ, ఉత్సాహోల్లాసాలకూ, మూడో రోజు పశువుల పండగకూ కేటాయించే సంప్రదాయం ఏర్పడినట్టు కనిపిస్తుంది.

ఇహమే కాక, పరం కూడా ఒకటి ఉన్నది కదా! డబ్బు చేత ఉన్నపుడూ, అంతో ఇంత దానధర్మాలు, అందునా పుణ్యకాలంలో చేస్తే, జన్మాంతరంలో కూడా మేలు. అందుకే, ధనం చాలకపోతే, కనీసం పెరట్లో కాసిన గుమ్మడి కాయన్నా(కూష్మాండం) దానం చేసే ఆనవాయితీ ఏర్పడింది. కాలగతిలో ఇతర ధనార్జన మార్గాలు సమకూరి, జాతీయాదాయంలో వ్యవసాయాదాయం పాలు ఎనభయి శాతం నుంచి పద్ధెనిమిది శాతానికి పడిపోవడం వల్ల, పెద్ద పండగ ప్రభా, ప్రాభవం ఇప్పుడు నిస్సందేహంగా కొంత తగ్గింది. అయినా, హెచ్చు తగ్గులుండవచ్చేమో కానీ, మనిషికి పాడిపంటల అవసరం ఉన్నన్నాళ్లూ సంక్రాంతి పండగ ప్రాధాన్యం కొనసాగుతూనే ఉంటుంది. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

- ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శు.చవితి ఉ.9.59 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: శతభిషం ప.1.13 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.7.10 నుండి 8.38 వరకు, దుర్ముహూర్తం: ప.12.32 నుండి 1.20 వరకు తదుపరి ప.2.47 నుండి 3.35 వరకు, అమృతఘడియలు: ఉ.6.31 నుండి 7.58 వరకు, మకర సంక్రాంతి.ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.40.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

కష్టాలనుంచి గట్టెక్కించిన సర్కారు



నా భర్త శ్రీనివాసులు గృహ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ నెలకు సుమారు పది వేల రూపాయలు సంపాదించేవారు. నేనూ కూలికి వెళ్లేదాన్ని. నా భర్త ఆదాయానికి నా కూలి డబ్బులు తోడయ్యేవి. ఇలా కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జీ.ఎర్రగుడిలో ఎలాగోలా జీవిస్తున్నాం. హఠాత్తుగా మా బతుకులో పెద్ద ఆపదొచ్చి పడింది. అయిదేళ్ల క్రితం నా భర్త ప్రమాదానికి గురయ్యారు. వెన్నెముక దెబ్బ తిని ఏ పని చేయలేకపోతున్నారు. దీంతో కుటుంబ భారమంతా నాపై పడింది. మాకు ఎకరంన్నర పొలం ఉంది. కంది, వేరుశనగ తదితర పంటలు సాగుచేస్తుంటాం. వర్షాలు కురిస్తేనే పంట చేతికి వస్తుంది. ఏడాదికి సుమారు పది నుంచి 15 వేల రూపాయలు ఆదాయం ఉంటుంది. లేదంటే లేదు. పెద్దకొడుకు కార్తీక్ 10వ తరగతి, చిన్న కొడుకు నవీన్ 8వ తరగతి జొన్నగిరి జెడ్పీ స్కూల్‌లో చదువుతున్నారు. కుటుంబ పెద్ద మంచం పట్టడంతో పిల్లల చదువులు సాగవని బెంగ పెట్టుకున్నాం. ఇలాంటి సమయంలో ప్రభుత్వ పథకాలు మాకు ఎంతగానో ఆదుకున్నాయి. పొదుపు సంఘంలో లింకేజీ కింద రూ.80వేలు, పొదుపు సంఘం నుంచి రూ.50వేలు రుణం తీసుకొని పొట్టేళ్లు కొనుగోలు చేశాను. వైఎస్సార్ ఆసరా కింద రూ.20,400 మాఫీ సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అయింది. నాకొడుకు చదువుకు అమ్మ ఒడి పథకం ఆధారమైంది. రైతు భరోసా సొమ్ము కూడా అందుతోంది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మంజూరైన రూ.18,750తో మరో నాలుగు పొట్టేళ్లు కొనుగోలు చేసి మేపుతున్నా. వీటి వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. కష్టాల నుంచి గట్టెక్కించిన ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వడ్డే రాజేశ్వరి, జి.ఎర్రగుడి, తుగ్గలి మండలం
(కె.రామచంద్రారెడ్డి, విలేకరి, తుగ్గలి)

పెద్ద కొడుకులా ఆదుకున్నారు



మాది కూలి పనులు చేసుకునే నిరుపేద కుటుంబం. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన నేను నా భార్య పనులకు వెళ్తే తప్ప కుటుంబం గడవని పరిస్థితి. మాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె శివశంకరమ్మ 20ఏళ్ల క్రితమే అనారోగ్యంతో చనిపోయింది. కుమారుడు గురుశంకర్ బతుకుతెరువు కోసం కువైట్‌కు వెళ్లి, డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మాకున్న ఇల్లు వర్షానికి తడుస్తుండటంతో టార్పాన్లు వేసుకుని కాలం గడుపుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా బతుకులకు భరోసా దక్కింది. నాకు పింఛన్‌తోపాటు చౌటపల్లె గ్రామం కొత్తపల్లెలో సెంటు భూమిలో పక్కా గృహం మంజూరైంది. నా భార్య లక్ష్మీదేవికి వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750లు వంతున ఇప్పటికి మూడు విడతల్లో రూ.56,250లు అందింది. దీంతో గొర్రెలు, మేకలు కొని కొంత ఉపాధి పొందుతున్నాం. పింఛన్ ఈ నెల నుంచి రూ.3 వేలు చేశారు. జగన్‌బాబు ఇచ్చిన సెంటు స్థలంలో ఇంటి నిర్మాణం చివరి దశకు వచ్చింది. దీన్ని పూర్తిచేసుకుని, మిగిలిన జీవితం ఆనందంగా గడిపేస్తామన్న నమ్మకం పెరిగింది. రోగం వస్తే టౌన్‌కు పోవాల్సిన పని లేదు. ఊళ్లోకే డాక్టర్ వస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో నాకు, నా భార్యకు పరీక్షలు చేసి, మందులు ఉచితంగానే ఇచ్చారు. పెద్ద కొడుకులా సీఎం జగన్ మమ్మల్ని ఆదుకుంటున్నాడు. మళ్లీ జగన్‌బాబే సీఎం కావాలి.

– ఉప్పుతోళ్ల గంగయ్య, కొత్తపల్లె, చౌటపల్లె గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా
(ముప్పాల నరసింహరాజు, విలేకరి, లక్కిరెడ్డిపల్లె)

జగనన్న ప్రభుత్వం అండగా నిలిచింది



మాది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి గ్రామంలో నేను నా భర్త కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న తరుణంలో విధి వక్రించి మా కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. సుమారు 20 ఏళ్ల కిందట నేను నాల్గో నెల గర్భిణిగా ఉన్నప్పుడు నా భర్త చనిపోయారు. తరువాత నాకు ఒక ఆడపిల్ల పుట్టింది. కూలిపని చేసుకుంటూ, ఆ పిల్లను కంటికి రెప్పలా పెంచుకుంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తూ వచ్చాను. ఆమెకు పెళ్లి చేసి అత్తారింటికి పంపించాను. ఒంటరిగా మిగిలిన నాకు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వితంతు పింఛను మంజూరైంది. ఈ ప్రభుత్వం వచ్చాక పింఛను రూ.3000కు పెరిగింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏడాదికి రూ 16 వేలు వంతున ఇప్పటివరకూ అందింది. జగనన్న కాలనీ పథకంలో భాగంగా ఎంతో ఖరీదైన ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం కూడా త్వరలో ప్రారంభిస్తామని మా వూరి సర్పంచ్ చెప్పారు. ఏ ఆసరా లేని మాలాంటివారిని ఆదుకుంటున్న జగనన్నకు ఎప్పుడూ రుణపడిఉంటాం.

– దాసరి పళ్లాలమ్మ, అవిడ గ్రామం
(జగత శ్రీరామచంద్రమూర్తి, విలేకరి, కొత్తపేట)

ఊరిస్తున్న ఊరు



▶ మొదటి పేజీ తరువాయి

సరికొత్తగా పల్లెసీమల ముఖచిత్రం ఆవిష్కృతమవుతోంది. రాష్ట్రంలో వికేంద్రీకరణతో నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనబడుతోంది. గతంలో కూలిపోయే దశలో ఉన్న సర్కారు స్కూళ్ల భవనాలు మినహా ఇతర ప్రభుత్వ భవనాలేవీ కానరాని దుస్థితి నుంచి అన్ని సదుపాయాలతో సర్వ సేవలు అందించేలా పలు కార్యాలయాలు గ్రామాల్లోనే నిర్మితమవుతున్నాయి. అన్ లిమిటెడ్ బ్యాండ్ విడ్త్‌తో ఏ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులైనా గ్రామాల నుంచే పని చేసుకోవచ్చు.

• ఇప్పుడు ఊరు దాటాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని సేవలు అందుతున్నాయి. బంధువులను చూడడానికి మాత్రమే ఇప్పుడు పొరుగూళ్లకు వెళుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఆ స్థాయిలో ప్రజలకు పథకాలు, సేవలను ప్రభుత్వం చేరువ చేసింది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే దుస్థితిని, వ్యయ ప్రయాసలను సమూలంగా తొలగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఏ మారుమూల ప్రాంతమైనా సరే సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా సేవలు అందేలా వ్యవస్థను రూపొందించారు. లంచాల బెడద లేకుండా లబ్ధిదారుల ఇంటి వద్దే టంఛన్‌గా పింఛన్లు, రేషన్ సరుకులు, వివిధ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందచేస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా బలవర్థకమైన ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో సైతం 545 రకాల ప్రభుత్వ సేవలు గ్రామ సచివాలయాల్లో అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం తిరగాల్సిన అవస్థలు తొలగిపోయాయి. ఏదో మహమ్మారి జబ్బులైతే మినహా సాధారణ రోగాల చికిత్స కోసం ఊరు దాటాల్సిన అవసరం లేకుండా వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లను సైతం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు హెల్త్ క్లినిక్‌లలో ఉచితంగా వైద్య సేవలను అందజేస్తోంది. రక్త పరీక్షలు అక్కడే నిర్వహిస్తూ అవసరమైన మందులూ ఉచితంగా ఇస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం జగన్ తీసుకొచ్చారు. ఇంటింటినీ జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యాన్ని అందిస్తూ ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయాన్ని లిఖించారు.

• ఐదేళ్ల క్రితం వరకు గ్రామాల్లో ప్రభుత్వ స్కూళ్లను మినహాయిస్తే మరే ప్రభుత్వ కార్యాలయాలు లేని పరిస్థితి నెలకొంది. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు దాటినా 2019కి ముందు వరకు దాదాపు 3 వేల పంచాయతీలలో కార్యాలయం భవనాలు కూడా లేవని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇరుకు గది, చిన్న హాలు మినహా మరే వసతులు ఉండవు. కార్యదర్శుల కొరతతో అవి నెలల తరబడి మూసి వేసి ఉంటాయి. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం రూ.4,750 కోట్ల ఖర్చుతో రాష్ట్రవ్యాప్తంగా 10,893 గ్రామ సచివాలయాల భవనాలను మంజూరు చేసింది. ఇప్పటికే 7,144 భవనాల నిర్మాణం పూర్తి కాగా మరో 1,888 భవనాలు నెల రోజుల్లో పూర్తి అయ్యే దశలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల పంటలకు సంబంధించిన మ్యాగజైన్లు ఉంటాయి. రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తల ముఖాముఖి సమావేశాలకు వీలుగా స్మార్ట్ టీవీలు, వివిధ పంట ఉత్పత్తుల ధరలు, వాతావరణ సమాచారం తెలుసుకునే డిజిటల్ కియోస్క్‌లు, తేమ కొలిచే యంత్రాలు, విత్తన పరీక్ష పనిముట్లు, భూసార పరీక్ష కిట్లు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు.

• గతంలో విత్తనాలు కావాలన్నా ఎరువులు అవసరమైనా వ్యయ ప్రయాసలకు ఓర్చి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. పంటలను చీడపీడలు ఆశిస్తే వ్యవసాయ అధికారి సలహా కోసం కార్యాలయం వద్ద ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. ఇప్పుడు అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం గ్రామంలోనే అందిస్తోంది. కాల్ సెంటర్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తల సేవలను చేరువ చేసింది. రైతులకు సేవలు అందించేందుకు ఒక్కో ఊరిలో రూ.23.94 లక్షలు ఖర్చు పెట్టి 1,360 చదరపు అడుగుల విస్తీర్ణంలో రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. పశువైద్య సదుపాయాల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.2446 కోట్లతో 10,216 రైతు భరోసా కేంద్రాల భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామాల్లో ప్రజలకు కనీస వైద్య సేవలు అందించేందుకు ఒక్కొక్కటి రూ.1,7.50 లక్షల వ్యయంతో 1,185 చదరపు అడుగుల విస్తీర్ణంలో హెల్త్ క్లినిక్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,726 కోట్లతో 8299 హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసింది. వీటిలో 3,388 నిర్మాణం పూర్తి కాగా మరో 1,705 ఒకట్రెండు నెలల్లో పూర్తయ్యే దశలో ఉన్నాయి. విలేజ్ హెల్త్ కిన్లిక్‌లలో 14 రకాల రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలన్నింటినీ ప్రభుత్వం అందించింది. డెంగ్యూ, మలేరియా సహా హెచ్ఐవీ, సిఫిలిస్ లాంటి వ్యాధుల నిర్ధారణకు అవసరమైన ర్యాపిడ్ కిట్లను అన్ని హెల్త్ క్లినిక్‌లోనూ అందుబాటులో ఉంచింది. వీటికి తోడు ప్రతి హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు సరిపడినంత స్టాక్ అందుబాటులో ఉంచింది.

నాలుగు నెలల్లోనే నియామకాలు..

అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్ ఒకేసారి ఏకంగా 1.34 లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించారు. ఇది ఒక రికార్డు కాగా కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఆ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా పూర్తి చేసి మరో రికార్డు నెలకొల్పారు. ఈ స్థాయిలో లక్షల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. నాడు ఉద్యోగాలు సాధించిన ఎంతోమంది సచివాలయాల ఉద్యోగులు ఈ నాలుగేళ్ల కాలంలో పదోన్నతులు కూడా పొందారు. టీచర్లు మినహా ప్రభుత్వ ఉద్యోగులు లేని గ్రామాల్లో నేడు సచివాలయాల ద్వారా పది మంది చొప్పున శాశ్వత ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

మరికొన్ని అభివృద్ధి పనులు

- నాడు – నేడు ద్వారా రూ.11,000 కోట్ల ఖర్చుతో 38,059 ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. రూ.612 కోట్లు ఖర్చు చేసి ప్రహరీ గోడలను నిర్మించింది. డిజిటల్ లైబ్రరీలను కూడా నిర్మిస్తోంది.
- ప్రభుత్వం కేవలం కార్యాలయాల నిర్మాణం మాత్రమే కాకుండా వాటిల్లో అన్ని మౌలిక వసతులను కల్పించింది. ఒక్కో గ్రామ సచివాలయానికి రెండు కంప్యూటర్లు, యూపీఎస్, ప్రింటర్లను సమకూర్చింది. రాష్ట్రవ్యాప్తంగా 30,004 కంప్యూటర్లు, 15,002 యూపీఎస్, 15,002 ప్రింటర్లతో పాటు 3,000 ఆధార్ కిట్లు, 2,86,646 ఫింగర్ ప్రింట్ స్కానర్లను పంపిణీ చేసింది. వలంటీర్లతోపాటు సచివాలయ సిబ్బందికి విధులను వేగంగా నిర్వహించేందుకు 2,91,590 స్మార్ట్ ఫోన్లను, సిమ్ కార్డులను అందజేసింది.
- 2020లో పలు భవన నిర్మాణాలకు అనుమతులు లభించగా వరుసగా రెండేళ్ల పాటు కరోనా కారణంగా నిర్మాణ పనులు స్తంభించాయి. ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా 16,081 భవన నిర్మాణాలు పూర్తి కాగా మరో 5095 భవనాలు నెల నుంచి నెలన్నర లోగా పూర్తయ్యే అవకాశం ఉంది. నిర్మాణాలు జరుగుతున్న చోట్ల అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇరుకైన పంచాయతీ భవనాలు మినహా రైతులకు, ప్రజలకు సేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఎలాంటి కార్యాలయాలు లేకపోవడం గమనార్హం.
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు సాధికారత బాట పట్టారు. జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి పశువులు కొనుగోలు చేశారు. ఆసరా, చేయూత ద్వారా కిరాణా షాపులు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఉన్న ఊరిలోనే ఉపాధి పొందుతున్నారు. అమూల్, రిలయన్స్, పీ అండ్ జీ లాంటి దిగ్గజ కంపెనీలతో అనుసంధానించి మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం వారికి బ్యాంకు రుణాలతో తోడ్పాటు అందిస్తోంది.

కర్ణాటకలో పింఛన్ కష్టం..

రెండు కి.మీ. పాక్కుంటూ వెళ్లిన 77ఏళ్ల దివ్యాంగ వృద్ధురాలు
పెన్షన్ రాలేదంటూ ఉసూరుమనిపించిన అధికారులు
ఏపీలో అమలవుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పోలుస్తున్న కన్నడిగులు


పింఛన్ కోసం పాక్కుంటూ వెళుతున్న గిరిజమ్మ

శివాజీనగర: పింఛన్ కోసం కర్ణాటక రాష్ట్రంలో 77 ఏళ్ల ఓ దివ్యాంగ వృద్ధురాలు రెండు కిలోమీటర్లకుపైగా పాక్కుంటూ పోస్టాఫీసుకు వచ్చిన ఘటన అందర్నీ నివ్వెరపరిచింది. పంటిబిగువన నరకయాతన అనుభవిస్తూ పోస్టాఫీసుకు వచ్చిన ఆమెకు తీవ్ర నిరాశే మిగిలింది. అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీ అమలు విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు, ఇతర రాష్ట్రాలకు ఉన్న తేడాకు ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. ఏపీలో ఒకటో తేదీ వచ్చిందంటే.. వలంటీర్లు తెల్లారకముందే తలుపుకొట్టి అవ్వాతాతల చేతుల్లో పింఛను సొమ్ము పెడుతుండడం తెలిసిందే. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కర్ణాటకలో అమలవుతున్న తీరుతో కన్నడిగులు పోలుస్తున్నారు. కర్ణాటకలోని దావణగెరె జిల్లా హరిహర తాలూకా కుణిబెళకెర గ్రామానికి చెందిన వయోవృద్ధురాలు గిరిజమ్మకు ఎవరూలేరు. ప్రభుత్వం ఇచ్చే పెన్షనే ఆమెకు జీవనాధారం. ప్రతి నెలారంభంలో హరిహర పోస్టాఫీసులో పెన్షన్ తీసుకుంటుంది. గత ఏడాది నవంబరు నుంచి సక్రమంగా అందడంలేదు. ఆటోలో రావడానికి డబ్బులు లేకపోవడంతో వారం రోజుల కిందట గ్రామం నుంచి రెండు కిలో మీటర్లు పాక్కుంటూ పోస్టాఫీసుకు వచ్చింది. కానీ, పెన్షన్ ఇంకా రాలేదని సిబ్బంది చెప్పడంతో హతాశురాలైంది. ఆమె కష్టాన్ని కొందరు ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యింది. అంతదూరం నుంచి పాక్కుంటూ రావడంవల్ల ఒళ్లు చీరుకుపోయి బొబ్బలు వచ్చినా లెక్కచేయలేదు. 'ఆ పెన్షన్ వస్తేనే నాకు రోజు గడుస్తుంది. అదే లేకపోతే ఏం తినాలి, అందుకే కష్టమైనా పాకుతూనే వచ్చాను..' అని గిరిజమ్మ దీనంగా చెప్పింది. కాగా, ఈ విషయమై పెద్దఎత్తున విమర్శలు రావడంతో స్థానిక సబ్ కలెక్టర్ అమూల్య పాండా స్పందిస్తూ.. ఇంటికే వెళ్లి పెన్షన్ అందజేసే సదుపాయం రాష్ట్రంలో లేదనడం గమనార్హం. ఏపీలో వైఎస్ జగన్ సర్కారు ప్రతి నెలా మొదటి తారీఖునే ఇళ్లకే వెళ్లి మరీ అవ్వాతాతలకు రూ.3వేలు చొప్పున ఫింఛన్ సొమ్ము అందజేస్తుండడం తెలిసిందే. దేశంలో రూ.3 వేల ఫింఛన్ తోపాటు ఎక్కువ మందికి ఫింఛన్లు ఇస్తున్న రాష్ట్రం కూడా ఏపీనే కావడం విశేషం.

చంద్రగిరిలో ఓట్లపై అపోహలొద్దు

- 2019తో పోల్చుకుంటే ఐదేళ్లలో 17వేల ఓట్లు పెరిగాయి
- ఆర్డీవో నిషాంత్‌రెడ్డి వెల్లడి



తిరుపతి అర్బన్: చంద్రగిరి నియోజకవర్గంలో ఓట్లపై అనవసరమైన అపోహలు వద్దని, ఓటర్ల జాబితాను వంద శాతం పారదర్శకంగానే రూపొందిస్తున్నట్లు తిరుపతి ఆర్డీవో, నియోజకవర్గ ఈఆర్వో నిషాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. తిరుపతిలోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2.91 లక్షలు కాగా, 2024లో ఇప్పటి వరకు ఆ సంఖ్య 3.08 లక్షలకు చేరిందని చెప్పారు. ఈ ఐదేళ్లలో 17వేల ఓట్లు మాత్రమే పెరిగాయని తెలిపారు. 2019 నుంచి 2024 మధ్య ఐదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను, 25 నియోజకవర్గాల్లో 22వేలకు పైగా ఓట్లు పెరిగాయని పేర్కొన్నారు. వ్యాపారం, ఉద్యోగం, జీవనోపాధి నిమిత్తం జిల్లా కేంద్రమైన తిరుపతి రూరల్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఏటా వలసలు పెరుగుతున్నాయని వివరించారు. గడిచిన ఐదేళ్లలో చంద్రగిరి నియోజకవర్గంలో 30వేల కుటుంబాలు కొత్త విద్యుత్ కనెక్షన్లు పొందాయని తెలిపారు. వాటిలో 80% తిరుపతి రూరల్ ప్రాంతంలోనే ఉన్నాయని వెల్లడించారు. వీటిలో 7వేల ఇళ్లకు కొత్త డోర్ నంబర్లు ఇచ్చారని చెప్పారు. తిరుపతి రూరల్ ప్రాంతంలో వలస కుటుంబాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలోనే ఐదేళ్లలో 17వేల మంది ఓటర్లు పెరిగారని ఆయన స్పష్టంచేశారు. కొందరు చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపులు, డబుల్ ఎంట్రీలు, ఒకటే ఫొటోను పలు ఓటర్లకు సృష్టిస్తున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి 10మందిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని తెలిపారు. తాజాగా ఎన్నికల కమిషన్‌కు ఈ అంశంపై వివరించామని చెప్పారు. ఎవరుపడితే వారు కోరిన విధంగా చేర్పులు, మార్పులు, తొలగింపులు చేయకుండా, ఓటర్ మొబైల్‌కు ఓటీపీ వస్తేనే మార్పులు చేయడానికి వీలుగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన చెప్పారు.

ఫిర్యాదులన్నీ పరిష్కరించాం

డిసెంబర్ 9 వరకు వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించామని నిషాంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి రాజకీయ పార్టీల నేతలతో పలు సమావేశాలు నిర్వహించామని వెల్లడించారు. పలు పార్టీల నేతలు 105 ఫిర్యాదులు చేశారని, వాటన్నింటికీ పరిష్కారం చూపించినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో చిన్నపాటి పొరపాట్లు లేకుండా తనిఖీలు చేయడానికి 10 కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. డిప్యూటీ తహసీల్దార్‌లతో ఐదు కమిటీలు, రెవెన్యూకు సంబంధంలేని ఇతర విభాగాలకు చెందిన డిప్యూటీ ఇంజినీర్లతో మరో ఐదు కమిటీలను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని 395 పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా వస్తుందని తెలిపారు. బీఎల్వోలతో కలసి తాను రోజూ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ చంద్రగిరి నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాపై తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమన్నారు.

18 లక్షల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి

- కొనసాగుతున్న మిగిలిన కార్డుల పంపిణీ
- మొత్తం 1.42 కోట్ల స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ చకచకా కొనసాగుతోంది. మొత్తం మీద 1.42 కోట్ల కార్డులను పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 18,06,084 కార్డులను గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన కార్డులను కూడా శరవేగంగా పంపిణీ చేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. అలాగే 2019కి ముందు 1,059గా ఉన్న ప్రొసీజర్‌లను ఏకంగా 3,257కి పెంచింది. ఈ నేపథ్యంలో పెరిగిన ప్రయోజనాలతో కూడిన కొత్త కార్డులను ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తోంది. అంతేకాకుండా వాటిపైన అవగాహన కల్పిస్తోంది. ఒక్కో వారం నియోజకవర్గంలో నాలుగు వరకు గ్రామాల్లో ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన, ప్రచారం, కార్డుల పంపిణీ కార్యక్రమాలను అధికారులు చేపడుతున్నారు.


మరింత సులభంగా వైద్య సేవలు పొందేలా..

సరికొత్త ఫీచర్‌లతో కూడిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రతి కార్డులో కుటుంబ యజమాని పేరు, జిల్లా, మండలం, గ్రామ/వార్డు సచివాలయం వివరాలతో పాటు, సంబంధిత కుటుంబ సభ్యుల ఫొటోలతో పాటు, వారి పేర్లు, ఇతర వివరాలు ఉన్నాయి. క్యూఆర్ కోడ్, యూనిక్ హెల్త్ ఐడెంటిటీ నంబర్ (యూహెచ్ఐడీ) కూడా పొందుపరుస్తున్నారు. వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లినప్పుడు ఆరోగ్యమిత్ర, వైద్యులు సులువుగా రిజిస్ట్రేషన్ చేయడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది. దీంతో మరింత వేగంగా, సులభంగా ప్రజలు వైద్య సేవలు పొందొచ్చు.


యాప్ ద్వారా సేవలు..

రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా ఉచితంగా వైద్య సేవలు పొందడం ఎలాగో ప్రజలకు సులువుగా అర్థం కావడానికి ప్రత్యేకంగా బ్రోచర్‌లను కూడా వైద్య సిబ్బంది అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రచార కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. యాప్‌ను ఎలా వినియోగించాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 64,15,515 ఆరోగ్యశ్రీ కార్డుదారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో లాగిన్ అయ్యారు. వంద శాతం లబ్ధిదారులకు యాప్ సేవలను చేరువ చేసేలా అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఈ యాప్ ఫోన్‌లో ఉంటే అరచేతిలో ఆరోగ్యశ్రీ ఉన్నట్టే అనే చందంగా ప్రభుత్వం యాప్‌లో ఫీచర్‌లను పొందుపరిచింది. పథకం కింద అందే వైద్య సేవలు, రాష్ట్రంలో, రాష్ట్రం వెలుపల ఉండే నెట్‌వర్క్ ఆస్పత్రులు, వాటిల్లో ఏ ప్రొసీజర్స్‌కు వైద్యం చేస్తారనే సమాచారం యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాకుండా తాముంటున్న ప్రాంతానికి చేరువలో ఏ ఆస్పత్రి ఉందో తెలుసుకుని, అక్కడకు చేరుకోవడానికి ట్రాకింగ్ సౌకర్యం కూడా ఉంది. ఇక గతంలో పథకం ద్వారా పొందిన చికిత్సలు, రిపోర్ట్‌లను సైతం ఒక్క క్లిక్‌తో పొందడానికి వీలుంది.

మార్చి 18 నుంచి విశాఖలో హెల్త్ టెక్నాలజీ సదస్సు

సాక్షి, విశాఖపట్నం : మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ వేదికగా మారబోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పర్యవేక్షణలో మార్చి 18 నుంచి 9వ అంతర్జాతీయ హెల్త్ టెక్నాలజీ ఎసెస్‌మెంట్ ఫోరమ్ నిర్వహిస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు మెడ్‌టెక్‌జోన్‌లోని కలాం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సులో కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, సింగపూర్ తదితర దేశాలకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖ ప్రతినిధులు, పరిశోధకులు, వైద్య, విద్యావేత్తలు హాజరుకానున్నారు. వైద్య రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతికతని ఎలా వినియోగించుకోవాలి, కొత్తగా వస్తున్న టెక్నాలజీ బేస్డ్ పరికరాల ప్రదర్శన తదితర అంశాలు ఇందులో చర్చకు రానున్నాయని మెడ్‌టెక్‌జోన్ ప్రతినిధులు తెలిపారు.

బీఈఈ సలహాదారుగా ఎ.చంద్రశేఖరరెడ్డి



సాక్షి, అమరావతి: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) దక్షిణాది రీజియన్ సలహాదారుగా ఏపీ ఇంధన శాఖలో విశేష సేవలందించిన ఎ.చంద్రశేఖరరెడ్డి నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటికే ఆయన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ దక్షిణ భారతదేశం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో(యూటీ) వ్యాపార అభివృద్ధి, ప్రభుత్వ వ్యవహారాల సీనియర్ సలహాదారుగా సేవలు అందిస్తున్నారు. తాజాగా బీఈఈకి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మీడియా సలహాదారుగా నియమితులయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా విధులు నిర్వర్తించనున్న చంద్రశేఖరరెడ్డి ఏపీ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు, దక్షిణాదిలోని కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తారు.

నేడు 'పీఎం జన్‌మన్' ప్రారంభం

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): దేశవ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులకు సొంతగూడు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం జన్‌మన్ కార్యక్రమం అరకులోయ మండలం కొత్తబల్లుగుడ గ్రామంలో సోమవారం ఉదయం 11గంటలకు ప్రారంభంకానుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదివాసీలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా మాట్లాడనున్నారని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఆయన ఆదివారం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, గిరిజన సంక్షేమ ఈఈ కె.వేణుగోపాల్, జేఈఈ అభిషేక్‌లతో సమీక్షించారు.

అధికారంలోకొస్తే అమరావతి నుంచే పాలన

- సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి/తాడికొండ/చంద్రగిరి(తిరుపతి జిల్లా): అధికారంలోకి వస్తే అమరావతి నుంచి పాలన ప్రారంభిస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో సంపద సృష్టించడమే టీడీపీ–జనసేన లక్ష్యమన్నారు. మందడంలో ఆదివారం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో కలిసి సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. కొన్ని జీవోల ప్రతులను ప్రజా వ్యతిరేకమంటూ భోగి మంటల్లో వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవతల రాజధాని అమరావతిని రాక్షసులు చెరబట్టారని విమర్శించారు. 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఇలాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతే ఉంటుందని తెలిపారు. రాష్ట్రానికి శుభగడియలు తలుపులు తడుతున్నాయని, రాజకీయ హింస, అక్రమాలు, మోసపు హామీలు, అధికార మదం, జగన్ అహంకారాన్ని కూడా భోగి మంటల్లో తగులబెట్టామని చెప్పారు. ధరల పెరుగుదల పేదలను పట్టి పీడిస్తోందని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా వారిని రోడ్డుపై నిలబెట్టారని ఆరోపించారు. పండుగ జరుపుకోలేనంతగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు.

రాజధాని రైతుల ఆవేదన చూడలేకే టీడీపీ, జనసేన కలిశాయి

విశాఖను ఆర్థిక రాజధానిగా చేసే బాధ్యత తీసుకుంటామని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇంకా 87 రోజుల సమయం మాత్రమే ఉందని, వైఎస్సార్‌సీపీ విముక్త రాష్ట్రంగా అంతా పని చేయాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలుగు జాతి నంబర్ వన్‌గా ఉండాలనేది తన ఆశయమని తెలిపారు. పవన్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్రానికి పీడ పట్టిందన్నారు. రాజధాని రైతుల ఆవేదన చూడలేకనే టీడీపీ, జనసేనలు కలిశాయన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ వస్తే రాష్ట్ర భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. సుస్థిర టీడీపీ–జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి బంగారు భవిష్యత్తును ఇస్తామని చెప్పారు. సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు చంద్రబాబు, లోకేశ్‌లు ఆదివారం తమ స్వగ్రామంనారావారిపల్లికి చేరుకున్నారు. భువనేశ్వరి, బాలకృష్ణ సతీమణి వసుంధర, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ శనివారమే నారావారిపల్లి చేరుకున్నారు.

క్లుప్తంగా...

స్వతంత్ర తైవాన్‌కు మద్దతివ్వం: బైడెన్

వాషింగ్టన్: తైవాన్ స్వాతంత్య్రానికి అమెరికా మద్దతు ఇవ్వదని అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో స్వతంత్ర తైవాన్ విధానాన్ని సమర్థించే డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి అక్కడి ప్రజలు అధికారం కట్టబెట్టిన విషయం తెలిసిందే. తైవాన్ ఎన్నికల ఫలితాలపై జో బైడెన్ స్పందించారు. అమెరికా ప్రభుత్వం తైవాన్ స్థానంలో చైనాకు 1979 నుంచి దౌత్యపరమైన గుర్తింపునిచ్చింది. తైవాన్ స్వాతంత్య్ర ప్రకటనకు మద్దతివ్వబోమని అప్పటి నుంచి అధికారికంగా చెబుతూ వస్తోంది. అనధికారికంగా గట్టి మద్దతుదారుగా ఉంటూ తైవాన్‌తో సంబంధాలను కొనసాగిస్తోంది. అవసరమైతే బలప్రయోగం జరిపైనా తైవాన్‌ను కలిపేసుకుంటామంటూ చైనా పలుమార్లు స్పష్టం చేసింది. అయితే, తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న లాయ్ తైవాన్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించే అవకాశాలున్నాయంటున్నారు. ఆయన మాత్రం అలాంటి దేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. లాయ్ ఎన్నిక నేపథ్యంలో బీజింగ్‌తో సంబంధాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలున్నట్లు అమెరికా ఆందోళన చెందుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బైడెన్ తాజా వ్యాఖ్యలు చైనాకు భరోసా ఇచ్చేందుకు చేసిన ప్రయత్నంగా పరిశీలకులు భావిస్తున్నారు.

బీజేపీ ఎంపీ హెగ్డేపై విద్వేష వ్యాఖ్యల కేసు

బెంగళూరు: బాబ్రీ మసీదు మాదిరిగానే భట్కల్ మసీదు కూడా ధ్వంసమవుతుందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉత్తర కన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డేపై కర్ణాటక పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. విద్వేష ప్రసంగం, జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారంటూ ఆయనపై కేసు నమోదు చేసినట్లు కర్వార్ ఎస్పీ విష్ణువర్ధన్ చెప్పారు. దర్యాప్తు జరుపుతున్నామన్నారు. 1992లో కరసేవకులు బాబ్రీ మసీదును ధ్వంసం చేసినట్లుగానే భట్కల్ మసీదు కూడా ధ్వంసం అవడం ఖాయమని ఉత్తర కన్నడ జిల్లాలో శనివారం ఒక కార్యక్రమంలో హెగ్డే అన్నారు. ఇది హిందూ సమాజం నిర్ణయమన్నారు.

కోవిడ్ కొత్త కేసులు 375

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 375 కోవిడ్ కేసులు బయటపడినట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదే సమయంలో, యాక్టివ్ కేసుల సంఖ్య 3,075కు తగ్గినట్లు పేర్కొంది. కర్ణాటకలో కోవిడ్ బాధితులు ఇద్దరు చనిపోయారని తెలిపింది. జేఎన్.1 సబ్ వేరియంట్ వల్లే కేసుల్లో పెరుగుదల కనిపిస్తున్నట్లు తెలిపింది.



పొంగల్ సందర్భంగా ఆదివారం ఢిల్లీలో మోదీ పూజలు

‘ఏక్ భారత్...’కు ప్రతిబింబం పొంగల్

ఢిల్లీలో పొంగల్ వేడుకల్లో ప్రధాని

చెన్నై/ఢిల్లీ: జాతీయ స్ఫూర్తి అయిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు పొంగల్ పర్వదినం ప్రతిరూపమని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఇంట్లో పొంగల్ వేడుకకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ‘‘తమిళనాడు ప్రజలకు పొంగల్ పర్వదిన శుభాకాంక్షలు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తికి పొంగల్ ప్రతిబింబం. ఇదే భావన కాశీ–తమిళ్, సౌరాష్ట్ర–తమిళ్ సంగమం సంస్కృతిలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బియ్యం పిండితో వేసే కోలమ్ రంగవల్లికలు దేశంలోని భిన్న ప్రాంతాల మధ్య ఉన్న భావోద్వేగాలను కలుపుతున్నాయి. ఈ ఐక్యతా భావనే 2047కల్లా వికసిత భారత్ నిర్మాణానికి అతిపెద్ద చోదకశక్తిలా పనిచేస్తోంది. ఎర్ర కోట మీద నుంచి నేను ప్రబోధించిన పంచప్రాణాల్లో ముఖ్యమైనది ఇదే. దేశ ఐక్యతను మరింత శక్తివంతం చేయండి, తద్వారా ఐక్యతను మరింత బలోపేతం చేయండి. తమిళ కవి తిరువల్లువర్ ప్రవచించినట్లుగా జాతి నిర్మాణంలో విద్యావంతులైన పౌరులు, నిజాయతీ గల వ్యాపారులు, మంచి పంటలది కీలక భూమిక. కొత్త పంటను దైవానికి నైవేద్యంగా వండి రైతన్నలు అన్నదాతలుగా మారే చక్కటి శుభ సమయమే పొంగల్. దేశంలోని ప్రతి పండుగలో పల్లెపట్టులు, పంటలు, రైతులతో ముడిపడి ఉంటాయి’’ అని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు.



పొంగల్ సందర్భంగా ఆదివారం ఢిల్లీలో తన నివాసంలో ఆవులతో మోదీ

అన్యాయాన్ని ప్రశ్నించేందుకే...

భారత్ జోడో న్యాయ్ యాత్రపై రాహుల్ | మణిపూర్ నుంచి శ్రీకారం

- మణిపూరీల కన్నీళ్లు తుడిచేందుకు మోదీ రాకపోవడం సిగ్గుచేటు
- ప్రధానిపై రాహుల్ మండిపాటు
- రాష్ట్రానికి శాంతి, సామరస్యం తెస్తాం





ఆదివారం మణిపూర్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం సందర్భంగా రాహుల్ గాంధీ. యాత్రకు తరలివచ్చిన అభిమానులు

థౌబాల్/ఇంఫాల్: జాతుల ఘర్షణలతో అట్టుడికిపోతున్న కల్లోల మణిపూర్ రాష్ట్రానికి శాంతి, సామరస్యం తిరిగి తీసుకొస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. మణిపూర్‌లోని థౌబాల్ నుంచి ‘భారత్ జోడో న్యాయ్ యాత్ర’కు ఆదివారం ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత ఖోంగ్జామ్ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. ఘర్షణలతో రాష్ట్రంలో లక్షలాది మంది అమాయకులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కన్నీళ్లు తుడిచేందుకు, చేయూతనిచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికీ రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మోదీ, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దృష్టిలో మణిపూర్ రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగం కాకపోవచ్చని ఆక్షేపించారు. ‘‘మీ బాధను వారి బాధగా భావించడం లేదు. కానీ మీ దుఃఖాన్ని, మీకు తగిలిన గాయాలు, మీరెదుర్కొంటున్న విచారాన్ని మేం అర్థం చేసుకున్నాం’’ అని చెప్పారు. బాధితులు ఆప్యాయతను కోరుకుంటున్నారని రాహుల్ అన్నారు.

ప్రజల ‘మన్ కీ బాత్’ వింటాం

దేశంలో అన్యాయ కాలం కొనసాగుతున్నందు వల్లే న్యాయ యాత్ర చేపట్టాల్సి వచ్చిందని రాహుల్ పేర్కొన్నారు. ప్రజలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలను ఏకం చేయాలన్నదే ఈ యాత్ర ఉద్దేశమని వివరించారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, సామరస్యంతో కూడిన ‘న్యూ విజన్ ఆఫ్ ఇండియా’ను సాధించడం ధ్యేయమని స్పష్టం చేశారు. ‘‘ఈ యాత్రలో ప్రజల ‘మన్ కీ బాత్’ వింటాం. ప్రజలను నేరుగా కలుసుకొని, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటాం’’ అని వెల్లడించారు. బీజేపీ క్షుద్ర రాజకీయాల వల్ల మణిపూర్‌లో శాంతి, సామరస్యం కనుమరుగు అయ్యాయని రాహుల్ ధ్వజమెత్తారు. సమాజంలో విద్వేషం, హింస, అరాచకత్వానికి స్థానం ఉండకూడదని చెప్పారు. దేశ సంపద కొందరి జేబుల్లోకి వెళ్తోందని రాహుల్ ఆరోపించారు. ఒకరిద్దరు వ్యాపారవేత్తలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై గుత్తాధిపత్యం సాధిస్తున్నారని మండిపడ్డారు. అన్ని వ్యాపారాల్లోకి వారు ప్రవేశిస్తున్నారని, ఫలితంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని గుర్తుచేశారు. దేశ జనాభాలో అధిక భాగం ఉన్న కింది కులాలు, దళితులు, గిరిజనులకు రాజకీయ వ్యవస్థలో, ప్రభుత్వ పాలనా వ్యవస్థలో భాగస్వామ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటినీ యాత్రలో లేవనెత్తుతామని తెలిపారు.

రాహుల్ యాత్రలో బీఎస్పీ బహిష్కృత ఎంపీ డానిష్ అలీ

ఇటీవల బీఎస్పీ నుంచి బహిష్కరణకు గురైన లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీ రాహుల్‌తో పాటు యాత్రలో పాల్గొన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరతారని తెలుస్తోంది. రాహుల్ యాత్రపై మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ మండిపడ్డారు. ‘‘రాష్ట్రంలో ఘర్షణలింకా ఆగలేదు. ఇలాంటప్పుడు యాత్ర పేరుతో పరిస్థితిని దిగజార్చడానికి వచ్చారా?’’ అంటూ మండిపడ్డారు.

రాజకీయ లబ్ధికి మతాన్ని వాడుతున్నారు

ప్రధాని మోదీపై ఖర్గే మండిపాటు

థౌబాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి విరుచుకుపడ్డారు. మత విశ్వాసాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఓటర్లను వంచించడం దారుణమని అన్నారు. ఆదివారం మణిపూర్‌లోని థౌబాల్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ఓట్ల కోసం మణిపూర్ వచ్చిన ప్రధాని మోదీ ఇప్పుడు ప్రజల కష్టాల్లో ఉంటే రావడం లేదని విమర్శించారు. ఇటీవల సముద్ర తీరంలో కుర్చీలో కూర్చొని రామ నామం జపిస్తూ మోదీ కనిపించారని చెప్పారు. ఒక వైపు రామ నామం జపిస్తూ మరోవైపు ప్రజలను మోసం చేయడం తగదని మోదీకి హితవు పలికారు. దేవుడి పట్ల అందరికీ నమ్మకం ఉందని పేర్కొన్నారు. కానీ, ఓట్ల కోసం మతాన్ని వాడుకోవడం సరైంది కాదని చెప్పారు. లౌకికవాదం, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం తాము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. కానీ, బీజేపీ నాయకులు మాత్రం మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి, జనాన్ని దగా చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో నిరంకుశత్వం రాజ్యమేలుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభించారని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న రాజు ఫ్రెడరిక్ దంపతులు

డెన్మార్క్ రాజుగా పదో ఫ్రెడరిక్

కోపెన్‌హేగెన్: డెన్మార్క్ రాజ సింహాసనాన్ని పదో ఫ్రెడరిక్ ఆదివారం అధిష్టించారు. రాణి రెండో మార్గరెట్ (83) అనారోగ్య కారణాలతో సింహాసనం వీడుతున్నట్లు కొత్త సంవత్సరం మొదటి రోజే ప్రకటించారు. 900 ఏళ్ల డెన్మార్క్ రాచరిక చరిత్రలో రాజు స్వచ్ఛందంగా సింహాసనం వీడటం ఇదే తొలిసారి. రాజధాని కోపెన్‌హెగెన్‌లోని జరిగిన కేబినెట్ సమావేశంలో సింహాసనం నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపే పత్రంపై రాణి సంతకం చేశారు. తర్వాత ప్రధాని మెట్టె ఫ్రెడెరిక్సన్ రాజభవనం బాల్కనీ నుంచి పదో ఫ్రెడరిక్‌ను రాజుగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాజభవనం వెలుపల వేలాది మంది గుమికూడారు. ‘గాడ్ సేవ్ ది కింగ్’ అని చెబుతూ రాణి అక్కడి నుంచి నిష్క్రమించారు. రెండో మార్గరెట్‌తో పాటు ఆస్ట్రేలియా మూలాలున్న ఫ్రెడరిక్ భార్య క్వీన్ మేరీ రూపంలో డెన్మార్క్‌కు ఇద్దరు రాణులుంటారు. ఫ్రెడరిక్, మేరీల పెద్ద కుమారుడు క్రిస్టియన్ (18) యువరాజు హోదాతో సింహాసనానికి వారసుడయ్యారు. డెన్మార్క్ రాజరికం యూరప్‌లోనే అత్యంత పురాతనమైంది. 10వ శతాబ్దంలో వైకింగ్ రాజు గోర్మ్ ది ఓల్డ్ కాలం నుంచి అప్రతిహతంగా కొనసాగుతోంది. 1146లో అప్పటి డెన్మార్క్ రాజు మూడో ఎరిక్ లామ్ స్వచ్ఛందంగా సింహాసనం నుంచి వైదొలిగి, సన్యాసం తీసుకున్నారు. డెన్మార్క్ రాజుగా తొమ్మిదో ఫ్రెడరిక్ 1947 నుంచి 1972వరకు కొనసాగారు. ఆయన అకస్మాత్తుగా చనిపోవడంతో ఆయన కుమార్తె రెండో మార్గరెట్ సింహాసనం అధిష్ఠించారు. దాదాపు 52 ఏళ్ల పాటు రాణిగా కొనసాగారు.

కాంగ్రెస్‌కు మిలింద్ రాజీనామా

శివసేన (షిండే)లో చేరిక

ముంబై: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా ఆ పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో కాంగ్రెస్–దేవ్‌రా కుటుంబం మధ్య 55 ఏళ్ల అనుబంధం తెగిపోయింది. రాహుల్ గాంధీ ‘భారత్ జోడో న్యాయ్ యాత్ర’ ప్రారంభించిన రోజే దేవ్‌రా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పడం విశేషం. పారిశ్రామికవేత్తలను, వ్యాపారవేత్తలను కాంగ్రెస్ ఇష్టానుసారంగా దూషిస్తోందని ఈ సందర్భంగా దేవ్‌రా ఆక్షేపించారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎంతో శ్రమిస్తున్నారన్నారు.

దక్షిణ ముంబై స్థానం కోసమేనా?

దక్షిణ ముంబై లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికే దేవ్‌రా శివసేనలో చేరారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎవరూ వెళ్లిపోయినా కాంగ్రెస్‌కు నష్టమేమీ ఉండదని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. దేవ్‌రాను కీలుబొమ్మను చేసి మోదీ ఆడిస్తున్నారన్నారు. దక్షిణ ముంబై సీటును తాము వదులుకొనే ప్రసక్తే లేదని శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ చెప్పారు. మిలింద్ దేవ్‌రా. దివంగత కాంగ్రెస్ అగ్రనేత మురళీ దేవ్‌రా కుమారుడు. ఆయన ఇటీవలే ఏఐసీసీ సంయుక్త కోశాధికారిగా నియమితులయ్యారు. గతంలో దక్షిణ ముంబై స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ మిత్రపక్షమైన శివసేన(ఉద్ధవ్) రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా దక్షిణ ముంబై స్థానాన్ని కోరుతోంది. అందుకే దేవ్‌రా కాంగ్రెస్‌ను వీడినట్లు తెలుస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో దక్షిణ ముంబై నియోజకవర్గంలో శివసేన నేత(ఇప్పుడు ఉద్ధవ్ వర్గం) అరవింద్ సావంత్ చేతిలో మిలింద్ ఓడిపోయారు.



ఆదివారం శివసేనలో చేరిన సందర్భంగా మహారాష్ట్ర సీఎం షిండేతో మిలింద్ దేవ్‌రా

వాయుకాలుష్యం గుప్పిట హస్తిన

న్యూఢిల్లీ: దేశరాజధాని మళ్లీ తీవ్ర వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. ఆదివారం ఉదయం ఢిల్లీలో వాయు నాణ్యతా సూచీ(ఏక్యూఐ) దారుణంగా 458కు పెరిగింది. దీంతో అత్యవసరంకాని నిర్మాణ పనులను తక్షణం ఆపేయాలని కేంద్ర ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీచేసింది. బీఎస్–3 పెట్రోల్, బీఎస్–4 డీజిల్ నాలుగు చక్రాల వాహనాల రాకపోకలను ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో నిషేధిస్తూ ఉత్తర్వులిచ్చింది. వాయు నాణ్యత దారుణంగా పడిపోవడంతో గ్రాప్ స్టేజ్–3 కట్టడి చర్యలను కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ తీసుకుంది. ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో వాయు కాలుష్య నియంత్రణ, కట్టడి చర్యల బాధ్యతలు ఈ కమిషన్‌కే ప్రభుత్వం అప్పజెప్పింది. జాతీయ భద్రత, రక్షణ, ఆరోగ్యం, రైల్వే, మెట్రో రైల్, విద్యుత్ సరఫరా, పైప్‌లైన్, మురుగునీటి నిర్వహణ వంటి అత్యవసర సేవల సంబంధ పనులను మాత్రం అనుమతిస్తారు. చలికాలంలో ఢిల్లీలో కేంద్రం వాయు కాలుష్య నియంత్రణ ప్రణాళికను అమలు చేస్తూ వస్తోంది. ఏక్యూఐ సూచీ 300లోపు ఉంటే స్టేజ్1గా, 400 లోపు ఉంటే స్టేజ్2గా, 450లోపు ఉంటే స్టేజ్3గా, 450 పైన ఉంటే స్టేజ్4 వాయు కాలుష్యంగా లెక్కిస్తారు.

శ్రీలంక అదుపులో 12 మంది మత్స్యకారులు

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లో వేట సాగిస్తున్నారనే ఆరోపణలతో 12 మంది భారతీయ మత్స్యకారులు, వారి ట్రాలర్లను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. ఉత్తర జాఫ్నాలోని కరైనగర్ తీరంలో శనివారం మూడు ట్రాలర్లు సహా మత్స్యకారులను అరెస్ట్ చేసినట్లు నేవీ ఆదివారం తెలిపింది. వీరందరినీ కంకేశతురై హార్బర్‌కు తరలించామని తెలిపింది. తమిళనాడు, శ్రీలంకలను విడదీసే ఇరుకైన పాక్ జలసంధి వద్ద చేపల వేట వివాదాస్పదమవుతోంది. గతేడాది శ్రీలంక 240 మంది భారతీయ మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది.

ఉత్తర కొరియా మరో క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా ఆదివారం సముద్ర జలాలపైకి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. దక్షిణ కొరియా, జపాన్ దీన్ని ధ్రువీకరించాయి. డిసెంబర్ 18న కూడా అమెరికా ప్రధాన భూభాగంపై సైతం దాడి చేయగల సామర్థ్యమున్న ఘన ఇంధన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి హ్వాసంగ్–18ని ఉత్తర కొరియా ప్రయోగించింది. ఏప్రిల్‌లో దక్షిణకొరియాలో, నవంబర్‌లో అమెరికాలో జరగనున్న అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకే ఉత్తరకొరియా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు.

మార్చి 15 కల్లా సైన్యాన్ని ఉపసంహరించుకోండి

భారత్‌కు మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు గడువు

మాలె: భారత్ తమ దేశంలోని సైన్యాన్ని మార్చి 15వ తేదీకల్లా ఉపసంహరించుకోవాలని మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు కోరారు. ప్రస్తుతం మాల్దీవుల్లో 88 మంది భారత సైనికులున్నారు. ఈ పరిణామంపై కేంద్రం ఎటువంటి వ్యాఖ్యా చేయలేదు. గత నవంబర్ 17న మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ముయిజ్జుకు చైనా అనుకూల నేతగా పేరుంది. ప్రజాభీష్టం మేరకు భారత సేనలు తమ దేశం నుంచి వెళ్లిపోవాలని ఆయన అప్పట్లోనే ప్రకటించారు. భారత ప్రధానిపై మాల్దీవుల మంత్రులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, వారిని ప్రభుత్వం తొలగించడం తెలిసిందే. ఈ పరిణామం రెండు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసింది.

ట్రాన్స్ జెండర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. యూట్యూబర్‌కు రూ.50 లక్షల జరిమానా

చెన్నై: ట్రాన్స్‌జెండర్ వ్యాపారవేత్త, ఏఐఏడీఎంకే అధికారి ప్రతినిధి అప్సరా రెడ్డిని అప్రతిష్టపాలు చేసిన ఓ యూట్యూబర్‌కు మద్రాస్ హైకోర్టు రూ.50 లక్షల జరిమానా విధించింది! ఆమె ప్రావోగ్ మేగజీన్‌లో పని చేసిన రోజుల్లో మైకేల్ ప్రవీణ్ అనే సహోద్యోగితో విభేదాలొచ్చాయి. దాంతో అతను అప్సరను కించపరుస్తూ 10 వీడియోలను యూట్యూబ్‌లో పోస్ట్ చేశాడు. ప్రవీణ్ నుంచి రూ.1.25 కోట్లు పరిహారం కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. ఆమెకు రూ.50 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ‘‘సోషల్ మీడియాలో పోస్టులతో ఇతరుల గోప్యతకు భంగం కలిగించొద్దు. ఏ హక్కయినా పరిమితులకు లోబడి ఉంటుంది’’ అని పేర్కొంది.

రామస్వామిపై డొనాల్డ్ ట్రంప్ విసుర్లు

వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఉన్న భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామిపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకు పడ్డారు. ఆయన మోసపూరిత ప్రచార జిమ్మిక్కులకు పాల్పడుతున్నారన్నారు. వివేక్ అనుచరులు ‘సేవ్ ట్రంప్, ఓట్ వివేక్’ అన్న షర్టులు ధరించడం, అవి వైరలవడం ట్రంప్‌కు ఆగ్రహం తెప్పించింది. తనకు మద్దతిస్తున్నట్లు కనిపిస్తూనే మోసపూరిత ప్రచార ట్రిక్కులు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. వివేక్ మాయలో పడకుండా తనకే ఓటేయాలన్నారు. వివేక్‌పై ట్రంప్ నేరుగా విమర్శలు చేయడం ఇదే తొలిసారి.

త్రుటిలో తప్పిన మరో విమాన ప్రమాదం

టోక్యో: అమెరికాలో విమానం మార్గమధ్యంలో కిటికీ ఊడిపడి ప్రయాణికులు నరకం చూసిన ఘటన మరువకముందే దాదాపు అలాంటి ఘటనే జపాన్‌లో జరిగింది. కాక్‌పిట్ కిటికీకి పగుళ్లు రావడంతో అప్రమత్తమైన విమాన పైలెట్లు వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించి ఎమర్జెన్సీ ల్యాండింగ్‌చేశారు. జపాన్‌లోని సప్పోరో నగరంలోని న్యూ చిటోసే ఎయిర్‌పోర్ట్‌లో శనివారం జరిగిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. 59 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో ఆల్ నిప్పన్ ఎయిర్‌వేస్‌కు చెందిన దేశీయ బోయింగ్ 737–800 రకం విమానం సప్పోరో నుంచి టొయామాకు బయల్దేరింది. మార్గమధ్యంలో కాక్‌పిట్ కిటికీలో పగుళ్లను గుర్తించారు. పైలెట్లు వెంటనే అప్రమత్తమై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. వారి అనుమతితో మళ్లీ అదే ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయడంతో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది.

యుద్ధజ్వాలలకు... 100 రోజులు

రావణకాష్టంగా గాజా ● ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం

క్రైస్తవ, ముస్లిం, యూదు మతాల పవిత్ర స్థలాలకు నెలవైన జెరూసలేంలోని అల్–అక్సా మసీదు ప్రాంతంలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దళాల దాడులతో రాజుకున్న వివాదం చివరకు హమాస్–ఇజ్రాయెల్ యుద్ధంగా తీవ్రరూపం దాల్చి ఆదివారంతో 100 రోజులు పూర్తిచేసుకుంది. అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్ సరిహద్దు గ్రామాలపై హమాస్ మిలిటెంట్ల మెరుపు దాడులు, 1,200 మంది ఇజ్రాయెల్ పౌరుల హతం, 200 మందికిపైగా అపహరణతో మొదలైన ఈ ఘర్షణ ఆ తర్వాత ఇజ్రాయెల్ భూతల, గగనతల భీకర దాడులతో తీవ్ర మానవీయ సంక్షోభంగా తయారైంది. వందల కొద్దీ బాంబు, క్షిపణి దాడుల ధాటికి లక్షలాది మంది పాలస్తీనియన్లు ప్రాణభయంతో పారిపోయారు. దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా లక్షలాది మంది నిరాశ్రయులై తిన డానికి తిండి, ఉండటానికి ఇల్లు లేక, కనీసం తాగు నీరు లేక జీవచ్ఛవాల్లా బతుకీడుస్తున్నారు. ఈ యుద్ధం 23 వేలకుపైగా ప్రాణాలను బలితీసుకోగా పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులను మరింత పెంచింది. ఐక్యరాజ్య సమితి మానవీయ సాయం డిమాండ్లు, తీర్మానాలతో కాలం వెళ్లదీస్తోంది.



మృత్యు నగరాలు

ఇజ్రాయెల్ దాడులతో గాజా స్ట్రిప్‌లోని ప్రతి పట్టణం దాదాపు శ్మశానంగా తయారైంది. మొత్తం 23 లక్షల జనాభాలో 85 శాతం మంది వలసపోయారు. ఉత్తర గాజాపై, ఆ తర్వాత దక్షిణ గాజాపై దాడుల ఉధృతి పెరగడంతో జనం ఈజిప్ట్ చిట్టచివరి సరిహద్దు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలెంట్లు, యెమెన్‌లోని హౌతీల దాడులతో యుద్ధజ్వాలలు పశ్చిమాసియాకు పాకుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటించేదాకా బందీలను వదిలిపెట్టబోమని, దాడులను ఆపబోమని హమాస్, దాన్ని హమాస్‌ను కూకటివేళ్లతో పెకలించేదాకా యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయెల్ అంటున్నాయి!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫలించని దౌత్యం

ఖతార్, అమెరికా దౌత్యం తొలుత సఫలమైనట్లే కనిపించింది. ఇజ్రాయెల్, పాలస్తీనా పరస్పరం బందీలను విడుదల చేశాయి. కానీ ఆ వెంటనే మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఈ వంద రోజుల్లో లక్షలాది ఇళ్లు, వేలాది ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు ఉండటం అత్యంత విషాదకరం.

రోగాల పుట్టలుగా శరణార్థి శిబిరాలు

గాజాలో శరణార్థి శిబిరాలు కిటకిటలాడుతున్నాయి. జనం రోగాలబారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఆహార, సరకులు, ఔషధ సాయం అందకుండా ఇజ్రాయెల్ దాడులకు దిగుతుండటంతో అక్కడ ఎటు చూసినా భయానక పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 15 : జనవరి : 2024


సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆదివారం బెంగళూరు కేఆర్ పూల మార్కెట్‌లో రద్దీ. పూలు పండ్ల ధరలు పెరిగినప్పటికీ కొనుగోళ్ల జోరు ఏమాత్రం తగ్గలేదు. రంగురంగుల పుష్పాల చుట్టలు కనువిందు చేసిన దృశ్యం

ఇంటింటా సంక్రాంతి శోభ

- వాడవాడలా భోగి ఉత్సవాలు
- పల్లెసీమల్లో సంప్రదాయ వైభవం

శివాజీనగర: రాష్ట్రమంతటా సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. పల్లెసీమలు, పట్టణాలు అనే తేడా లేకుండా భోగి పండుగ వేడుకలు ఆదివారం ఉదయం నుంచి ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. విద్యా, ఉద్యోగాల కోసం నగరాల్లో ఉంటున్న వేలాది మంది సొంతూళ్లకు వెళ్లిపోయారు. బంధుమిత్రులతో కలిసి వేకువజామునే భోగి మంటలు వెలిగించి ఆనందోత్సాహాలతో గడిపారు. ముగ్గులు, సంప్రదాయ వేడుకలు, పిండివంటలతో ఇంటింటా పండుగ కళ నెలకొంది. కన్నడనాట ఎళ్లుబెళ్ల పేరుతో బంధువుల, ఇరుగుపొరుగు నువ్వులు- బెల్లం పంచుకుని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈ సంవత్సరం అధిక సంవత్సరమైన కారణాన ఈ నెల 15న మకర సంక్రాంతి ఆచరించనున్నారు.

గవి గంగాధరునికి కిరణ స్పర్శ

బెంగళూరు నగరంలో గవి గంగాధరేశ్వర దేవాలయంలో శివలింగంపై సూర్యకిరణ స్పర్శ కావడం ప్రతి సంక్రాంతికి జరిగే విశేషం. ఆ అరుదైన క్షణాల కోసం వేలాది మంది భక్తులు వేచి ఉండి సాక్షులయ్యారు. బ్యాటరాయనపుర నియోజకవర్గం జక్కూరు మైదానంలో సుగ్గి- హుగ్గి సంబరాలను జరిపారు. రెండు రోజుల పాటు జానపద సంగీతం, గోలీల ఆట, గాలిపటాల ఎగురవేయటం, ఎద్దుల బండి సవారితో పాటుగా జానపద నృత్యాలు, చిత్రకళ వంటి అనేక కార్యక్రమాల్లో పిల్లలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉడుపిలో సప్తోత్సవం

ఉడుపి శ్రీకృష్ణమఠంలో శ్రీకృష్ణ ప్రతిష్ట స్మరణార్థం ఈ నెల 9 నుంచి 15 వరకు సప్తోత్సవ సంబరాలు జరుగుతున్నాయి. ద్వైత మత స్థాపకులు మధ్వాచార్యులు ఎనిమిది శతాబ్దాల క్రితం మకర సంక్రమణ రోజున శ్రీకృష్ణుని విగ్రహాన్ని తీసుకొచ్చి ఆలయంలో స్థాపించారు. అందుకు గుర్తుగా సప్తోత్సవాలను ఆచరిస్తారు. మకర సంక్రమణ రోజున తెప్పోత్సవం జరుగుతుంది. ఆదివారం రాత్రి మూడు తేరుల ఉత్సవం వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం చూర్ణోత్సవం, పల్లకీ పూజ, అన్నప్రసాదం పంపిణీ నిర్వహిస్తారు.

ధార్వాడలో సంబరాలు

ఉత్తర కర్ణాటకలో సంక్రాంతి సందడి అంబరాన్ని తాకింది. ధార్వాడలో పలు కుటుంబాలు కలిసి రంగవల్లులు వేసి, పిండివంటలు చేసి ఆరగించారు. ధార్వాడలో ఆదివారం సామూహిక భోగి వేడుకలను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఇక మైసూరు, మండ్య, హాసన్ తదితర దక్షిణాది జిల్లాల్లో మంటల్లో నుంచి ఎద్దులను పరిగెత్తించి సంప్రదాయాన్ని చాటుకున్నారు.


మైసూరు వద్ద మంటల్లో నుంచి ఎద్దుల పరుగు


భోగి వేడుకలకు బుడత ముస్తాబు


ఆదివారం రాత్రి ఉడుపి శ్రీకృష్ణ ఆలయం ముందు మూడు తేర్ల ఉత్సవం


దార్వాడలో భోగి- సంక్రాంతి ఉత్సవాలలో పిండివంటలతో మహిళలు




యాదగిరి జిల్లాలో మైలార లింగేశ్వర జాతర

పొగమంచుతో విమానాలకు ఇబ్బంది

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు ఆవహించడంతో ఆదివారం ఉదయం పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు 34 విమానాల టేకాఫ్ ఆలస్యంగా జరిగింది. పొగమంచు వల్ల దారి కనిపించకపోవడంతో 2గంటల పాటు టేకాఫ్, ల్యాండింగ్‌లు వాయిదా పడ్డాయి. దీంతో పలు విమానాలు ఆలస్యంగా సాగడంతో ప్రయాణికులు పడిగాపులు కాశారు.


ఎయిర్‌పోర్టులో పొగమంచు

ప్రేమ, రాగిణి.. పొంగల్

శివాజీనగర: నగరంలోని భారతీ నగరలో కాక్స్‌టౌన్ శ్రీ గంగమ్మ దేవాలయం ముందు నటీమణులు ప్రేమ, రాగిణి ద్వివేదిలు సంక్రాంతి పండుగ సంబరాలను జరుపుకొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక నివాసితులు, పౌర కార్మికులతో కలిసి భోగి మంటలు వెలిగించి పొంగల్ వండారు. గోపూజ చేసి సంబరాలను చేసుకొన్నారు. పౌర కార్మికులకు చీరలను, స్వీట్స్ పంపిణీ చేశారు.


పొంగల్ వండుతున్న నటీమణులు

ఆదర్శనీయులు వివేకానందుడు


కార్యక్రమంలో స్వామీజీ తదితరులు

గౌరిబిదనూరు: నేటి యువతరానికి వివేకానందులవారు ఆదర్శ పురుషులని, హిందుత్వానికి వీరు ప్రతీకలని, మౌఢ్యాచరణ వ్యతిరేకులని బిజాపూర్ కు చెందిన శాంతికుటీర ఆశ్రమం స్వామి శ్రీ కృష్ణమహారాజ్ తెలిపారు. ఇక్కడికి సమీపంలోని శ్రీ రామకృష్ణ శారదాదేవి విద్యాసంస్థలో వివేకానంద జయంతి, యువజనోత్సవం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ మనిషికి పరిపూర్ణత్వాన్ని ప్రసాదించేది విద్య, మనిషిలోని వినయాన్ని నిద్రలేపుతుంది. హిందుత్వాన్ని ప్రపంచ దేశాలకు చాటినవారు వివేకానందులవారు, లేవండి, లేచి లక్ష్యం చేరేవరకు విశ్రమించకండి అని యువతకు పిలుపునిచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరత్‌రాజ్, ప్రవీణ్‌కుమార్, విడి గణేశ్, రేష్మా తాజ్ పాల్గొన్నారు. బాలలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు వితరణ చేశారు.

మహిళా కండక్టర్‌కు కత్తిపోట్లు

యశవంతపుర: బెంగళూరులో బీఎంటీసీ బస్‌లో మహిళా కండక్టర్‌ను చాకుతో పొడిచి గాయపరిచారు. నిందితులు కూడా మహిళలే కావడం గమనార్హం. వివరాలు.. దాసరహళ్లి డిపో-40కి చెందిన బీఎంటీసీ బస్సు నెలమంగల వైపు వెళుతుండగా మహిళలు ఎక్కారు. టికెట్ తీసుకోకుండా సీటులో కూర్చున్నారు. మహిళా కండక్టర్ సుకన్య వచ్చి టికెట్ తీసుకోవాలని, లేదా ఆధార్ కార్డు చూపాలని కోరారు. దీంతో వివాదం మొదలైంది. తనిఖీ అధికారులు వస్తే తనపై చర్యలు తీసుకుంటారని కండక్టర్ గట్టిగా మాట్లాడారు. దీంతో కోపోద్రిక్తులైన మహిళలు కత్తి తీసుకుని ఆమెపై దాడి చేసి బస్సు దిగి పరారయ్యారు. గాయపడిన కండక్టర్ నెలమంగల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు ఖాకీ వేధింపులు

యశవంతపుర: భర్తతో గొడవ పడి న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళకు అక్కడ పోలీస్ రూపంలో కీచకుడు ఎదురయ్యాడు. ఫిర్యాదుదారుపై వేధింపులకు పాల్పడిన ఘటన కలబురిగి జిల్లా కమలాపుర పోలీస్ స్టేషన్‌లో జరిగింది. భర్తతో ఘర్షణ పడిన మహిళ ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. కానిస్టేబుల్ బసవరాజు ఆమెతో మాట్లాడి మొబైల్ నంబర్‌ను తీసుకున్నాడు. అప్పటినుంచి ఆమెకు తరచూ ఫోన్ చేసి ఒక రాత్రి తనతో గడపాలంటూ వేధిస్తున్నట్లు మహిళ వాపోయింది. ఒక రోజు బలవంతంగా బసవరాజు కారులో తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు, పెళ్లి చేసుకోంటా, భర్తను వదిలేసి రావాలని ఒత్తిడి చేశాడని ఆరోపించింది. తన మాట వినకుంటే మహిళతో పాటు నీ తల్లిదండ్రులను కూడా జైలుకు పంపుతానంటూ బెదిరించాడని తెలిపింది.

కారు పల్టీ, ఎమ్మెల్యేకు గాయాలు

యశవంతపుర: కలబురిగి గ్రామీణ ఎమ్మెల్యే బసవరాజ మత్తిమడు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. కలబురగి తాలూకా పాశా గ్రామం వద్ద ఆదివారం శహబాద్ పట్టణానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. కారులోని ఎమ్మెల్యే మత్తిమడు, గన్‌మ్యాన్‌తో పాటు ఆయన స్నేహితులు స్వల్పంగా గాయపడ్డారు. కారులో ఉన్నవారే ప్రమాదాన్ని వీడియో తీశారు. కారు అద్దాలు పగిలిపోయాయి. ఎమ్మెల్యే తదితరులు మరో కారులో వెళ్లి కలబురిగి ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

ఘనంగా భోగి సంబరాలు

- రంగు రంగుల ముగ్గులతో లోగిలన్నీ ముస్తాబు
- ఇంటింటా భోగి మంటలు
- సంక్రాంతి, కనుమకు సర్వంసిద్ధం


గొబ్బెమ్మలు ఉంచి పూజ చేస్తున్న ఓ కుటుంబం


ఇంటి ముంగిట అందమైన రంగవల్లులు వేస్తున్న మహిళలు


సంక్రాంతి ముగ్గును తీర్చిదిద్దుతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగ భోగితో ప్రారంభమవుతుంది. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరయాణంలోకి ప్రవేశించే మొదటి రోజైన భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భోగి పండుగ నేపథ్యంలో బళ్లారి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో మన సంస్కృతి వారసత్వాలకు అద్దం పట్టేలా పండుగను ఆచరించారు. తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకునే ఈ పండుగ కర్ణాటకలో కూడా తెలుగు, కన్నడిగులు కలిసి, మెలసి పండుగలను ఎంతో వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భోగి పండుగ రోజున ఉదయాన్నే ఇంటింటా భోగిమంటలు వేశారు. అనంతరం రంగురంగులు ముగ్గులు వేసి పండుగను ఆచరించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇంటి ఆడపడుచులు, అల్లుళ్లతో సంబరాలు చేసుకుని పిండివంటలు ఆరగించారు.

ఇక సంక్రాంతి, కనుమ సందడి :

సంక్రాంతి రోజు ప్రతి ఇంటి ముందు ముగ్గులను వేసి వాటి మధ్యలో పేడతో గొబ్బెమ్మలను ఉంచుతారు. ఇక కనుమను పశువుల పండుగ అంటారు. రైతులు పశువులను శుభ్రంగా కడిగి అలంకరించి పూజిస్తారు. అన్నదాతలు తుంగభద్ర ఆయకట్టు కింద కష్టపడి చేసిన వ్యవసాయ ఫలితం ధాన్యలక్ష్మీ రూపంలో ఇళ్లకు చేరడంతో పండగను విశేషంగా ఆచరిస్తున్నారు. ఇక గంగిరెద్దుల వారి సందడి అక్కడక్కడ కనిపించడంతో కొత్తశోభను సంతరించుకుంటోంది.


నగరంలో చెరకు విక్రయాలు

● అయోధ్య రామా.. కరుణించుమా



అయోధ్యలో ఈనెల 22న జరిగే సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఒక్కరినీ భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఆదివారం మండ్యలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వేషధారణలో ఆకట్టుకున్నారు.

నెమలికి వైద్యం

కంప్లి: గాయపడిన నెమలికి సండూరు తారానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది చికిత్స చేసి మానవత్వం చాటుకున్నారు. నెమలి నడవలేని స్థితిలో ఉండగా అటవీ ఉద్యోగి రాము వెంటనే పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. పరీక్షించిన ఆరోగ్య కేంద్ర డాక్టర్లు సునీల్, హరీశ్ బయటి నుంచి మందులు తెప్పించి జాతీయ పక్షికి ప్రాణం పోశారు.

తాగి వేధిస్తున్నాడని లుంగీతో ఉరివేసింది

యశవంతపుర: మద్యానికి బానిసై వేధిస్తున్న భర్తను లుంగీతో ఉరివేసి అంతమొందించిన భార్య ఉదంతం మంగళూరు నగరంలో జరిగింది. గడగ్ జిల్లా ఇటగి గ్రామానికి చెందిన హనుమంతప్ప(39), గీత దంపతులు మంగళూరుకు వలస వెళ్లారు. సంతూరు వద్ద అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. హనుమంతప్ప కూలి పని చేస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించేవాడు. అయితే మద్యానికి బానిసై రోజు భార్య గీతాతో గొడవపడి కొట్టేవాడు. ఈ నెల 10న రాత్రి కూడా భార్యతో గొడవకు దిగాడు. దీంతో ఆమె తన భర్త మెడకు లుంగీ బిగించి హత్య చేసింది. మద్యం తాగి వచ్చి వాంతులు చేసుకొని మృతిచెందినట్లు స్థానికులను నమ్మించింది. అయితే మంగళూరు కద్రి పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా భర్త వేధింపులు తాళలేక హత్య చేసినట్లు అంగీకరించింది. దీంతో ఆమెను అరెస్ట్ చేశారు.

రోడ్లపై యమధర్మరాజు, చిత్రగుప్తుడు

- ట్రాఫిక్ రూల్స్‌పై కళాకారులతో జాగృతి

బనశంకరి: రోడ్డు ప్రమాదాలను నివారించే క్రమంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ఉప్పారపేట ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా జాగృతి కల్పించారు. రంగభూమి కళాకారులకు యమధర్మరాజ, చిత్రగుప్తుడిలా వేషాలు వేయించి మైసూరు బ్యాంకు సర్కిల్ వద్ద జాగృతం చేపట్టారు. హెల్మెట్ ధరించకపోవడం, ఆఫ్ హెల్మెట్ ధరించడం, మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారికి యమధర్మరాజు వేషధారి గులాబీ పుష్పాలు అందించి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. మీకోసం మీ ఇంట్లో వేచిచూస్తున్నారని, నిబంధనలు పాటిస్తే మాత్రమే భద్రంగా ఇంటికి వెళతారని చెప్పాడు. కళాకారులు నాగేంద్ర, రంగనాథ్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి బోసురాజ్

రాయచూరు రూరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మౌలిక సౌలభ్యాలు కల్పిస్తామని రాష్ట్ర మంత్రి బోసురాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించి పాఠకులతో మాట్లాడారు. తాగునీరు, శౌచాలయం, అదనపు పుస్తకాలను తెప్పించేందుకు అధికారులతో చర్చిస్తామన్నారు. మంత్రి వెంట నగర సభ కమిషనర్ గురు సిద్దయ్య, జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి నిర్మల, నగర సభ సభ్యులు జయన్న, రుద్రప్ప అంగడి తదితరులు పాల్గొన్నారు.

ఉస్తాద్ రషీద్ ఖాన్‌కు నివాళి


శ్రద్ధాంజలి ఘటిస్తున్న స్వామిజీ

రాయచూరు రూరల్: సంగీత విద్వాంసుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ సంగీతంలో మేరు బంగారమని కిల్లే బృహన్మఠం మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అన్నారు. శనివారం సాయంత్రం ఆ మఠంలో ఉస్తాద్ రషీద్ ఖాన్ స్వర సమన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు ఉస్తార్ రషీద్ ఖాన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రఘుపతి పూజార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

బళ్లారి అర్బన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని గురు తిప్పేరుద్ర (ఎస్‌జీటీ) కళాశాలలో ఏర్పాటు కార్యక్రమంలో పూజ్య శ్రీ మాత ప్రభోదమయి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వివేకానంద గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన బోధించిన తత్వాలు ఎందరికో ఆదర్శమని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీ సంస్థ కార్యదర్శి జీ.నాగరాజు, కోశాధికారి మంజుల, ఉపాధ్యాయులు ఉమాదేవి, ఉమామహేశ్వరి, విద్యా, సౌమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మరో ఇద్దరు నిందితులు అరెస్ట్

- హానగల్ గ్యాంగ్ రేప్ కేసు..
- సాంత్వన కేంద్రంలో యువతి
- హావేరి ఎస్పీ వెల్లడి


విలేకరులతో మాట్లాతున్న ఎస్పీ

యశవంతపుర: హావేరి జిల్లాలో హానగల్‌లో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు హావేరి జిల్లా ఎస్పీ అంశుకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న జరిగిన ఘటనకు సంబంధించి బంకాపురలో, దావణగెరెలో ముగ్గురిని అరెస్టు చేశారు. కొత్తగా ఇమ్రాన్ బషీర్ జకినకట్టి, రేహన్ మహ్మద్ హుసేన్ వలీకార్ అనేవారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. హావేరి లాడ్జిలో నాలుగైదు మంది యువకులు యువతిపై దాడి చేసి, లైంగికదాడి చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 306, 376 డి సెక్షన్లు కింద కేసు నమోదు చేసి, విచారణకు ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఆరుమంది ఎస్‌ఐలను నియమించినట్లు తెలిపారు.

బాధితురాలితో ఎమ్మెల్యే భేటీ?

నిందితులను తీసుకెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించామని, ఆపై వైద్య పరీక్షలకు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. యువతిపై దాడి వీడియోలు వైరల్ కావడంతో సుమోటోగా కేసుగా స్వీకరించి విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాధితురాలిని సాంత్వన కేంద్రంలో ఉంచామని, గత రాత్రి ఆమెను ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే కలిశారని విలేకరులు ప్రస్తావించగా, సాంత్వన కేంద్రం మా పరిధిలో లేదు. అక్కడి సీఐ అవకాశం కల్పించి ఉండవచ్చు, దీనిపై పరిశీలన చేస్తామన్నారు. బాధితురాలు ఎవరినైనా కలవవచ్చని, తాము అభ్యంతరం చెప్పబోమని అన్నారు. సాంత్వన కేంద్రానికి మహిళా అధికారిని ఎందుకు నియమించలేదని విలేకర్లు ప్రశ్నించారు. కాగా, ఉత్తరకన్నడ జిల్లా ఎస్పీతో చర్చించి సిర్సిలోని బాధిత యువతి ఇంటికి భద్రత కల్పిస్తాన్నారు. నిందితులపై పాత నేరాలు ఉన్నట్లు లేవన్నారు. వారిలో బాల నేరస్తులు కూడా లేరన్నారు. మరోవైపు హానగల్‌లో ఒక వర్గం యువతి కిడ్నాప్ కేసులోనూ సత్వరమే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కోలారు వార్తలు...

మార్కెట్లు కిటకిట


చెరకు గడలను విక్రయిస్తున్న దృశ్యం

మాలూరు: పట్టణంతో పాటు తాలూకా వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ఆనందంతో జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. పండుగ ముందురోజు ఆదివారం పెద్ద సంఖ్యలో ప్రజలు పండుగ సామాగ్రిని కొనుగోలు చేయడానికి మార్కెట్లకు తరలి వచ్చారు. ఇక పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. కనకాంబరాలు కిలో రూ. 1500, కాగడాలు రూ. కిలో 1100, మల్లెలు కిలో రూ. 1600, రూలు, గులాబీలు కిలో రూ. 300, చేమంతులు రూ. 300, బంతిపూలు కిలో 80, అనపకాయలు కిలో 80 నుంచి 100 రూపాయల వరకు విక్రయించారు.

రగ్గుల పంపిణీ

కోలారు : పేదలకు ఉలుచుకమ్మి మహాసభ ఆధ్వర్యంలో రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు సానామూర్తి మాట్లాడుతూ...చలిలో వీధుల్లో జీవిస్తున్న వారిని దృష్టిలో ఉంచుకుని ఉచితంగా రగ్గులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 40 మందికి రగ్గులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు వైవి మంజునాథ్, ఏసీ రాధాకృష్ణ, నాగేంద్ర ప్రసాద్, రామ్ ప్రసాద్, జయనగర శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడండి


సమావేశమైన రైతు సంఘం పదాధికారులు

కెజీఎఫ్ : సరిహద్దు ప్రాంతాలలో ఏనుగులు పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తున్నాయని, దీంతో పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న సాయంత్రం 7 గంటలకు బంగారుపేట తాలూకా తొప్పనహళ్లి క్రాస్ వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహిస్తామని రైతు సంఘం పదాధికారులు తీర్మానం చేశారు. ఆదివారం బంగారుపేట తాలూకా కదరినత్త గ్రామంలో ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతు పొలం వద్ద సమావేశమై రైతు సంఘం పదాధికారులు ఈ తీర్మానం చేశారు. ఏనుగుల దాడిలో లక్షల రూపాయల నష్టం రైతులకు కలుగుతోందన్నారు. ఏనుగుల బెడదకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం కనుగొనాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ, జిల్లా అధ్యక్షుడు కిరణ్, ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా. జావిద్. ఈకంబళ్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శ్రీరాముడి బృహత్ కటౌట్


మాట్లాడుతున్న ఓం శక్తి చలపతి

కోలారు : నగరంలోని డూం లైట్ సర్కిల్ వద్ద సోమవారం 40 అడుగుల శ్రీరాముడి కటౌట్‌ను ప్రారంభిస్తున్నట్లు కుడ మాజీ అధ్యక్షుడు ఓం శక్తి చలపతి తెలిపారు. ఆదివారం ఆయన నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 500 సంవత్సరాల రామమందిర నిర్మాణం కలలు నేడు నెరవేరుతున్న శుభతరుణంలో శ్రీరాముడి బృహత్ కటౌట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు, కార్యక్రమంలో నాగలాపురం మఠం శ్రీ తేజేశ లింగ మహాస్వామీజీ, చొక్కహళ్లి మహాస్వామి, ఇస్కాన్ భజన బృందం, హనుమాన్ చాలీసా బృందం సభ్యులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇది దేశ వ్యాప్తంగా పండుగ జరుపుకోవాల్సిన సమయమన్నారు. కటౌట్ ప్రారంభ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రామ భక్తులు హాజరు కావాలన్నారు. విలేకరుల సమావేశంలో భజరంగదళ్ బాలాజీ, దిశా సమితి సభ్యుడు సామబాబు, నామల్ మంజు, ఏబీవీపీ మహేష్, శివమూర్తి తదితరులు ఉన్నారు.

తరచూ ఉద్యోగ మేళాలు నిర్వహించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: ప్రభుత్వ కళాశాలల్లో తరచూ ఉద్యోగ మేళాలు నిర్వహించడం ద్వారా గ్రామీణ పేద విద్యార్థినులకు ఎంతో సహాయకారిగా ఉంటుందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఆర్ గంగాధర రావ్ తెలిపారు. ఆదివారం కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, ప్రధాన మంత్రి కౌశల్య వికాసన కేంద్రం ఆధ్వర్యంలో ఐదు ప్రైవేటు కంపెనీల ఉద్యోగ మేళాను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ కోశాధికారి జీఎం ప్రకాష్, డాక్టర్ కె ఎస్ శ్రీనివాసయ్య, బృందాదేవి, కెఆర్ మంజుల, డాక్టర్ చైత్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపన్యాసకుల డిమాండ్లు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: తమ డిమాండ్లు పరిష్కరించాలని అతిథి ఉపన్యాసకులు ఆదివారం ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథి ఉపన్యాసకులు రాష్ట్రంలో 4 వేల మందికి పైగా అతిథి ఉపన్యాసకులు జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేవలం నెలకు రూ. 12 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారు. వేతనాన్ని రూ. 25 వేలకు పెంచాలని, విద్యా సంవత్సరం పూర్తయిన తరువాత వచ్చే విద్యా సంవత్సరంలో కూడా అతిథి ఉపన్యాసకులను కొనసాగించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం సభ్యుడు ఎస్ సాగర్, రాజణ్ణ, ప్రభావతి, అమృత, సుప్రియ ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన శిశు పాలనా కేంద్రాలు


ప్రారంభానికి సిద్ధమైన శిశుపాలనా కేంద్రం

కెజీఎఫ్ : కూలి కార్మికుల పిల్లల ఆలనా పాలన కోసం కేజీఎఫ్ నగరంలో 12 శిశు పాలనా కేంద్రాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. తాలూకాలోని 16 గ్రామ పంచాయతీలలో 12 గ్రామ పంచాయతీలలో శిశుపాలనా కేంద్రాలను నిర్మించారు. రాష్ట్రంలో కూలీలు పనులకు వెళ్లిన సమయంలో వారి మూడేళ్లలోపు పిల్లలను ఈ శిశుపాలనా కేంద్రాలలో వదలి వెళితే పసి పిల్లల ఆలనా పాలనా అక్కడి సిబ్బంది చూసుకుంటారు. ఇప్పటికే కెజీఎఫ్ తాలూకాలోని పారండహళ్లి, కమ్మసంద్ర, సుందరపాళ్య, వెంగసంద్ర, ఎన్‌జి హుల్కూరు, బేతమంగల, మారికుప్పం, ఘట్టమాదమంగల, జక్కరసనకుప్ప, కంగాండ్లహళ్లి, రామసాగర, గ్రామ పంచాయతీ వ్యాప్తిలో శిశుపాలనా కేంద్రాలను నిర్మించారు. ఈ సందర్భంగా 50 మంది కేర్ టేకర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రతి శిశుపాలనా కేంద్రంలో నలుగురు కేర్ టేకర్లు పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటారు. ఈ కేంద్రాలను త్వరలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతాయని తాలూకా పంచాయతీ ఈఓ మంజునాథ్ తెలిపారు. ఈ కేంద్రాలలో పిల్లలకు సిరిధాన్యాల గంజి, పాలు, గుడ్లు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తారు.

ఎంపీ హెగ్డేని అరెస్టు చేయాలి

శివాజీనగర: సీఎం సిద్ధరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డేకు వ్యతిరేకంగా ఆదివారం నగరంలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కారవార ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే మతం, శ్రీరాముని పేరుతో ముఖ్యమంత్రిపై నీచమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సీఎంను దూషించి, మసీదులను పడగొట్టాలని మాట్లాడిన ఎంపీని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. నేతలు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఎగిరిపడ్డ కారు

- ఇద్దరు ప్రైవేటు బ్యాంకు అధికారులు మృతి
- మండ్య వద్ద దుర్ఘటన


ప్రమాదంలో ధ్వంసమైన ఇన్నోవా కారు

మండ్య: ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులు ప్రయాణిస్తున్న కారు రోడ్డు డివైడర్‌కు ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండ్య నగర శివార్లలోని కె.కొడిహళ్లి సమీపంలోని బెంగళూరు–మైసూరు జాతీయ రహదారిపై జరిగింది. వివరాలు.. బెంగళూరు జేపీ నగరలో ఉండే ఐసీఐసీఐ హోం ఫైనాన్స్ కంపెనీ ప్రాంతీయ బిజినెస్ మేనేజర్ హెచ్‌పి శంకర్ (45), ఫైనాన్స్ విభాగం అధికారి మహదేవ్ తిరూర్ (37), మేనేజర్ కిశోర్ మైసూరులో జరిగిన కంపెనీ సమావేశంలో పాల్గొని, స్కార్పియో కారులో బెంగళూరుకు తిరుగుపయానమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున 4.45 గంటలకు కారు అతి వేగంతో వెళ్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఎగిరి పడింది. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను తగలడంతో అది ధ్వంసం అయింది. అవతలి లేన్లను దాటుకుని ఒక గోడను ఢీ కొట్టింది. శంకర్, మహదేవ్ తిరూర్‌లు తీవ్ర గాయాలతో మృతి చెందారు.

సహాయక చర్యలు

ఈ ప్రమాదంతో రహదారిపై కొంత సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సీఐ జేఈ మహేశ్, మరో 20 మంది సిబ్బంది అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన కిశోర్‌ను బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌పీ తిమ్మయ్య, డీఎస్పీ కృష్ణప్ప తదితరులు పరిశీలించారు. శంకర్ స్వస్థలం మండ్య జిల్లా కేఆర్‌పేటే తాలూకా హెమ్మనహళ్లికి, మహదేవ్ బెళగావి జిల్లా హుక్కేరికి చెందిన వారు. కిశోర్ కోలారు జిల్లా వేమగల్ తాలూకా శెట్టిహళ్లివాసి.

క్లుప్తంగా

రాహుల్ న్యాయ యాత్రపై సంబరాలు


స్వీట్లు పంచుతున్న నాయకులు

తుమకూరు: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ న్యాయం కోసం ప్రారంభించిన భారత జోడో యాత్ర విజయవంతం కావాలని జిల్లా కాంగ్రెస్ శుభాకాంక్షలు తెలిపింది. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ అధ్యక్షతన స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. దేశ ప్రజలకు న్యాయం జరగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రాహుల్‌గాంధీ మణిపూర్ నుంచి ముంబై వరకు జోడో యాత్రను చేపట్టినట్లు తెలిపారు.

ఆలయాల్లో శుభ్రత

శివాజీనగర: అయోధ్య రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో దేశమంతటా ఆలయాల ఆవరణలను శుభ్రం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నాయకులు ఆదివారం ఆలయాల్లో స్వచ్ఛతా పనులు చేపట్టారు. ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ బెంగళూరులోని జయనగర 4వ బ్లాక్‌లో ఉన్న గణపతి ఆలయ ఆవరణలో మాజీ మంత్రి అశ్వత్థనారాయణ, బీజేపీ ప్రధానకార్యదర్శులు పీ.రాజీవ్, ప్రీతంగౌడ, బెంగళూరు ఉత్తర జిల్లాధ్యక్షుడు నారాయణగౌడ మల్లేశ్వరంలోని కొదండరామ ఆలయంలో పరిశుభ్రతా పనులు చేపట్టారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


అక్షింతల పంపిణీలో పాల్గొన్న మాజీ మంత్రి సుధాకర్ తదితరులు

విజయపుర:అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలు, కరపత్రాలను విజయపుర హోబళి ముద్దేనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ఇళ్లకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మాజీ మంత్రి డాక్టర్ కె.సుధాకర్ ప్రారంభించారు. శ్రీ ఆంజనేయ స్వామి మందిర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈ పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. నారాయణపుర గ్రామంలో అక్షింతలతో పాటు అయోధ్య రామ మందిర చిత్రపటం ఉన్న కరపత్రాన్ని పంపిణీ చేశారు. సుధాకర్ మాట్లాడుతూ ఎంతో మంది హిందూ కార్యకర్తల బలిదానం వల్ల ఈ భవ్య రామ మందిర నిర్మాణం పూర్తయిందని, వేలాది ఏళ్ల తర్వాత లక్షలాది మంది హిందువుల కల నిజమవుతుందని తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

విజయపుర: క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం లభిస్తుందని కేంద్రమంత్రి నారాయణ స్వామి అన్నారు., క్రికెట్ వంటి ఆట ద్వారా ఆటగాళ్ల మధ్య స్నేహం కూడా పెంపొందుతుందని తెలిపారు. పట్టణ ప్రభుత్వ మైదానంలో మూడు రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. జై మారుతి క్రికెట్ బృందం, ఎస్ఆర్ఎస్ బాయ్స్, అక్షతా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా విజయపుర ప్రీమియర్ లీగ్ పేరిట టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని ఏర్పాటు చేశారు.

ధార్మిక కేంద్రాలు శాంతికి నిలయాలు


ఆర్థిక సహాయం అందజేస్తున్న డైరెక్టర్ సునందమ్మ

గౌరిబిదనూరు: ధార్మిక కేంద్రాలు శాంతికి నిలయాలని,వాటి అభివృద్ధి మనందరి బాధ్యత అని కోలారు మిల్క్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, బ్రాహ్మణ క్షేమాభ్యుదయ సంఘం గౌరవాధ్యక్షుడు డైరీ రమేశ్ అన్నారు. పట్టణంలోని శారదా మఠంలో బ్రాహ్మణ అభివృద్ధి సంఘం చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులకు కొచిముల్ తరఫున డైరెక్టర్ సునందమ్మ నుంచి ఆర్థిక సహాయం స్వీకరించి ప్రసంగించారు. సంఘం అధ్యక్షుడు రఘుబాబు, రాజేశ్,శివప్రసాదశర్మ,శశిధర్ శర్మ, దశిక శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.

‘చంపుతామని బెదిరిస్తున్నారు’

యశవంతపుర: ప్రాణం తీస్తామంటూ కొందరు బెదిరిస్తున్నారని దావణగెరె ఎంపీ జీఎం సిద్దేశ్వర అరోపించారు. అయన ఆదివారం దావణగెరెలో విలేకర్లతో మాట్లాడారు. తనను అంతమొందించేందుకు కొందరూ ప్రయత్నిస్తున్నట్లు అరోపించారు. ఎక్కడికి వెళ్లినా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంబరాలు.. సంతోషాలు నింపిన భోగి




బెంగళూరులో చెరకుగడల విక్రయాలు, బెంగళూరులో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు, పొంగల్ తయారీకి అందంగా అలంకరించిన కుండలు

- కోరమంగల నందన ప్యాలెస్‌లో మిన్నంటిన సంబరాలు

దొడ్డబళ్లాపురం: మకర రాశిలోకి సూర్యభగవానుడి ప్రవేశంతో సంక్రాంతి వేడుకలు అంబరమంటాయి. మూడు రోజుల పండుగైన సంక్రాంతి తొలి రోజు భోగి ఆనందాలకు నాంది పలికింది. మంచు ముసురుకున్నవేళ వేకువజామునే భోగి మంటలు వేసి సంక్రాంతికి ఆహ్వానం పలికి నవక్రాంతి వెలుగులకు బాటలు వేశారు. గంగిరెద్దుల సందడి, ముంగిళ్లలో రంగవల్లుల సోయగం, వాటి మధ్య గొబ్బెమ్మలు, పశువులకు అలంకరణలు వెరసి భోగి రోజు ప్రజలో సంతోషాలు నింపింది.

వేడుకలను ప్రారంభించిన నటి తారా

బెంగళూరు కోరమంగలలో ఉన్న నందన ప్యాలెస్‌లో సంక్రాతి సంబరాలు మిన్నంటాయి. సీనియర్ నటి తారా కార్యక్రమాన్ని ప్రారంభించారు ప్యాలెస్ గ్రూప్ ఆఫ్ హోటల్ యజమాని డా.ఆర్ రవిచందర్, కుటుంబ సభ్యులు గోమాతకు పూజలు చేసి పంగడ ఆచరణ ప్రారంభించారు. హోటల్‌లో పల్లెటూరి వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో వినియోగదారులకు తమ పల్లెటూర్లలో సంక్రాంతి చేసుకున్న అనుభూతి కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ నటి తారా మాట్లాడుతూ నందన ప్యాలెస్ హోటల్ ఆంధ్రా రుచులకు ప్రసిద్ధి అని తెలిపారు. సంక్రాంతి సంవత్సరం ప్రారంభంలో వచ్చే తొలి పండగ అని, ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. వినియోగదారులకు తమ పల్లెటూళ్లలో సంక్రాంతి ఆచరించుకున్న అనుభూతి ఇవ్వడం నిజంగా అభినందనీయమన్నారు.

భిన్నరుచులను ఆస్వాదించండి

నందనా ప్యాలెస్ హటల్ యజమాఆని డాక్టర్ ఆర్.రవిచందన్ మాట్లాడుతూ తమ హోటల్‌లో అనేక భిన్న రుచుల వంటకాలు తయారు చేశామన్నారు. కస్టమర్లు వచ్చి వంటకాలు రుచి చూసి ఆస్వాదించడంతోపాటు మాతో కలిసి పంగడ ఆరించాలని కోరుతున్నట్లు తెలిపారు. పుట్టగొడుగులు, బోన్‌లెస్ సుక్కా, చేపలపులుసు, నెత్తిలి చేపల వేపుడు ఇలాంటి అనేక వంటకాలు నోరూరిస్తాయన్నారు.



నందన ప్యాలెస్‌లో గోమాతకు పూజలు చేస్తున్న నటి తారా, పొంగల్ తయారీ దృశ్యం

బోనులో చిక్కిన చిరుత


పట్టుబడిన చిరుత

మైసూరు: గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తున్న చిరుతను అటవీ శాఖాధికారులు ఎట్టకేలకు పట్టుకున్నారు. టీ.నరసీపుర తాలూకా సోసలి హోబళి కొణగహళ్లి గ్రామంలో ఓ చిరుత కొన్ని రోజులుగా సంచరిస్తోంది. దీంతో గ్రామస్తులు కంటి మీద కునుకు లేకుండా జీవిస్తున్నారు. గ్రామంలోని రైతు ఎం.నాగేంద్ర వ్యక్తి పొలంలో అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేశారు. ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులోకి చిక్కింది. ఆదివారం అటవీశాఖ అధికారులు వచ్చి చిరుతను బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

నదిలో మహిళ మృతదేహం

మైసూరు: జిల్లాలోని టి.నరసీపుర గంజా నరసింహ స్వామి ఆలయ సమీపంలో కపిలా నదిలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. మహిళ మెడలో నల్లపూసల దండ ఉండగా మృతురాలు తెల్లరంగు చీర ధరించి ఉందని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు టి.నరసీపుర పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

అభిమానుల సహకారం మరువలేనిది


గోపూజ చేస్తున్న ఎస్.ఆర్.రమేష్

బనశంకరి: తన రాజకీయజీవితం, సమాజసేవకు సహకరించిన అభిమానుల రుణం తీర్చుకోలేనిదని బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ శాఖ అధ్యక్షుడు, బీబీఎంపీ మాజీ పాలనా విభాగం నేత ఎస్ఆర్.రమేశ్ తెలిపారు. యడియూరులోని ఆయన నివాసంలో ఎస్.ఆర్.రమేష్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అభిమానులు, కార్యకర్తల మధ్య ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మహిళలకు ఎళ్లు,బెల్ల, విభిన్న ప్రతిభావంతులకు త్రిచక్రవాహనాలు అందజేశారు. ఎస్ఆర్.రమేశ్ మాట్లాడుతూ తన సతీమణి పూర్ణిమరమేశ్‌ను పాలికె సభ్యురాలిగా సేవలు అందించడానికి ఆశీర్వదించారని, వారి రుణం తీర్చుకునేవరకు తన పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. తన జీవితంలో అనేక పోరాటాలు చేశానని, పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. యడియూరుచెరువు సర్వోతోముఖాబివృద్ధికి కృషి చేశానాన్నరు. సంజీవని ఆయుర్వేద ఉద్యానవనం ఏర్పాటు చేసి ప్రజలు ఆరోగ్యానికి దోహదం చేసినట్లు ఆయన తెలిపారు.

నటి లీలావతి స్మారక పనులకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న వినోద్‌రాజ్, చిత్రంలో మంత్రి కె.హెచ్.మునియప్ప తదితరులు

దొడ్డబళ్లాపురం: గత ఏడాది డిసెంబర్ 8న కన్నుమూసిన సీనియర్ నటి లీలావతికి నెలమంగల తాలూకా మాదనాయకనహళ్లిలో ఉన్న వారి ఫాంహౌస్‌లో చేపట్టిన స్మారక నిర్మాణానికి ఆమె కుమారుడు వినోద్‌రాజ్ ఆదివారం భూమి పూజ నెరవేర్చారు. రూ.55 లక్షలతో ఈ నిర్మాణం చేపట్టారు. 120 రోజుల్లో పూర్తి కావచ్చని వినోద్‌రాజ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా సహాయం పొందడంలేదని తెలిపారు. లీలావతి నటించిన మొదటి, చివరి చిత్రం వరకూ ఈ స్మారకంలో గ్యాలరీ ఏర్పాటు చేస్తామని, తల్లి సమాధిని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని వినోద్‌రాజ్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప, స్థానిక గణ్యులు హాజరయ్యారు.

దావణగెరెలో అమానుషం


యువకుడితో గుంజీళ్లు తీయిస్తున్న దృశ్యం

యశవంతపుర: ఓ వ్యక్తి యువకుడి పట్ల ఓ వ్యక్తి అమానుషంగా వ్యవహరించిన ఘటన ఘటన దావణగెరె పట్టణంలో జరిగింది. పట్టణంలోని గీతాంజలి థియేటర్ వద్ద ఓ యువకుడు కూర్చొని ఉండగా అక్కడకు వచ్చిన ఓ వ్యక్తి యువకుడి చేతిలో కర్పూరం పెట్టి అంటించి దర్శన్ పోస్టర్‌కు దిష్టి తీయించాడు. అనంతరం గుంజీళ్లు తీయించాడు. ఈ దృశ్యాన్ని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో వైరల్ అయ్యింది. సదరు యువకుడు గతంలో నటుడు దర్శన్‌పై చెడుగా మాట్లాడి సామాజిక మాధ్యమాల్లో వీడియోను పోస్ట్ చేశాడు. ఆ యువకుడు థియేటర్ వద్దకు రాగా దర్శన్ అభిమాని దొడ్డేశ్ గుర్తించి దాష్టీకానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డేపై కేసు నమోదు

శివాజీనగర: రెచ్చగొట్టే ప్రసంగం చేసిన ఆరోపణపై బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డేపై కుమటా పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు. శనివారం కుమటాలో జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోధ్యలో బాబ్రి మసీదును కూల్చినట్లుగా భట్కాళ్‌లో మసీదు కూల్చబడనుందని, శ్రీరంగపట్టణంలోని పెద్ద మసీదులో మారుతి దేవాలయం ఉండేదని, వీటిని ముందుగానే కూల్చాలని అన్నారు. ఆయన ప్రసంగం ధార్మిక భావాలకు భంగం కలిగించేలా ఉన్నాయని భావించి సెక్షన్ 153ఏ, 505 కింద సుమోటో కేసు నమోదైందని జిల్లా ఎస్పీ తెలిపారు.

ద్వి భాషా సంస్కృతితో అలరారుతున్న పావగడ


వేడుకలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి వెంకటరమణప్ప

పావగడ: కన్నడ, తెలుగు ద్విభాషా సంస్కృతితో పావగడ అలరారుతోందని కన్నడ అధ్యాపకుడు డాక్టర్ హెచ్ కే నరసింహమూర్తి అన్నారు. తాలూకా లోని రంగసముద్రం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన వైఎన్ హొసకోట హోబళి రెండవ కన్నడ సాహిత్య సమ్మేళన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కన్నడ భాష జతలో తెలుగు భాష సమ్మిళితమైందని, భాష ఒక్కటే కాకుండా భావనలు బాంధవ్యాలు ఒక్కటై ఇక్కడి ప్రజలు కలసి మెలసి జీవిస్తున్నారన్నారు. కన్నడ భాషాభివృద్ధికి కన్నడ పర సంఘాలు కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని కన్నడ మాధ్యంలో చదివించాలన్నారు. జిల్లా కసాప అధ్యక్షుడు సిద్ధల లింగప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కన్నడనే సార్వభౌమ భాష అని అన్నారు. అనంతరం సమ్మేళనం అధ్యక్షుడు అంతరగంగ శంకరప్పను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, చరిత్ర పరిశోధకుడు చెలువ రాజన్, తాలూకా కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, హోబళి అధ్యక్షుడు హోమా నాగరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంతో భారీ నష్టం


మంటల్లో తగలబడుతున్న గుడిసె


నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- మేకలు, పశువులు, వ్యవసాయ సామగ్రి దగ్ధం


కాలిపోయిన గేదెలు

తుమకూరు: పశువులు, మూగజీవాలు ఉన్న గుడిసెకు ఆకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో అనేక జీవాలు సజీవ దహనమై ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ హృదయ విదారక ఘటన తుమకూరు తాలూకా హెబ్బూరు హోబళి కారనహళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు చిక్కణ్ణ అనే వ్యక్తికి చెందిన గుడిసెలో ఈ ఆదివారం తెల్లవారుజామున అగ్నికీలలు లేచాయి. ఈ ప్రమాదంలో 25 మేకలతో పాటు 9 గేదెల ప్రాణాలు బలి కావడంతో పాటు, ఒక ట్రాక్టర్, బైక్, 10 క్వింటాళ్ల వక్క పంట, 600 కొబ్బరికాయలు, మోటార్ పంప్ కేబుల్, రాగి కళ్లయంత్రం తదితరాలు కాలిపోవడంతో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది.

ఎలా జరిగిందో తెలియదు

ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. నాలుగు మూగజీవాలను రక్షించారు. వాటికి కూడా కాలిన గాయాలయ్యాయి. హెబ్బూరు పోలీసులు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. మంటలు ఎలా వచ్చాయనేది తెలియడం లేదు. ఎవరిపై కూడా ఎలాంటి అనుమానం లేదని, ఎలా జరిగిందో తనకు అర్థం కావడం లేదని, సుమారు రూ. 30 లక్షల విలువైన పశువులు, వస్తువులు మంటలకు ఆహుతి అయ్యాయని చిక్కణ్ణ విలపించాడు.

ఉత్సాహంగా పోలీస్ సంక్రాంతి


సాంస్కృతిక కార్యక్రమాల్లో పోలీసులు

హోసూరు: హోసూరులో పోలీసుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. డీఎస్పీ బాబుప్రశాంత్ ఆధ్వర్యంలో సంబరాలు జరగ్గా, పోలీసులు, కుటుంబాల మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా ఎస్పీ తంగదురై ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలాల్ డీఎస్పీ శివలింగం, ఇన్స్‌పెక్టర్లు శివకుమార్, ప్రకాష్, శరవణన్, పద్మావతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఐ దేవి బాధ్యతల స్వీకారం

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రజిని బదిలీ కావడంతో ఆమె స్థానంలో దేవిని నియమించారు. శనివారం సాయంత్రం దేవి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలను స్వీకరించారు. సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

హోసూరు వార్తలు..

పండుగకు ఊరెళ్తూ ఐటీ ఉద్యోగి మృతి

హోసూరు: పండుగకు బైక్‌పై వెళ్తూ తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడో ఐటీ ఉద్యోగి. వివరాల మేరకు సేలం జిల్లా అళగాపురం గ్రామానికి చెందిన అరవింద్(30), బెంగళూరులోని ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లాలని బైక్‌పై బయల్దేరాడు. కావేరి పట్టణం పరిధిలో క్రిష్ణగిరి – ధర్మపురి హైవేలో బోధాపురం వద్ద అతడు అదుపుతప్పి బోల్తాపడడంతో ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలేర్పడిన అరవింద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కావేరిపట్టణం పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

మహిళను బలిగొన్న కరెంటు తీగ

క్రిష్ణగిరి: విద్యుత్ వైరును తాకిన మహిళ షాక్ కొట్టి మృతి చెందిన ఘటన క్రిష్ణగిరి తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకొంది. వివరాల మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని రామర్‌కొటాయ్ గ్రామానికి చెందిన ఆండియప్ప భార్య పట్టు (35) శనివారం సాయంత్రం అదే ప్రాంతంలోని పొలానికి వెళ్లింది. దారిలో తెగిపోయిన విద్యుత్ తీగను తొలగించేందుకు యత్నించి పొరపాటున తాకడంతో విద్యుదాఘాతానికి గురై పడిపోయింది. గమనించిన స్థానికులు క్రిష్ణగిరి తాలూకా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు చేరుకొనేలోపు మహిళ చనిపోయింది.

హుషారుగా పొంగల్


పొంగల్ వేడుకలను జరుపుకొంటున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరిలోని బీడీవో కార్యాలయంలో యూనియన్ చైర్పర్సన్ లావణ్యమధు అధ్యక్షతన ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలను జరిపారు. ముగ్గులు వేసి కొత్త కుండలో పొంగల్ వండి ఆరగించారు. ఉద్యోగులకు, కార్మికులకు కానుకలు అందజేశారు. బీడీవో బాబిప్రసన్న, ఉప బీడీవో వెంకటేష్, జేమ్స్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

బనశంకరి: వివాహిత అదృశ్యమైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. శాలిని, స్వామి దంపతులు తావరెకెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని కామత్‌లేఔట్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు పాలు తీసుకురావడానికి శాలిని దుకాణం వద్దకు వెళ్లింది. 8 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన భర్త గాలింపుచర్యలు చేపట్టాడు. సమీపంలోని సీసీటీవీలో శాలిని బీఎంటీసీ బస్ ఎక్కి వెళ్లినట్లు నిక్షిప్తమైంది. కేఆర్.మార్కెట్, సాటిలైట్ బస్టాండులో గాలించినా ఆచూకీ లభించలేదు. దంపతులకు ఐదేళ్ల బాలుడు ఉండగా శాలిని ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పొలాల్లో ఏనుగుల స్వైర విహారం


డెంకణీకోట ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్)

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తావరకెరె అటవీ ప్రాంతంలో 30కి పైగా ఏనుగులు సంచరిస్తూ రైతుల పంటపొలాలపై దాడులు చేస్తూ ధ్వంసం చేస్తున్నాయి. రెండు నెలల క్రితం కర్ణాటక రాష్ట్రం బన్నేరుగట్ట అటవీ ప్రాంతం నుంచి జవుళగిరి అటవీ ప్రాంతం మీదుగా 150కి పైగా ఏనుగులు వలస వచ్చాయి. ఈ ఏనుగులు గుంపులుగా విడిపోయి జవుళగిరి, దేవరబెట్ట, నగనూరు, అయ్యూరు, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. ఉదయంపూట అటవీ ప్రాంతాల్లో ఉంటూ సాయంత్రం వేళల్లో గ్రామాల వైపు ఎగబడి రైతుల పొలాల మీద పడి పంటలను ఆరగించి మిగతాది ధ్వంసం చేస్తున్నాయి. శనివారం రాత్రి 30 ఏనుగుల మంద డెంకణీకోట సమీపంలోని కండగానపల్లి, దిన్నూరు, పాపిరెడ్డిపాళ్యం, వరదరెడ్డిపాళ్యం, తొట్టి, ఉబ్బరాయనపల్లి, కెంబత్తపల్లి, బళ్లపల్లి ప్రాంతాల్లో పంటపొలాలను నాశనం చేశాయి. అటవీ సిబ్బంది చేరుకొని ఏనుగుల సంచారంపై నిఘా పెట్టారు. ఏనుగుల సంచారం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్దకు కాపలా వెళ్లరాదని తెలిపారు.

ఆటలాడుతూ మృత్యు ఒడికి

- సంప్‌లో శవమై తేలిన బాలుడు

యశవంతపుర: ఓ బాలుడు ఆడుకుంటూ వెళ్లి సంప్‌లో పడి మృత్యువాత పడ్డాడు. ఈ విషాద ఘటన బెంగళూరులో జరిగింది. యాదగిరికి చెందిన షంషుద్దీన్ నగరానికి వలస వచ్చాడు. గంగమ్మనగుడి అబ్బిగెరెలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. షెడ్ సమీపంలో ఓ భవనం నిర్మాణంలో ఉంది. షంషుద్దీన్ కుమారుడు షబ్బీర్(7) శుక్రవారం ఆడుకుంటూ నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ సంప్‌లో పడిపోయాడు. తల్లిదండ్రులు సకాలంలో బాలుడి గురించి తెలుసుకోలేకపోవడంతో చిన్నారి ఊపిరాడక మృతి చెందాడు. విగతజీవిగా నీటిపై తెలియాడుతున్న కుమారున్ని చూసి తల్లిదండ్రులు విలపించారు. గంగమ్మనగుడి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పోరాటమే శరణ్యం

మైసూరు: 220 కేవీ విద్యుత్ లైన్లకు స్వాధీనం చేసుకున్న భూములకు సరైన పరిహారం లభించాలంటే పోరాటమే శరణ్యమని రైతు సంఘాల ఒక్కూట అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ అన్నారు. భూములు కోల్పోయిన మైసూరు తాలూకా, చుట్టుపక్కల గ్రామాల రైతులతో ఆదివారం ఆయన కొడనహళ్లి గ్రామంలో సమావేశమై మాట్లాడారు. రైతులు సంఘటితమై పోరాడకుంటే న్యాయం దొరకదన్నారు. సరైన పరిహారం అందక చిన్నసన్నకారు రైతులు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ క్రమంలో న్యాయమైన పరిహారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అంత్య సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవాలకు అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు బదరీనాథ్

పావగడ: తాలూకాలోని నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి జాతరను పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు బదరీనాథ్ అంకురార్పణ పూజలు వైభవంగా నిర్వహించారు.ఆలయం ఎదుట నాగుల కట్టలోని నాగ స్వాములకు భక్తులు పూజలు నిర్వహించారు. జాతర తొలి రోజే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి తమ ఇష్టదైవమైన సుబ్రహ్మణ్య స్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్తలు రొద్దం సుబ్బయ్య శెట్టి వంశీకులు రొద్దం సురేంద్ర బాబు, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు. దైవ దర్శనానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

హైటెక్ వేశ్యావాటిక కేసు దర్యాప్తు వేగవంతం

బనశంకరి: నగరంలో వెలుగు చూసి హైటెక్ వేశ్యావాటిక దందాపై మారతహళ్లి ఉప విభాగ ఏసీపీ ప్రియదర్శిని నేతృత్వంలోని బృందం దర్యాప్తు ముమ్మురం చేసింది. విదేశీ మహిళలతో పాటు స్థానికులు సైతం వేశ్యావాటిక దందాలో బాగస్వాములైన నేపథ్యంలో వారిని ఏ మధ్యవర్తులనుంచి రప్పిస్తున్నారు అనేదానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. స్పాలో ఉన్న 23 మంది ఉద్యోగులను సాక్షులుగా పరిగణించి కొద్దిమేర సమాచారం రాబట్టారు. ప్రధాన ఆరోపి అనిల్ రెడ్డిని విచారించగా మధ్యవర్తుల గురించి ఎలాంటి సమాచారం బయటికిరాలేదని తెలిసింది. దీంతో పోలీసులకు పట్టుబడిన 44 మంది మహిళలను విచారణ చేపడుతున్నారు. స్పాలో పనిచేసే ఉద్యోగుల మొబైల్ ఫోన్ కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు.

క్లుప్తంగా...

ఆ ఇద్దరిది అపవిత్ర కలయిక

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



గుడివాడ టౌన్: టీడీపీ నేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ కలయిక అత్యంత అపవిత్రమైనదని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా, గుడివాడలోని లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఒంగోలుజాతి ఎడ్ల బండ లాగుడు పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. భోగి సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జీవోల ప్రతులను దగ్ధం చెయ్యడంపై ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ స్పందించారు. పండుగలను సైతం రాజకీయం చేయడం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కే దక్కిందన్నారు. 2014లో ఒక విధంగా వారు కలిశారని, 2019లో కలిసి ఉండి మరో విధంగా విడిపోయారని, 2024లో మళ్లీ కలిసి తేడా రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 2014 నుంచి 19 వరకు చంద్రబాబు పాలన, 2019 నుంచి ఇప్పటి వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూశారని, ప్రజలు ఎవరిని తరిమేస్తారో 89 రోజుల్లోనే తేలుతుందన్నారు. ఈ సారి ఆ రెండు పార్టీలను ప్రజలు భోగి మంటల్లో వేస్తారని రానున్న 30 సంవత్సరాలు జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలి

డీఎస్‌ఎంఎం జాతీయ నేత శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలని దళిత శోషన్ ముక్తి మంచ్(డీఎస్‌ఎంఎం) జాతీయ నేత, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీని ఆవిష్కరించారు. విజయవాడలోని పూలే అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సిద్ధం కావడం సంతోషంగా ఉందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రభుత్వమే నాయకత్వం వహించాలన్నారు. అప్పుడే మన దేశంలో కుల నిర్మూలన జరిగి అంబేడ్కర్ కలలు నెరవేరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి మాట్లాడారు.

తెలంగాణ

యాదాద్రిపై సంక్రాంతి ముద్ర



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: సంక్రాంతి సెలవులతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రాక పెరిగింది. ఆదివారం భోగి పండుగ కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధికంగా యాదాద్రీశుడిని దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్, బస్టాండ్లు భక్తులతో నిండుగా కనిపించాయి. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.45,52,569 వచ్చినట్లు అధికారులు తెలిపారు. శ్రీస్వామి వారిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.

ఆటో, కారు ఢీ.. నలుగురి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మహబూబాబాద్ రూరల్: కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుమారుడి పుట్టువెంట్రుకలు తీసేందుకు గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ పరిధి జమాండ్లపల్లి అటవీశాఖ అర్బన్ పార్క్ సమీపాన ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మహబూబాబాద్ అదనపు సీఐ బి.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిన్న ఎల్లాపురం గ్రామ శివారు హాముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను (35), అతడి కుమారుడు రిత్విక్(6), కుమార్తె రిత్విక(5), శ్రీను తల్లి పాపా(60), బంధువులు శాంతి, సర్దార్ కలిసి శనివారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ సమీపంలోని గుండ్ల సింగారం వద్దనున్న బుడియాబాపు గుడికి వెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించిన తర్వాత సాయంత్రం పొద్దుపోయాక ఆటోలో తిరిగి హాముతండాకు బయలుదేరారు. జమాండ్లపల్లి అటవీశాఖ అర్బన్‌పార్కు దాటుతున్న ఆటో, ఎదురుగా గూడూరు మండలం గుంజేడు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో పాపా, శ్రీను, రిత్విక్, రిత్విక మృతి చెందారు. సర్దార్, శాంతికి తీవ్రగాయాలయ్యాయి. కారులో మల్యాల పీహెచ్‌సీ వైద్యుడు తిరుపతి, ప్రవీణ్, భరత్, ప్రతాప్, వసంత్ ఉన్నారు. టౌన్ ఎస్సైలు రామారావు, శివ, రూరల్ ఎస్సై కుమారస్వామి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

తృప్తిగా.. కడుపు నిండుగా.. మధ్యాహ్న భోజనం

నాడు



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సీతంపాలెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భోజనం కోసం ఎండలో క్యూలైన్లో వేచిఉన్న విద్యార్థులు

- నీళ్ల సాంబారు, ముద్ద అన్నం
- పప్పుకు, రసానికి తేడానే ఉండదు
- పేరుకే ఏటా రూ.450 కోట్ల బడ్జెట్
- సరుకులకు డబ్బు చెల్లింపులో తీవ్ర జాప్యం
- సరుకులు ఎవరెవరో ఇళ్లకు ఎత్తుకుపోయే పరిస్థితి
- వంట వాళ్లనూ పట్టించుకోని వైనం
- ఎవరికీ పట్టని భోజనం నాణ్యత
- వంటశాల లేక స్కూలంతా పొగ
- సగటున 50 శాతం మంది విద్యార్థులకే భోజనం

నేడు



విద్యార్థులకు తరగతి గది పక్కన వరండాల్లో భోజనం పెడుతున్న దృశ్యం

- రోజుకో మెనూ చొప్పున మొత్తంగా 16 రకాల ఐటమ్స్
- గోరుముద్ద పేరుతో రుచికరమైన భోజనం
- సగటున 90% మంది విద్యార్థులకు భోజనం
- భోజనం పూర్తయ్యాక ఆహారంపై ఆరా.. బాగుంటే 'గుడ్' లేకుంటే 'నాట్ గుడ్' అని నిర్భయంగా చెప్పే స్వేచ్ఛ
- నాణ్యత కోసం కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి తినే ఏర్పాటు
- ఎంత మంది భోజనం చేస్తున్నారో ఆన్‌లైన్‌లో పక్కాగా రికార్డు
- 43 లక్షల మంది ప్రతి రోజూ సంతృప్తికరంగా భోజనం
- సోమవారం హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా వెజిటబుల్ పులావు, గుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
- బుధవారం వెజిటబుల్ అన్నం, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సాంబార్ బాత్/ నిమ్మకాయ పులిహోర, టొమాటో పచ్చడి, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం అన్నం, ఆకు కూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం ఆకు కూరతో చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్
- 2019–20లో రూ.979.48 కోట్లు, 2020–21లో రూ.1,187.49 కోట్లు, 2021–22లో రూ.1,840.05 కోట్లు, 2022–23లో రూ.1,548.58 కోట్లు, 2023–24లో రూ.1,689 కోట్లు బడ్జెట్
- ప్రత్యేకంగా వంట గది, ఎప్పటికప్పుడు బిల్లులు

రాజ్యసభలో టీడీపీ అడ్రస్ గల్లంతే..

ఏప్రిల్ 2తో పూర్తికానున్న టీడీపీ సభ్యుడు 'కనకమేడల' పదవీకాలం

- వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి, బీజేపీ సభ్యుడు సీఎం రమేష్‌ల పదవీకాలం ముగిసేదీ అప్పుడే
- రాష్ట్ర కోటాలో ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చిలో ఎన్నికలు
- అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే
- దీంతో రాష్ట్ర కోటాలోని 11 స్థానాలు వైఎస్సార్‌సీపీ పరం
- చివరికి రాజ్యసభలో ఉనికే లేకుండాపోనున్న టీడీపీ
- 41 ఏళ్లలో టీడీపీకి రాజ్యసభలో సభ్యత్వం లేకుండాపోవడం ఇదే తొలిసారి



సాక్షి, అమరావతి: రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ వచ్చే మార్చి తర్వాత గల్లంతు కానుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ అంటే గత 41 ఏళ్లలో రాజ్యసభలో ఆ పార్టీకి సభ్యులు లేకపోవడం ఇదే తొలిసారి అవుతుంది. నిజానికి.. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు ఆ పార్టీని చేజిక్కించుకున్న తర్వాత టీడీపీ క్రమంగా ప్రాభవం కోల్పోతూ వస్తోంది. ఈ నేపథ్యంలో.. త్వరలో ఖాళీకానున్న మూడు రాజ్యసభ స్థానాలూ అసెంబ్లీలో సంఖ్యా బలం ద్వారా వైఎస్సార్‌సీపీనే కైవసం చేసుకుంటుంది. దీంతో రాజ్యసభలో టీడీపీ తొలిసారిగా కనుమరుగు కావడం ఖాయం. రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతమున్న సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని ఆయా రాష్ట్రాల శాసనసభ్యులు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. ఇక రాజ్యసభలో 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 శాసనసభ స్థానాల్లో ఘనవిజయం సాధించగా.. టీడీపీ 23 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని మచ్చిక చేసుకుని కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేశ్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు పావులు కదిపారు. ఇక రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. నాడు అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఎనిమిది రాజ్యసభ స్థానాలు ఆ పార్టీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని సీఎం వైఎస్ జగన్ దేశానికి చాటిచెప్పారు.

ఆ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే..

ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 2 నాటికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వైఎస్సార్‌సీపీ), సీఎం రమేష్ (బీజేపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ)ల పదవీకాలం పూర్తికానుంది. ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేయనుంది. రాజ్యసభకు ఎన్నిక కావాలంటే 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ప్రస్తుతం శాసనసభలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే.. ఈ మూడు స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం ఖాయం. దీంతో రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ బలం 11కు చేరనుంది. అంటే రాష్ట్ర కోటాలో సీట్లన్నీ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే చేరుతాయి. టీడీపీ ఉనికే లేకుండాపోతుంది.

బాబు, పవన్ సంకల్ప ఫలితం.. అరాచకం

1,204వ రోజు రిలే దీక్షలో ధ్వజమెత్తిన బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అమరావతి ప్రాంతంలోని మందడంలో భోగి సందర్భంగా ఏర్పాటయిన టీడీపీ నేత చంద్రబాబు – జనసేన నేత పవన్‌కళ్యాణ్ 'సంకల్ప కలయిక' ఆయా పార్టీల్లోని అరాచకశక్తుల ఆగడాలకు 'ఆజ్యం' పోయనుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,204వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారం పలువురు మాట్లాడారు. అమరావతిని అవినీతికి అడ్డాగా చేసుకుని రూ.లక్షల కోట్లు దోపిడీ చేసి జైలుపాలైన చంద్రబాబు లాంటి అవినీతిపరుడిని కులవాదులు, ప్యాకేజీస్టార్ పావలా కళ్యాణ్ ఎల్లో మీడియా కాపాడేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. రాజధాని రైతుల ఉసురు తగిలి చంద్రబాబు ఈ ప్రాంతంలో మళ్లీ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని చెప్పారు. బాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన పవన్‌కళ్యాణ్ ప్యాకేజీ తీసుకుని బాబు కింద పాలేరులా తయారయ్యాడని దుయ్యబట్టారు. చంద్రబాబు అమరావతితో పాటు కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని చెప్పడం, విశాఖను వాణిజ్య రాజధానిగా ఏర్పాటు చేస్తానని చెప్పడంలో అంతర్యం మూడు రాజధానులను ఒప్పుకోవడం కాదా అని ప్రశ్నించారు. పురందేశ్వరి బీజేపీ అధ్యక్షురాలా లేక టీడీపీ అధికార ప్రతినిధో తెలియడం లేదన్నారు. మాదిగాని గురునాథం, పులిదాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

భోగి మంటల్లో పచ్చ రాతలు దహించిపోవాలి



ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కనిగిరి రూరల్: 'పచ్చ పత్రికల విషపు రాతలు, కుట్రలు భోగి మంటల్లో దహనమై పోవాలి...' అని కోరుతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని వైఎస్సార్ భవన్ వద్ద ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున భోగి మంటలు వేశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ప్రతులను దహనం చేశారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ పచ్చ పత్రికలు దురుద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తున్నాయని, అసత్య వార్తలు ప్రచురిస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆ రెండు పత్రికల రాతలు మారాలని, వారికి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలన్నారు.

నా ప్రాణానికి ఏదైనా జరిగితే లోకేశ్‌దే బాధ్యత

రాయపాటి రంగారావు



నగరంపాలెం: తనను కిరాయి మూకలతో హత మార్చేందుకు టీడీపీ రూ.50 లక్షల చందాలు వసూలు చేసిందని, దీనిపై గుంటూరు ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేశానని టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు రాయపాటి రంగారావు తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలోని నివాసంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 13న గుంటూరు రీజినల్ సీఐడీ కార్యాలయానికి చంద్రబాబు వచ్చిన క్రమంలో ఈ చందాలు వసూలు చేశారన్నారు. వైజాగ్ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి , చంద్రబాబుపై విమర్శలు మానుకోవాలని, లేకపోతే అంతు చూస్తామని బెదిరించారని చెప్పారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే వాడిని కాదన్నారు. తన ప్రాణానికి ఏదైనా జరిగితే అందుకు నారా లోకేశ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబుకి కొత్తకాదని, అందులో భాగంగానే రాయపాటి శైలజతో మాట్లాడిస్తున్నారని ధ్వజమెత్తారు. లోకేశ్ ఎక్కడా గెలవడని జ్యోస్యం చెప్పారు. యువగళానికి ఒక్క రోజు కూడా తాను వెళ్ళలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి ఏ బాధ్యత అప్పగించినా చేస్తానని పేర్కొన్నారు.

ఇసుక బకాసురుడు బాబు

నాడు తవ్వుకో.. తినుకో! | నేడు పారదర్శక విధానాలతో ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం

సాక్షి, అమరావతి: ఇసుక నుంచి తైలం పిండటంలో నిజమెంత ఉందో తెలియదుగానీ ఇసుక నుంచి వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టవచ్చని చంద్రబాబు నిరూపించారు. అది కూడా ఇసుక ఉచితం అని బురిడీ కొట్టించి దోపిడీకి పాల్పడటం ఆయనకే సాధ్యమైంది. తాను అక్రమంగా నివాసం ఉంటున్న కరకట్ట ఇంటి వెనుకే వేల కొద్దీ లారీల్లో ఇసుక తరలిపోతున్నా గుడ్లప్పగించి చూశారు. టీడీపీ హయాంలో 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో పచ్చ ముఠా సాగించిన దోపిడీని సీఐడీ పూర్తి ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. కేంద్ర చట్టాలు, గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలను ఉల్లంఘించి కేబినెట్ ఆమోదం కూడా లేకుండా 'ప్రత్యేక మెమో' ద్వారా చంద్రబాబు చేసిన లూటీ ఆధారాలతో బహిర్గతమైంది. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా చంద్రబాబు ముఠా ఏకంగా రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడిందన్నది నిగ్గు తేలింది.

అంతులేని ధన దాహం

2014లో టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు కన్ను ఇసుక రీచ్‌లపై పడింది. అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడినా ఆయన సంతృప్తి చెందలేదు. దీంతో ఇసుక విధానాన్ని పునఃసమీక్షించాలని కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. కొత్త ఇసుక విధానాన్ని నిర్ణయిస్తూ 2016 జనవరి 15న రెండు జీవోలు (జీవో నంబర్లు 19, 20) జారీ చేశారు. అయినప్పటికీ చంద్రబాబు ఇసుక దాహం తీరలేదు. బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడేందుకు మరో విధానాన్ని తీసుకురావాలని భావించారు. 'ఇసుకను ప్రభుత్వం అమ్మదు.. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు.. ఎవరికి వారు ఇసుక రీచ్‌లకు వెళ్లి ఇసుక తవ్వుకోవచ్చు.. అమ్ముకోవచ్చు.. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు, ఆంక్షలు విధించదు' అని చెబుతూ 2016 మార్చి 4న ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి దొరికిన చోట దొరికినట్లు దోచుకున్నారు. ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తన చేతిలోకి, మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకొచ్చారు.

మూడు మార్గాలు బేఖాతర్..

భారీ ఇసుక దోపిడీ కోసం చంద్రబాబు అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. ఒక 'మెమో'తో ఇసుక దోపిడీకి పన్నాగం పన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడే ఇసుక తవ్వకాల కోసం విధానాలు రూపొందించాలి. అందుకు నిర్దేశించిన మూడు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒకటి ఎంపిక చేసుకోవాలి. ఇసుక తవ్వకాల కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రూపొందించిన బిజినెస్ రూల్స్ (మార్గదర్శకాలు) అనుసరించాలి. అంతకంటే మెరుగైన విధానం రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే ఆమేరకు ఆర్థిక శాఖ ఆమోదం పొందాలి. ఓ విధానాన్ని రూపొందించి అందుకు కేబినెట్ ఆమోదం పొందాలి. చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన 'ఉచిత ఇసుక విధానం' కోసం ఈ మూడింటిలో ఏ ఒక్కటీ పాటించలేదు.

మెమో 3066తో కనికట్టు

'ఉచిత ఇసుక విధానం' విధానాన్ని తెస్తూ టీడీపీ ప్రభుత్వం 2016 మార్చి 4న ప్రత్యేకంగా 'మెమో 3066' జారీ చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లన్నీ చంద్రబాబు, ఆయన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హస్తగతం చేసుకున్నారు. సహజ వనరులు, రాష్ట్ర ఖజానాకు కీలకమైన ఆర్థిక వనరుకు సంబంధించి కేబినెట్ ఆమోదం లేకుండానే అడ్డగోలుగా కేవలం ఒక మెమోను సాకుగా చూపి రంగంలోకి దిగారు. ఈ మెమో ద్వారా 2016 నుంచి 2019 వరకు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొట్టారు. రేట్లపై, తవ్వకాలపై నియంత్రణ లేదు. జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లలో ఎవరెవరు తవ్వుకోవాలో చంద్రబాబు స్వయంగా తన బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఒక్కసారిగా భారీ యంత్రాలను ఇసుక తవ్వకాల కోసం తెచ్చారు. ఇతరులు ఎవరూ ఆ ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా కట్టడి చేశారు. చంద్రబాబు ముఠా రోజూ వేల లారీల్లో లక్షల టన్నుల ఇసుకను తవ్వేసి అమ్ముకుంది. రాష్ట్రంలో నదుల్లో అందుబాటులో ఉన్న ఇసుక ఎంత..? రోజుకు ఎంత తవ్వుతున్నారు? ఎంతకు అమ్ముతున్నారు? ఎన్ని వేల లారీల ఇసుక రోజూ రాష్ట్రం దాటుతోంది? అనే దానికి అంతూపొంతూ లేకుండా పోయింది.

ఆ ఆదాయం ఏమైంది?

గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాల ద్వారా ఖజానాకు నాలుగు రకాల ఆదాయం రావాలి. సీనరేజీ, కన్సిడరేషన్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మైన్స్ ఫండ్, మెరిట్ ఫీజు చెల్లించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తెచ్చింది. దూరాన్ని బట్టి ఏ రీచ్ నుంచి ఎంత చార్జీ అనే అంశాన్ని నిర్ణయించి పారదర్శకంగా ప్రకటిస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ప్రకారం టీడీపీ హయాంలో 2016 నుంచి 2019 వరకు కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు రావాల్సి ఉంటుందని గనుల శాఖ అంచనా వేసింది. చంద్రబాబు 'ఉచిత ఇసుక' అనే మోసపూరిత విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల గండిపడింది. ఇక రాష్ట్రంలో యథేచ్ఛగా తవ్విన ఇసుక ఎంతనే అంచనాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 2016 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఠా రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఇసుకను తవ్వి అమ్మేసుకుందన్నది విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పక్కా ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అడ్డుకున్న మహిళా అధికారి వనజాక్షిపై దాడి..



ఇసుక దోపిడీ కుట్రకు చంద్రబాబు సూత్రధారి కాగా అప్పటి గనుల శాఖ మంత్రి పీతల సుజాత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు మరికొందరు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు అంతటా యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించినందుకు తహసీల్దార్ వనజాక్షిని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుత్తు పట్టుకుని మరీ దాడికి పాల్పడ్డారు. తహసీల్దార్‌పై దాడికి పాల్పడిన చింతమనేని ప్రభాకర్‌ను నాటి సీఎం చంద్రబాబు సమర్థించడం విస్మయ పరిచింది. తమ ఇసుక దోపిడీకి అడ్డు వస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని సందేశం ఇచ్చేందుకే చంద్రబాబు అలా వ్యవహరించారు.

నిందితులు వీరే...




ఏ1: పీతల సుజాత (టీడీపీ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి)



ఏ2: నారా చంద్రబాబు (టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)



ఏ3: చింతమనేని ప్రభాకర్ (టీడీపీ మాజీ ఎమ్మెల్యే)



ఏ4: దేవినేని ఉమా మహేశ్వరరావు (టీడీపీ ప్రభుత్వంలో జల వనరుల శాఖ మంత్రి)

ప్రధాన సెక్షన్లు ఇవీ...

చంద్రబాబు, ఇతర నిందితులపై నమోదు చేసిన సెక్షన్లు

ఐపీసీ సెక్షన్లు 120 బి, 409 రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 (1) (డి) రెడ్‌విత్ 13 (2)

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
సోమవారం ॥ 15-1-2024

సన్నిధి

సంక్రాంతి వైభవాన్ని కనుమా!



భారతీయులు అందులోనూ దాక్షిణాత్యులు, ముఖ్యంగా తెలుగువారు సంక్రాంతిని ఎంతో వైభవోపేతంగా చేసుకుంటారు. ఆడపడుచులు, అల్లుళ్లతో సహా సంక్రాంతికి మాత్రం తమ స్వగ్రామాలకి చేరుకుంటారు అందరు. సంక్రాంతి వైభవం అంతా పల్లెలలో చూడాలి.

సంక్రాంతి పండుగ సమయానికి పంటలు ఇంటికి వచ్చి రైతులు, వ్యవసాయ కూలీలు గ్రామంలో ఉన్న అందరు కూడా పచ్చగా ఉంటారు. ప్రకృతి కూడా పచ్చగా కంటికి ఇంపుగా ఆహ్లాదకరంగా ఉంటుంది. పొలం పనులు పూర్తి అయి కాస్త విశ్రాంతి తీసుకునే వీలుండటంతో సందడి, సంబరాలు. తమకి ఇంతటి భద్రత కలగటానికి మూలమైన భూమిని, రైతులను, కూలీలను, పాలేర్లను, పశువులను, పక్షులను అన్నింటికి కృతజ్ఞతను తెలియచేయటం, తమ సంపదను సాటివారితో బంధుమిత్రులతో పంచుకోవటం ఈ వేడుకల్లో కనపడుతుంది.

భారతీయులు చాంద్రమానంతో పాటు కొన్ని సందర్భాలలో సూర్యమానాన్ని కూడా అనుసరిస్తారు. అటువంటి వాటిల్లో ప్రధానమైనది మకరసంక్రమణం. మకరసంక్రమణంతో సూర్యుడి గమనం దిశ మారుతుంది. అప్పటి వరకు దక్షిణదిశగా నడచిన నడక ఉత్తర దిక్కుగా మళ్ళుతుంది. అందుకే ఆ రోజు నుండి ఆరునెలలు ఉత్తరాయణం అంటారు. అప్పటికి ఆరునెలలనుండి దక్షిణాయనం. ఈ పుణ్య సమయంలో చేయవలసిన విధులు కూడా ఉన్నాయి. వాటన్నింటిని సంక్రాంతి సంబరాల్లో మేళవించటం జరిగింది.

■ విధులు

అంతరిక్షంలో జరిగే ఖగోళవిశేషాల ననుసరించి ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా మనుషులు చేయవలసిన పనులను పండుగ విధులుగా చెప్పటం మన ఋషుల ఘనత. అవి మనిషి వ్యక్తిగత, కుటుంబపరమైన, సామాజిక క్షేమాలని కలిగించేవిగాను ఖగోళ, ఆయుర్వేద, ఆర్థిక మొదలైన శాస్త్రవిజ్ఞాన్ని అందించేవిగా ఉంటాయి. ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయికి ఎదగటానికి సహాయం చేసేవిగా ఉంటాయి. మన పండుగలు బహుళార్థసాధక ప్రణాళికలు. అన్నింటిని సమీకరించి ఎప్పుడేం చెయ్యాలో చక్కగా చెప్పారు.

■ పెద్దపండగ

సంక్రాతిని పెద్దపండగ అంటారు. చాలా పెద్ద ఎత్తున చేసుకోవటంతో పాటు ఎక్కువ రోజులు చేసుకుంటారు. సంక్రమణం జరిగే రోజు పండుగ, ముందురోజు భోగి, మూడవ రోజు కనుము. నాలుగవ రోజు ముక్కనుము. నిజానికి పండుగ వాతావరణం నెలరోజుల ముందు నుండే నెలకొంటుంది.

■ నెల పట్టటం

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించినప్పటి నుండి ధనుర్మాసం అంటారు. అది డిసెంబరు 15వ తేదీ కాని, 16 వ తేదీ కాని అవుతుంది. అప్పటి నుండి మకర సంక్రమణం వరకు అంటే జనవరి 14వ తేదీ వరకు కాని, 15 వ తేదీ వరకు కాని ఉండే ధనుర్మాసం అంతా ప్రత్యేకం



గానే కనపడుతుంది. దీనిని 'నెలపట్టటం' అని అంటారు. అంటే ఈ నెల అంతా ఒక ప్రత్యేక మైన పద్ధతిని పాటిస్తామని చెప్పటం. ఇళ్ల ముందు ఆవుపేడ కళ్ళాపిలో అందంగా తీర్చి దిద్దిన రంగవల్లికలు, ఆకాశంలో నుండి క్రిందికి దిగి వచ్చినట్టు కనపడే చుక్కల ముగ్గుల మధ్యలో కంటికింపుగా దర్శనమిచ్చే గొబ్బెమ్మలు, గొబ్బెమ్మల పైన అలంకరించ బడి పలకరించే బంతి, చేమంతి, గుమ్మడిపూలు, వాటిని తొక్క కుండా 'హరిలో రంగ హరి' అంటు అందరిని తన మధురగానంతో మేలుకొలుపుతున్న హరిదాసులు, వారు వెళ్ళగానే 'అయ్యగారికీ దండం పెట్టు, అమ్మగారికీ దండం పెట్టు' అంటు గంగిరెద్దుల నాడించే వారు, జంగంవారు, బుడబుక్కలవారు ...... తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించే ఎంతోమంది జానపద కళాకారులు – అదొక కలకలం, అదొక కళావిలాసం.



ఈ నెల అంతా విశిష్టాద్వైత సంప్రదాయాన్ననుసరించే వారు తిరుప్పావై లేక శ్రీవ్రతం లేక స్నానవ్రతం అనే దాన్ని ఆచరిస్తారు.ద్వాపరయుగం చివరలో గోపికలు ఆచరించిన ఈ వ్రతాన్ని గోదాదేవి ఆచరించి శ్రీరంగనాథుని వివాహం చేసుకుని ఆయనలో సశరీరంగా లీనమయింది. వైష్ణవదేవాలయాల్లో తెల్లవారుజామునే కృష్ణుని అర్చించి బాలభోగంగా నివేదించిన ప్రసాదాన్ని తెల్లవారక ముందే పంచి పెడతారు. ప్రకృతిలో భాగమైన సర్వ జీవులు స్త్రీలు. వారు పరమపురుషుని చేరుకోవటం కోసం చేసే సాధన మధురభక్తి మార్గం. దానికి ప్రతీక అయిన గోదాదేవి చేసిన వ్రతాన్ని ఈ నెలరోజులు సాధకులు, భక్తులు అందరు ఆచరిస్తారు. ఆండాళు తల్లి ఆ రోజుల్లో గోపికలుగా భావించుకున్న తన చెలులను వ్రతం చెయ్యటానికి స్నానం చేద్దాం రమ్మని మేలుకొలుపుతుంది. ఇప్పుడు ఆపని హరిదాసులు చేస్తున్నారు.

■ సంక్రాంతి

అసలు ప్రధానమైనది సంక్రాంతి, అంటే సంక్రమణం జరిగే రోజు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే రోజు. ఈ పుణ్య కాలంలో దానాలు, తర్పణాలు ప్రాధాన్యం వహిస్తాయి. ఈ సమయంలో చేసే దానాలకి ఎన్నో రెట్లు ఎక్కువ ఫలితం ఉంటుంది.



దానికి కారణం ఈ మూడురోజులు పాతాళం నుండి వచ్చి భూమిని పరిపాలించమని శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తికి వరం ఇచ్చాడు. కనుక బలి తనకి ఇష్టమైన దానాలు చేస్తే సంతోషిస్తాడు. అందులోనూ గుమ్మడికాయను దానం చేయటం మరీ శ్రేష్ఠం. గుమ్మడిని దానం ఇస్తే భూగోళాన్ని దానం ఇచ్చినంత ఫలితం. మకరరాశిలో ఉండే శ్రవణా నక్షత్రానికి అధిపతి అయిన శని శాంతించటానికి నువ్వుల దానం చేయటం శ్రేయస్కరం. వస్త్ర దానం, పెరుగుదానంతో పాటు, ఏ దానాలు చేసినా మంచిదే. భోగినాడు ఏ కారణంగానైనా పేరంటం చేయని వారు ఈ రోజు చేస్తారు. అసలు మూడు రోజులు పేరంటం చేసే వారు న్నారు.



దక్షిణాయణం పూర్తి అయి పితృదేవతలు తమ స్థానాలకి వెడితే మళ్ళీ ఆరునెలల వరకు రారు కనుక వారికి కృతజ్ఞతా పూర్వకంగా తర్పణాలు ఇస్తారు. కొంతమంది కనుము నాడు తర్పణాలిస్తారు.



■ కనుము

తమ ఇంటికి పంట వచ్చి ఆనందంగా ఉండటానికి కారణభూతమైన భూదేవికి, రైతులకి, పాలేర్లకి, పశువులకి కూడా తమ కృతజ్ఞతలని తెలియ చేయటం ఈ పండుగలోని ప్రతి అంశంలోనూ కనపడుతుంది. కనుముని పశువుల పండగ అని కూడా అంటారు. ఈ రోజు పశువుల శాలలని శుభ్రం చేసి, పశువులని కడిగి, కొమ్ములకి రంగులు వేసి, పూలదండలని వేసి, ఊరేగిస్తారు. వాటికి పోటీలు పెడతారు. ఎడ్లకి పరుగు పందాలు, గొర్రెపొటేళ్ళ పోటీలు, కోడిపందాలు మొదలైనవి నిర్వహిస్తారు.

పాలేళ్ళకి ఈరోజు సెలవు. వాళ్ళని కూడా తలంటు పోసుకోమని కొత్తబట్టలిచ్చి పిండి వంటలతో భోజనాలు పెడతారు. సంవత్సరమంతా వ్యవసాయంలో తమకు సహాయం చేసిన వారి పట్ల కతజ్ఞత చూపటం నేర్పుతుంది ఈ సంప్రదాయం.

మాంసాహారులు ఈరోజు మాంసాహారాన్ని వండుకుంటారు. సాధారణంగా కోడిపందెంలో ఓడిపోయిన కోడినో, గొర్రెనో ఉపయోగించటం కనపడుతుంది. ఓడిపోయిన జంతువు పట్ల కూడా గౌరవ మర్యాదలని చూపటం అనే సంస్కారం ఇక్కడ కనపడుతుంది.

పక్షులు వచ్చి తమ పంట పాడుచేయకుండా ఉండేందుకు, పురుగులని తిని సహాయం చేసినందుకు వాటికి కూడా కృతజ్ఞతను ఆవిష్కరించేందుకు వరి కంకులను తెచ్చి చక్కని కుచ్చులుగా చేసి, ఇంటి ముందు వసారాలలో కడతారు. కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ కనుము నాడు గుడిలో వరికంకుల గుత్తులను కట్టే సంప్రదాయం కొనసాగుతోంది.

'కనుము నాడు కాకైనా కదలదు', 'కనుము నాడు కాకైనా మునుగుతుంది' అనే సామెతలు కనుముకి పితదేవతలకు ఉన్న సంబంధాన్ని సూచిస్తాయి.

■ ముక్కనుము

ముక్కనుము నాడు ప్రత్యేకంగా చేయవలసినవి పెద్దగా కనిపించవు. పండగలో అలిసిపోయిన వారి విశ్రాంతి కోసం కావచ్చు. కానీ, కొంతమంది కనుమునాడు కాక ఈ రోజుని మాంసాహారం తినటానికి కేటాయిస్తారు.

ఒక పండుగ, అందులోనూ ప్రధానమైన పండుగను చేసుకోవటంలో ఎన్ని అంశాలను మిళితం చేసి, వినోదాన్ని, విజ్ఞానాన్ని, వికాసాన్ని పెంపొందించే విధంగా ప్రయోజనాత్మకంగా రూపొందించారో మన పెద్దలు!

– డా. ఎన్.అనంతలక్ష్మి

సినిమా

సంక్రాంతి ప్రత్యేకం

'సంక్రాంతి పండగ అంటే ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి' అంటున్నారు పాయల్ రాజ్‌పుత్. 'సంక్రాంతికి ఫుల్ ఎనర్జీతో భోగి మంటలు వేస్తుంటాను' అన్నారు మానసా చౌదరి. 'సంక్రాంతికి గాలిపటాలు ఎగురవేయడమంటే చాలా ఇష్టం' అంటున్నారు మాళవికా శర్మ. ఇలా సంక్రాంతిని తాము ఎలా జరుపుకొంటామో అంటూ ఈ కథానాయికలు సాక్షితో పంచుకున్న విశేషాలు..

ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి - పాయల్ రాజ్‌పుత్

నన్ను అభిమానించే తెలుగు ప్రేక్షకులకు సంక్రాంతి శుభాకాంక్షలు. పంజాబీ ఆడియన్స్‌కు హ్యాపీ లోహ్రీ. సంక్రాంతి పండగ అంటే నాకు ఎన్నో జ్ఞాపకాలు గుర్తొస్తాయి. ప్రతి ఏడాది సంక్రాంతిని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం. పూజలు చేస్తాం.. ఇష్టమైన వంటకాలు చేసుకుంటాం. చిన్నతనంలో సంక్రాంతి పండక్కి గాలిపటాలను ఎగరవేసే దాన్ని. కానీ, నా జీవితం ఇప్పుడు చాలా మారిపోయింది. కాబట్టి గాలిపటాలను ఎగరవేసే సమయంలో మనలో కలిగే ఆ ఆనందపు అనుభూతిని కొంతకాలంగా మిస్ అయ్యాను. ఈ సారి ఢిల్లీలో నా స్నేహితులతో కలిసి గాలిపటాలను ఎగర వేయాలని ప్లాన్ చేస్తున్నాను. నా సిబ్బందిలో కొంతమంది హైదరాబాదీలు ఉన్నారు. వారితో పాటు సంక్రాంతిని నేను సెలబ్రేట్ చేసుకున్న అనుభవాలు ఉన్నాయి. నేను భోజన ప్రియురాలిని. ప్యూర్ వెజిటేరియన్‌ని. మసాలా కిచిడీ, లడ్డు అంటే చాలా ఇష్టం. ఇలా మా అమ్మగారు పండక్కి చేసిన వంటకాలను ఇష్టంగా తింటాను. ఇక నేను నటించిన తాజా చిత్రం 'మంగళవారం' మంచి విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరించారు.. నా అభిమానులకు కూడా థ్యాంక్స్. ఓ నటిగా మంచి కథలను ఎంచుకోవాలనుకుంటున్నాను.


● మాళవికా శర్మ

గాలిపటాలు ఎగరవేయడం చాలా ఇష్టం - మాళవికా శర్మ

సంక్రాంతి అంటే ముఖ్యంగా రైతుల పండగ. వారు ఎంతోకష్టపడి పండించిన పంటలు ఈ సంక్రాంతికి వారి చేతికి వస్తాయి. సూర్యభగవానుడికి పూజలు చేయడంతో మా సంక్రాంతి మొదలవుతుంది. మా అమ్మమ్మ మాకు ప్రతి సంక్రాంతికి కొత్త దుస్తులు ఇస్తుంటారు. నువ్వుల లడ్డూలు ఇస్తారు. లక్కీగా మా అమ్మమ్మగారి బర్త్ డే కూడా సంక్రాంతి రోజునే. మేము కూడా స్వీట్స్‌ను పంచిపెడతాం. మేం చేయగలిగినంతలో పేదలకు సాయం చేస్తుంటాం. సంక్రాంతికి గాలిపటాలు ఎగరవేయడం ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. అందరిలాగే నాకు గాలిపటాలను ఎగరవేయడం చాలా ఇష్టం. ఆకాశంలో కనిపిస్తున్న రంగు రంగుల గాలిపటాలు.. భూమిపై రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలకు ప్రతీకగా నేను భావిస్తుంటాను. నాపై తెలుగు ప్రేక్షకుల ప్రేమ, అభిమానులకు చాలా రుణపడి ఉంటాను. ముంబై నా జన్మభూమి అయితే హైదరాబాద్ నా కర్మభూమి. ఎందుకంటే.. నేను ఇక్కడే మూవీస్ చేస్తున్నాను. నేను నటించిన గోపీచంద్‌గారి 'భీమా', సుధీర్‌బాబు గారి 'హరోంహర' సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఈ సినిమాల్లో నా పాత్ర చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చే సినిమాలే చేయాలనుకుంటున్నాను.


● పాయల్ రాజ్‌పుత్

సంక్రాంతి నాకు చాలా ప్రత్యేకం - మానసా చౌదరి

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పుత్తూరు స్వగ్రామం. నాన్న మధుసూదన్ నాయుడు వ్యాపారం నిమిత్తం చెన్నైలో స్థిరపడ్డారు. మేము చెన్నైలో ఉన్నప్పటికీ ప్రతి ఏడాది సంక్రాంతికి కచ్చితంగా ఊరు వెళతాం. అక్కడ నాన్న, అమ్మ సుజాత, నేను, తమ్ముడు చేతన్ కలిసి మా బంధువులతో ఎంతో సంతోషంగా సంక్రాంతి జరుపుకుంటాం. కానీ, ఈ ఏడాది ఊరు వెళ్లలేకపోయాను. మా బంధువులు, కజిన్స్ ఫోన్ చేసి.. 'ఏంటి? హీరోయిన్ అయిపోయావని ఊరికి రావా?' అంటున్నారు. అయితే ఆదివారం భోగి పండగని చెన్నైలోనే జరుపుకొన్నాను. మేము ఉన్న వీధిలో ఎక్కువ మంది తెలుగువాళ్లు ఉంటారు.. సెలబ్రేట్ చేసుకుంటాం.

● సంక్రాంతి పండగలో తొలిరోజు వచ్చే భోగి అంటే మరీ ఇష్టం. తొలిరోజు కాబట్టి ఫుల్ ఎనర్జీతో ఉంటా. ఉదయాన్నే లేచి పెద్ద భోగిమంటలు వేసేవాళ్లం. ఆ తర్వాత ఆయిల్ బాత్ చేసి, కుటుంబమంతా కలిసి సరదాగా మాట్లాడుకునేవాళ్లం.. థియేటర్‌కి వెళ్లి సినిమాలు చూస్తాం. ఆ తర్వాత మకర సంక్రాంతిన పొంగల్ చేయడం ఇష్టం. నేను నాన్ వెజ్ బాగా తింటాను. ప్రత్యేకించి నాటుకోడి కూరతో రాగిసంకటి తినడం చాలా ఇష్టం. అలాగే మటన్ నా ఫేవరేట్. మా అమ్మ చాలా బాగా చేస్తుంది. ఎవరైనా గాలిపటాలు ఎగరవేస్తుంటే చూస్తుంటాను. కానీ నేను గాలిపటాలు ఎగరవేయలేదు. తెలుగులో 'బబుల్‌గమ్' సినిమాకి ముందే నాకు కొన్ని అవకాశాలు వచ్చాయి.. కానీ, చేయలేదు. 'బబుల్‌గమ్' తర్వాత కథలు వింటున్నాను. అయితే నటనకు మంచి అవకాశం ఉన్న పాత్రలే చేయాలనుకుంటున్నాను. ఈ ఏడాది కెరీర్‌లో ఫుల్ ఎనర్జీతో దూసుకెళ్లాలనుకుంటున్నాను.


● మానసా చౌదరి

వారి ఆనందం చూస్తుంటే తృప్తిగా ఉంది - నాగార్జున


● విజయ్ బిన్నీ, 'అల్లరి' నరేశ్, నాగార్జున, ఆషిక, శ్రీనివాస

''నా సామిరంగ' సినిమాని ఎంతగానో ఆదరించిన తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రానికి ప్రేక్షకులు, నా అభిమానుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన, ఆనందం చూస్తుంటే నాకు చాలా ఆనందంగా, తృప్తిగా ఉంది'' అని హీరో నాగార్జున అన్నారు. ఆయన హీరోగా, ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించారు. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సార్ ధిల్లాన్ కీలక పాత్రలు పోషించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా ఆదివారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'నా సామిరంగ' థ్యాంక్స్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ–''మా చిత్రం సంక్రాంతికి విడుదలవ్వాలి, పెద్ద విజయం సాధించాలనే సంకల్పం, ప్రేమతో యూనిట్ అంతా పని చేశారు.. అందుకే ఇప్పుడు ఫలితం కూడా అంత గొప్పగా వచ్చింది. విజయ్ బిన్నీకి గొప్ప భవిష్యత్ ఉంటుంది. శ్రీనివాసా చిట్టూరి, పవన్ కుమార్‌లు గొప్ప ప్రోత్సాహం అందించారు. ఆషికా రంగనాథ్‌కి తెలుగులో చాలా మంచి కెరీర్ ఉంటుందని భావిస్తున్నాను'' అన్నారు. ''నాకు ఇష్టమైన నటుడు నాగార్జునగారితో నా జీవితంలో గుర్తుండిపోయే పాత్రని ఇచ్చిన శ్రీనివాసా చిట్టూరి, పవన్‌గార్లకు ధన్యవాదాలు'' అన్నారు 'అల్లరి' నరేశ్. ''ఈ సినిమాలో వింటేజ్ నాగార్జునగారిని చూపిస్తానని మాటిచ్చాను.. ఆ మాట నిలబెట్టుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అని విజయ్ బిన్నీ అన్నారు. ఆషికా రంగనాథ్, కెమెరామేన్ దాశరథి శివేంద్ర మాట్లాడారు.

ముంబైలో మొదలు

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నాగార్జున ఓ కీలక పాత్ర పోషించనున్నారు. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుంది. తొలుత ముంబైలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారట శేఖర్ కమ్ముల. ఇందుకు సంబంధించిన వర్క్స్‌ను ఆల్రెడీ ప్రారంభించారట చిత్రయూనిట్. ముందుగా ముంబై, ఆ తర్వాత కొచ్చి లొకేషన్స్‌లో షూటింగ్ జరపాలనుకుంటున్నారట. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మించనున్నారు. పీరియాడిక్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.


● ధనుష్

భలే ఉన్నాడే!


● రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న తాజా సినిమాకు 'భలే ఉన్నాడే' అనే టైటిల్ ఖరారైంది. ఈ సినిమాతో మనీషా కంద్కూర్ కథానాయికగా పరిచయమవుతున్నారు. 'గీతా సుబ్రమణ్యం, పెళ్లి గోల 2' వంటి వెబ్‌సిరీస్‌లను తీసిన జె. శివసాయి వర్ధన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మారుతి టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ సినిమా టైటిల్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. లెజెండరీ ఫిల్మ్ మేకర్ సింగీతం శ్రీనివాస రావు, అభిరామి, లీలా శాంసన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: నగేష్ బానెల్.

బాలీవుడ్ ఎంట్రీ


● కీర్తీ సురేష్

హీరోయిన్ కీర్తీ సురేష్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఖరారైంది. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు ఎ.కాళేశ్వరన్ ఓ సినిమా తెరకెక్కించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్స్‌గా కీర్తీ సురేష్, వామికా గబ్బి నటించనున్నారు. కీర్తీ సురేష్‌కు హిందీలో తొలి చిత్రం ఇదే కావడం విశేషం. తమిళ దర్శకుడు అట్లీ సమర్పణలో మురాద్ ఖేతని, ప్రియా అట్లీ, జ్యోతి దేశ్ పాండే ఈ సినిమాను నిర్మించనున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాను ప్రకటించి, పూజా కార్యక్రమాల వీడియోను షేర్ చేసింది యూనిట్. ఇక దర్శకుడు అట్లీ తెరకెక్కించిన తమిళ చిత్రం విజయ్ 'తేరీ'కి హిందీ రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుందనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు హిందీలో రాధికా ఆప్టేతో కలిసి ఓ స్పై థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌కు కూడా కీర్తీ సురేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.. ఆమె హిందీలో చేస్తున్న తొలి వెబ్‌సిరీస్ కూడా ఇదే.

రాజావారు వస్తున్నారు

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామారావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ–''మంచి కమర్షియల్ అంశాలు ఉన్న సినిమా ఇది. ఈ నెలలో ఈ సినిమాకి సెన్సార్ ఫస్ట్ కాపీ సిద్ధం కాబోతోంది. ఏడాదికి మూడు సినిమాలు నిర్మించాలని ప్లాన్ చేస్తున్నా. తెలుగు, మరాఠీ, కన్నడ భాషల్లో చిత్రాలు నిర్మించాలనుకుంటున్నా'' అన్నారు.


● నార్నే నితిన్

కృష్ణ విజయం రెడీ

సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం 'కృష్ణ విజయం'. ఈ మూవీలో నాగబాబు, సుహాసిని, యశ్వంత్, అలీ, సూర్య, గీతాసింగ్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. అంబుజా మూవీస్ పతాకంపై మధుసూదన్ హవల్దార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. 'కృష్ణ విజయం' సినిమా తప్పకుండా హిట్ సాధిస్తుందని నమ్మకం ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కృష్ణ–మహేశ్ సేన అధ్యక్షుడు ఖాదర్ ఘోరి పాల్గొన్నారు.


● 'కృష్ణ విజయం' మూవీ పోస్టర్



ఫిన్ అలెన్ మెరుపులు... న్యూజిలాండ్ విజయం

పాకిస్తాన్ జట్టుతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 21 పరుగులతో నెగ్గింది. ముందుగా న్యూజిలాండ్ 8 వికెట్లకు 194 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (41 బంతుల్లో 74; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిశాడు. అనంతరం పాక్ 19.3 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (43 బంతుల్లో 66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫఖర్ జమాన్ (25 బంతుల్లో 50; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. కివీస్ బౌలర్లు మిల్నె (4/33), సౌతీ (2/31), సియర్స్ (2/28) రాణించారు.

భారత షూటర్ల పసిడి వేట



జకార్తాలో జరుగుతున్న ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో భారత షూటర్లు తమ పతకాల వేటను కొనసాగిస్తూ ఆదివారం రెండు స్వర్ణ పతకాలు గెలిచారు. పురుషుల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ యోగేశ్ సింగ్ (572 పాయింట్లు) పసిడి పతకం నెగ్గాడు. యోగేశ్, అమిత్, ఓం ప్రకాశ్‌లతో కూడిన భారత బృందం టీమ్ విభాగంలో 1690 పాయింట్లతో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది.

18 నుంచి టికెట్ల విక్రయం

ఈనెల 25 నుంచి ఉప్పల్ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు



హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

సాక్షి, హైదరాబాద్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఈనెల 25 నుంచి 29 వరకు ఉప్పల్ స్టేడియంలో జరిగే తొలి టెస్టు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను ఈనెల 18 నుంచి ఆన్‌లైన్‌లో విక్రయిస్తారు. పేటీఎం ఇన్‌సైడర్ యాప్‌లో, www.insider.in వెబ్‌సైట్‌లో రాత్రి 7 గంటల నుంచి టికెట్లు లభిస్తాయని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ఆదివారం ప్రకటించారు. మిగిలిన టికెట్లను ఈనెల 22 నుంచి ఆఫ్‌లైన్‌లో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో విక్రయిస్తామని ఆయన వివరించారు. టికెట్ల ధరలను ఒక్కో రోజుకు రూ. 200, రూ. 499, రూ. 750, రూ. 1250, రూ. 3000 (కార్పొరేట్ బాక్స్ నార్త్), రూ. 4000 (కార్పొరేట్ బాక్స్ సౌత్)గా నిర్ణయించారు. ఐదు రోజుల సీజన్ టికెట్ల ధరలను రూ. 600, రూ. 1500, రూ. 2250, రూ. 3750, రూ. 12000 (కార్పొరేట్ బాక్స్ నార్త్), రూ. 16000 (కార్పొరేట్ బాక్స్ సౌత్)లుగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించి 22వ తేదీ నుంచి జింఖానా మైదానంలో టికెట్లను రీడీమ్ చేసుకోవాలి.

ఓటమి దిశగా ఆంధ్ర

ముంబై: బ్యాటర్ల వైఫల్యంతో ఆంధ్ర జట్టు రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో తొలి ఓటమి దిశగా సాగుతోంది. ముంబైతో జరుగుతున్న గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు ఫాలోఆన్ రెండో ఇన్నింగ్స్‌లో 51 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఆంధ్ర జట్టు మరో 45 పరుగులు సాధించాలి. షేక్ రషీద్ (52 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (22 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 98/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 72 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. ప్రశాంత్ కుమార్ (73; 10 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 211 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా ఆంధ్ర జట్టుకు ఫాలోఆన్ ఇచ్చింది. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 395 పరుగులకు ఆలౌటైంది.

ఆడుతూ పాడుతూ...

- 173 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలో ఛేదించిన భారత్
- రెండో టి20లోనూ విజయం
- సిరీస్ 2–0తో టీమిండియా సొంతం
- యశస్వి, శివమ్ దూబే మెరుపులు
- ఆరు వికెట్లతో ఓడిన అఫ్గానిస్తాన్



యశస్వి జైస్వాల్



శివమ్ దూబే



అక్షర్ పటేల్

ఇండోర్: ముందుగా బౌలింగ్‌లో, ఆ తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిన భారత్ స్వదేశంలో మరో ద్వైపాక్షిక టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. 2019 నుంచి సొంతగడ్డపై టి20 సిరీస్‌లలో ఓటమిలేని భారత్ అదే జోరును అఫ్గానిస్తాన్‌పై కూడా కొనసాగించింది. మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్తాన్‌తో ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్‌ను దక్కించుకుంది. చివరిదైన మూడో టి20 మ్యాచ్ బుధవారం బెంగళూరులో జరుగుతుంది.

టాస్ గెలిచిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ సరిగ్గా 20 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. గుల్బదిన్ (35 బంతుల్లో 57; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లు తీయగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 173 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 15.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. యశస్వి జైస్వాల్ (34 బంతుల్లో 68; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), శివమ్ దూబే (32 బంతుల్లో 63 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అఫ్గాన్ బౌలర్ల భరతం పట్టి అర్ధ సెంచరీలు సాధించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (0) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'డకౌట్'కాగా... 14 నెలల తర్వాత మళ్లీ టి20 మ్యాచ్ ఆడిన కోహ్లి (16 బంతుల్లో 29; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నంతసేపు దూకుడుగా ఆడాడు.

150 అంతర్జాతీయ టి20ల్లో 150 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు.

12 అంతర్జాతీయ టి20ల్లో భారత్ తరఫున అత్యధికంగా 12 సార్లు 'డకౌట్' అయిన ప్లేయర్ రోహిత్ శర్మ. కేఎల్ రాహుల్ (5) రెండో స్థానంలో ఉన్నాడు.

15 స్వదేశంలో జరిగిన గత 15 ద్వైపాక్షిక టి20 సిరీస్‌లలో భారత్ అజేయంగా నిలిచింది. 2019 నుంచి భారత జట్టు 13 టి20 సిరీస్‌లను నెగ్గి, రెండింటిని 'డ్రా'గా ముగించింది.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) దూబే (బి) రవి బిష్ణోయ్ 14; ఇబ్రహీమ్ (బి) అక్షర్ పటేల్ 8; గుల్బదిన్ (సి) రోహిత్ శర్మ (బి) అక్షర్ పటేల్ 57; అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (బి) శివమ్ దూబే 2; మొహమ్మద్ నబీ (సి) రింకూ సింగ్ (బి) రవి బిష్ణోయ్ 14; నజీబుల్లా (బి) అర్ష్‌దీప్ 23; కరీమ్ (సి) అక్షర్ పటేల్ (బి) అర్ష్‌దీప్ 20; ముజీబ్ (రనౌట్) 21; నూర్ అహ్మద్ (సి) కోహ్లి (బి) అర్ష్‌దీప్ 1; నవీన్ ఉల్ హక్ (నాటౌట్) 1; ఫరూఖీ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం: 1–20, 2–53, 3–60, 4–91, 5–104, 6–134, 7–164, 8–170, 9–171, 10–172. బౌలింగ్: అర్ష్‌దీప్ సింగ్ 4–0–32–3, ముకేశ్ కుమార్ 2–0–21–0, రవి బిష్ణోయ్ 4–0–39–2, అక్షర్ పటేల్ 4–0–17–2, శివమ్ దూబే 3–0–36–1, వాషింగ్టన్ సుందర్ 3–0–23–0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) గుర్బాజ్ (బి) కరీమ్ 68; రోహిత్ శర్మ (బి) ఫరూఖీ 0; విరాట్ కోహ్లి (సి) ఇబ్రహీమ్ (బి) నవీన్ 29; శివమ్ దూబే (నాటౌట్) 63; జితేశ్ శర్మ (సి) నబీ (బి) కరీమ్ 0; రింకూ సింగ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (15.4 ఓవర్లలో 4 వికెట్లకు) 173. వికెట్ల పతనం: 1–5, 2–62, 3–154, 4–156. బౌలింగ్: ఫరూఖీ 3.4–0–28–1, ముజీబ్ ఉర్ రెహ్మాన్ 2–0–32–0, నవీన్ ఉల్ హక్ 3–0–33–1, నూర్ అహ్మద్ 3–0–35–0, నబీ 2–0–30–0, కరీమ్ 2–0–13–2.

రన్నరప్ సాత్విక్–చిరాగ్ జోడీ

- మూడో గేమ్‌లో 10–3తో ఆధిక్యాన్ని వృథా చేసుకున్న భారత ద్వయం
- మలేసియా ఓపెన్ టోర్నీ



సాత్విక్–చిరాగ్‌లకు 45,500 డాలర్ల (రూ. 37 లక్షల 71 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 10,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

కౌలాలంపూర్: కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలని ఆశించిన భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంక్‌లో ఉన్న సాత్విక్–చిరాగ్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న లియాంగ్ వె కెంగ్–వాంగ్ చాంగ్ (చైనా) జంటతో ఆదివారం జరిగిన ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–9, 18–21, 17–21తో ఓడిపోయింది. 58 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్–చిరాగ్ 10–3తో ఏకంగా 7 పాయింట్ల ఆధిక్యంలో నిలిచారు. కానీ ఒత్తిడికిలోనై, అనవసర తప్పిదాలు చేసి భారత జంట చైనా జోడీకి పుంజుకునే అవకాశం ఇచ్చింది. రన్నరప్‌గా నిలిచిన

శ్రమించిన జొకోవిచ్

రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంప్



మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో తొలి రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 6–2, 6–7 (5/7), 6–3, 6–4తో ప్రపంచ 178వ ర్యాంకర్, క్వాలిఫయర్ డినో ప్రిజ్మిక్ (క్రొయేషియా)పై కష్టపడి గెలిచాడు. 4 గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించాడు. 40 విన్నర్స్ కొట్టిన ఈ సెర్బియా స్టార్ 49 అనవసర తప్పిదాలు చేయడం గమనార్హం. ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయాడు.

సబలెంకా సులువుగా...

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్) అలవోక విజయంతో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. రెండో సీడ్ సబలెంకా 6–0, 6–1తో 53 నిమిషాల్లో ఇలా సెడెల్ (జర్మనీ)పై గెలిచింది. ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్), తొమ్మిదో సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

గెలిచి నిలిచిన భారత్



రాంచీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు సత్తా చాటుకుంది. ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా న్యూజిలాండ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున సంగీత కుమారి (1వ ని.లో), ఉదిత (12వ ని.లో), డుంగ్‌డుంగ్ బ్యూటీ (14వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ జట్టుకు మేగన్ హల్ (9వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. మరో మ్యాచ్‌లో అమెరికా 2–0తో ఇటలీ జట్టును ఓడించింది. ప్రస్తుతం అమెరికా 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత్, న్యూజిలాండ్ 3 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. మంగళవారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అమెరికాతో న్యూజిలాండ్; ఇటలీతో భారత్ తలపడతాయి.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్‌లో 98 ట్రైనీ ఇంజనీర్, ట్రైనీ ఆఫీసర్ పోస్టులు

ఫరీదాబాద్(హర్యానా)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) ట్రైనీ ఇంజనీర్, ట్రైనీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 98
» పోస్టుల వివరాలు:ట్రైనీ ఇంజనీర్(సివిల్)–22, ట్రైనీ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–17, ట్రైనీ ఇంజనీర్(మెకానికల్)–50,ట్రైనీ ఆఫీసర్(ఫైనాన్స్)–09.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ, బీటెక్, సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు గేట్, సీఏ/సీఎంఏ స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 22.01.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.50,000 నుంచి 1,60,000.
» ఎంపిక విధానం: గేట్, సీఏ/సీఎంఏ స్కోరు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.01.2024
» వెబ్‌సైట్: www.nhpcindia.com

హెచ్‌ఏఎల్, బెంగళూరులో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లు

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్).. అప్రెంటిస్ శిక్షణకు గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» విభాగాలు: ఏరోనాటికల్/ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, మెకానికల్/ఇండస్ట్రియల్/ప్రొడక్షన్/మెకాట్రానిక్స్, మెటలర్జీ అండ్ మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి–కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» స్టైపెండ్: నెలకు రూ.9000.
» ఎంపిక విధానం: ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ బేసిస్, బీఈ, బీటెక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» వాక్ ఇన్ సెలక్షన్స్ తేదీలు: 16, 17, 18, 19, 20/01/2024.
» వేదిక: టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, సురంజన్ దాస్ రోడ్, బెంగళూరు.
» వెబ్‌సైట్: https://hal-india.co.in

ఏపీ ఆర్‌జీయూకేటీలో 194 ఫ్యాకల్టీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» ఏపీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు: నూజివీడు (ఏలూరు జిల్లా),ఆర్కే వ్యాలీ (కడప జిల్లా),ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా),ఒంగోలు(ప్రకాశం జిల్లా).
» మొత్తం పోస్టుల సంఖ్య: 194.
» పోస్టుల వివరాలు: లెక్చరర్–61, అసిస్టెంట్ ప్రొఫెసర్–133.
» లెక్చరర్: సబ్జెక్ట్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, తెలుగు. అర్హత: కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టు/భాషలో ఎంఏ/ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» అసిస్టెంట్ ప్రొఫెసర్: సబ్జెక్ట్‌లు: బయాలజీ, సివిల్ ఇంజనీరింగ్, సీఎస్‌ఈ, ఈఈఈ, ఈసీఈ, ఇంగ్లిష్, మేనేజ్‌మెంట్, మ్యాథమేటిక్స్, మెకానికల్, ఎంఎంఈ. అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, నెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.01.2024
» వెబ్‌సైట్: www.rgukt.in

ఆర్‌పీఎన్‌ఎల్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ప్రయాగ్‌రాజ్(ఉత్తరప్రదేశ్)లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేషనల్ లా యూనివర్శిటీ (ఆర్‌పీఎన్‌ఎల్‌యూ).. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06
» సబ్జెక్టులు: హిస్టరీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, లా, సోషియాలజీ.
» అర్హత: 55శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు రూ.15,600 నుంచి 39,100.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రెజెంటేషన్, మాక్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 20.01.2024.
» వెబ్‌సైట్: www.rpnlup.ac.in

కెరీర్ 'నిర్మాణం'.. నాటా!

» బీఆర్క్‌లో ప్రవేశానికి నాటా నోటిఫికేషన్
» కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో పరీక్ష
» ఈ ఏడాది పరీక్ష నిర్వహణలో మార్పులు

ఆర్కిటెక్చర్.. శతాబ్దాలుగా గుర్తింపు పొందుతున్న ఇంజనీరింగ్ విభాగం! ఎన్నో చారిత్రక కట్టడాల అద్భుత నిర్మాణ కౌశలానికి ఆర్కిటెక్చర్ నిపుణుల ప్రతిభే కారణం!! అలాంటి నైపుణ్యాలు అందించే కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఈ కోర్సులో ప్రవేశాలకు మార్గం.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా). నాటా స్కోర్‌తో.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌లో బీఆర్క్‌లో ప్రవేశం పొందొచ్చు! తాజాగా నాటా-2024 షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నాటా వివరాలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు ప్రిపరేషన్ తదితర వివరాలు..



దేశంలోని ఆర్కిటెక్చర్ కళాశాలలను పర్యవేక్షించే కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నేతృత్వంలో నాటా పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగానే నాటా గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ప్రస్తుతం దేశంలో దాదాపు 650కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు సీఓఏ పరిధిలో ఉన్నాయి. వీటిలో అడుగు పెట్టాలంటే నాటా స్కోర్ తప్పనిసరి. జేఈఈ–మెయిన్ పేపర్–2 స్కోర్‌తో నిట్‌లు, జేఈఈ–అడ్వాన్స్‌డ్ తర్వాత నిర్వహించే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌తో ఐఐటీలు బీఆర్క్‌లో అడ్మిషన్ కల్పిస్తున్నాయి. మిగతా అన్ని ఇన్‌స్టిట్యూట్‌ల్లో బీఆర్క్‌లో ప్రవేశాలకు నాటా స్కోర్ తప్పనిసరి.

అర్హతలు

ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్ లేదా మూడేళ్ల డిప్లొమాలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏప్రిల్–జూలై మధ్య

నాటాకు సంబంధించి ఈ ఏడాది కొన్ని మార్పులు జరిగాయి. నాటా–2024ను ఏప్రిల్ నుంచి జూలై వరకు.. ప్రతి శనివారం, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్దిష్టమైన తేదీలను త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం తొలి పరీక్ష ఏప్రిల్ 6న జరుగనుంది. మూడుసార్లు పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు మూడు అటెంప్ట్‌లకు హాజరైతే.. ఆ మూడు స్కోర్లలో బెస్ట్ స్కోర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండేళ్ల గుర్తింపు

నాటా స్కోర్ కార్డ్‌కు రెండేళ్లపాటు గుర్తింపు ఉంటుంది. అంటే.. 2024లో స్కోర్ కార్డ్ సొంతం చేసుకుంటే 2024–25, 2025–26 విద్యా సంవత్సరాల్లో.. ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితంగా.. ఈ విద్యా సంవత్సరంలో మెచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో సీటు లభించని విద్యార్థులు.. వచ్చే విద్యా సంవత్సరంలో ఆ దిశగా ప్రయత్నించే అవకాశం లభిస్తుంది.

రెండు విభాగాలు.. 200 మార్కులు

- నాటా–2024ను రెండు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు.
- మొదటి విభాగం.. పార్ట్–ఎలో.. డ్రాయింగ్ అండ్ కంపోజిషన్ టెస్ట్(1 ప్రశ్న- 25 మార్కులు), స్కెచింగ్ అండ్ కంపోజిషన్–బ్లాక్ అండ్ వైట్ (1 ప్రశ్న–25 మార్కులు), 3డి కంపోజిషన్ (1 ప్రశ్న–30 మార్కులు) విభాగాలు ఉంటాయి.
- రెండో విభాగం.. పార్ట్–బిలో విజువల్ రీజనింగ్, లాజికల్ డెరివేషన్, జీకే అండ్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, లాంగ్వేజ్ ఇంటర్ ప్రిటేషన్, డిజైన్ సెన్సిటివిటీ, డిజైన్ థింకింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నల్లో 30 ప్రశ్నలకు 2 మార్కులు చొప్పున 60 మార్కులు, మరో 15 ప్రశ్నలకు 4 మార్కులు చొప్పున 60 మార్కులు కేటాయిస్తారు. ఇలా పార్ట్–ఎ, పార్ట్–బి రెండూ కలిపి 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పార్ట్–ఎను ఆఫ్‌లైన్ టెస్ట్‌గా, పార్ట్–బిని ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. పార్ట్–ఎకు 90 నిమిషాలు, పార్ట్–బికి 90 నిమిషాలు చొప్పున మొత్తం మూడు గంటల సమయం ఇస్తారు. ప్రశ్నలు.. బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఎంసీక్యూస్), మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ (ఒకటి కంటె ఎక్కువ సమాధానాలు ఉండే ఆబ్జెక్టివ్ ప్రశ్నలు), న్యూమరికల్ టైప్ కొశ్చన్స్, ప్రిఫరెన్షియల్ ఛాయిస్, మ్యాచ్ ద ఫాలోయింగ్ తరహాలో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- మొదటి అటెంప్ట్ దరఖాస్తు తేదీలు: 2024 మార్చి/ఏప్రిల్‌లో
- మొదటి అటెంప్ట్ పరీక్ష తేది: 2024 ఏప్రిల్ 6.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nata.in

బెస్ట్ స్కోర్‌కు సన్నద్ధత ఇలా

డ్రాయింగ్ అండ్ కంపోజిషన్ టెస్ట్

పార్ట్–ఎగా నిర్వహించే ఈ విభాగంలో ఒక సందర్భాన్ని, సన్నివేశాన్ని ఊహించి విశ్లేషించి.. దాని గురించి అడిగిన ప్రశ్నకు అనుగుణంగా సరిపడే సమాధానాన్ని గుర్తించాల్సి ఉంటుంది. స్కెచ్ విజువలైజేషన్, క్రియేటివిటీ, స్కేల్ అండ్ ప్రపోర్షన్ ఆఫ్ ఆబ్జెక్ట్, జియోమెట్రిక్ కంపోజిషన్, బిల్డింగ్ ఫామ్స్, ఎలిమెంట్స్, కలర్ టెక్స్చర్, హార్మోనీ అండ్ కాంట్రాస్ట్, డ్రాయింగ్ ఆఫ్ ప్యాట్రన్స్, ఫామ్ ట్రాన్స్‌ఫర్మేషన్స్, ఇన్ 2డీ, 3డీ, సబ్‌స్ట్రాక్షన్, రొటేషన్, సర్ఫేసెస్ అండ్ వాల్యూమ్స్, జేనరేటింగ్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

న్యూమరికల్ రీజనింగ్

పార్ట్–బిలో.. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, కాలిక్యులస్, ఇంటీజర్స్ వంటి మ్యాథమెటిక్స్ అంశాలపై దృష్టి పెట్టాలి. ఇక ఫిజిక్స్‌కు సంబంధించి ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, రే ఆప్టిక్స్, రేడియేషన్, ఆటమ్స్ అండ్ న్యూక్లియస్ తదితర ముఖ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

కంపోజిషన్ ఆఫ్ కలర్

ఇందులో ఆయా సందర్భాలు, సన్నివేశాలకు అనుగుణంగా.. ఊహా చిత్రాలను రూపొందించేందుకు.. ఆకర్షణీయమైన కలర్ కాంబినేషన్స్‌ను వినియోగించే నైపుణ్యాలను పరీక్షిస్తారు.

స్కెచింగ్, కంపొజిషన్

ఈ విభాగంలో అభ్యర్థులకు నిర్దిష్టంగా ఒక సందర్భం, సన్నివేశాన్ని తెలియజేస్తారు. దీనికి అనుగుణంగా.. అభ్యర్థులు.. ఆయా భవనాల ఊహా చిత్రాలను గీయాల్సి ఉంటుంది. అభ్యర్థులు స్కేల్, ప్రపోర్షన్స్, టెక్స్చర్స్, షాడోస్, షేడ్స్ వంటి వాటిని విశ్లేషించాల్సి ఉంటుంది.

సిట్యుయేషనల్ రీజనింగ్

అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ఈ విభాగంలో ప్రశ్నలను అడుగుతారు. ఏదైనా ఒక అంశాన్ని లేదా దృశ్యాన్ని చూపించి.. అందులోని లోటుపాట్లు.. వాటికి పరిష్కారం చూపే విధంగా సమాధానాల్ని గుర్తించాల్సి ఉంటుంది.

అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్

ఈ విభాగంలో జనరల్ నాలెడ్జ్‌తోపాటు వర్తమాన అంశాలు, లేదా ఏదైనా ఒక అంశానికి సంబంధించి తాజా పరిస్థితులపై అవగాహనను తెలుసుకునే విధంగా ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్, ఆర్కిటెక్చర్ విభాగంలోని తాజా పరిణామాల గురించి తెలుసుకోవాలి. స్టాక్ జీకేలో ప్రధానంగా.. అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కట్టడాలు, రూపకర్తలు, కరెంట్ అఫైర్స్ అంశాలపై దృష్టి పెట్టాలి.

ఉమ్మడి కౌన్సెలింగ్

నాటా స్కోర్ సొంతం చేసుకున్న అభ్యర్థులు మలి దశలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు చేస్తారు. ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇచ్చే విధానం అమలవుతోంది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న కళాశాలల ప్రాథమ్యాలను పేర్కొనాల్సి ఉంటుంది.

విస్తృత అవకాశాలు

అయిదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సు ఉత్తీర్ణులకు ప్రైవేట్ రంగంలో, అదే విధంగా ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ విభాగాల్లో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రైల్వే, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్, నేషనల్ బిల్డింగ్, ఆర్గనైజేషన్స్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. ఇలా చాలా ప్రభుత్వ, అనుబంధ రంగాల్లో కొలువులు లభిస్తాయి. అదే విధంగా ప్రైవేట్ రంగంలో గ్రాఫిక్, ఇంటీరియర్ డిజైన్, ఫర్నిచర్ డిజైన్ వంటి సంస్థల్లో, నిర్మాణ రంగంలోని కార్పొరేట్ సంస్థల్లో సగటున రూ. అయిదు లక్షల వేతనంతో కొలువు సొంతం చేసుకోవచ్చు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
847	247
72,568	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	14,973	▲	3
డోజోన్స్	37,593	▼	118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲	48
డాక్స్	16,705	▲	158
హాంగ్‌సెంగ్	2,882	▼	5
నికాయ్	35,557	▲	525

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.01	107.59
€	యూరో	ఎస్‌బీఐ	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.74	58.04
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.59	23.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	23.36

రుణ పడొద్దు!



సొంత కారు, అందమైన భవంతి, ఇంట్లో అన్ని రకాల సాధనాలు (మెషీన్లు).. ఎందులోనూ రాజీపడేది లేదన్నట్టుగా ఉంది నేటి యువతరం ధోరణి. ముందు పొదుపు, తర్వాతే ఖర్చు.. గతంలో మన పెద్దలు అనుసరించిన ధోరణి. ముందు ఖర్చు.. మిగిలితేనే పొదుపు అన్నట్టుగా ఉంది నేటి తీరు. ఏ అవసరం వచ్చినా 'తగ్గేదే లే' అన్న ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్ల నుంచి వైద్య చికిత్సల వరకు అన్నింటికీ రుణబాట పడుతున్నారు. తీర్చే సామర్థ్యం ఉంటేనే రుణం తీసుకోవాలి. ప్రాధాన్యత లేని వాటికి సైతం రుణాలను ఆశ్రయిస్తే తీర్చే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కారణం ఏదైనా సకాలంలో రుణం వాయిదా చెల్లించలేకపోతే, ఎదుర్కోవాల్సిన పరిణామాలు చాలానే ఉంటాయి. చివరికి ఉద్యోగ అన్వేషణకు సైతం దూరం కావాల్సి రావచ్చు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి

- లేదంటే క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- క్రెడిట్ రిపోర్ట్‌లో మచ్చ
- చట్టపరమైన చర్యలను ఎదుర్కొనే పరిస్థితి
- అనవసర చార్జీల భారం
- బ్యాంకుతో సంప్రదింపుల ద్వారా పరిష్కారం
- రుణంపై స్వల్పకాలం పాటు మారటోరియం
- గడువు పెంపుతో తగ్గే ఈఎంఐ



గతంలో బ్యాంకుల రుణ వృద్ధిలో కార్పొరేట్ రుణాలదే పైచేయిగా ఉండేది. మొదటిసారి 2020 (కరోనా విపత్తు కాలంలో) నవంబర్‌లో బ్యాంకుల రుణాల్లో కార్పొరేట్‌లను కాదని రిటైల్ రుణాలు ముందుకు వచ్చేశాయి. అప్పటి నుంచి 2023 నవంబర్ 17 నాటికి చూస్తే రిటైల్ రుణాలు 79 శాతం పెరగ్గా.. కార్పొరేట్ రుణాల్లో వృద్ధి 28 శాతానికి పరిమితమైంది. 2023లో రెండో త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లోనూ రిటైల్ రుణాల్లో వృద్ధి 15 శాతంగా నమోదైంది. రిటైల్ రుణాల్లో కన్జ్యూమర్ ఉత్పత్తుల కొనుగోళ్ల కోసం తీసుకునేవి (విలువ పరంగా) 20 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన రుణాలు 18 శాతం వృద్ధి చెందాయి. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకునే రుణాలు 12 శాతం పెరిగాయి. ఆటో రుణాలు 13 శాతం పెరిగితే, ఇంటి రుణాలు విలువ పరంగా మైనస్ 6 శాతంగా ఉన్నాయి. వినియోగ రుణాలు ఎక్కువగా ఉంటున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అదే సమయంలో రుణ ఎగవేతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రుణాల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది. 2023 జూలై నాటికి క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.2.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కంటే 31 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలన్నీ కూడా అన్‌సెక్యూర్డ్. రుణ గ్రహీత చేతులు ఎత్తేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థపై భారాన్ని మోపుతుంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ వ్యక్తిగత, అన్ సెక్యూర్డ్, క్రెడిట్ కార్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచుతూ, వీటికి బ్యాంకులు మరిన్ని నిధులను పక్కన పెట్టేలా గత నవంబర్‌లో ఆదేశాలు తీసుకొచ్చింది.

తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయినా, రుణాన్ని ఎగవేసినా అది క్రెడిట్ స్కోర్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. కరోనా అనంతరం రిటైల్ రుణాలు తీసుకోవడం గణనీయంగా పెరిగిపోగా, అదే సమయంలో అంతకుముందు తీసుకున్న రుణాలకు సంబంధించి ఎగవేతలు కూడా పెద్ద మొత్తంలోనే నమోదయ్యాయి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద

క్రెడిట్ స్కోర్‌కు విఘాతం



మొత్తాల్లో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో చాలా మంది రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడింది. నేడు ప్రతి రుణానికి సంబంధించి చెల్లింపుల చరిత్రతో క్రెడిట్ బ్యూరోలు రికార్డులను నిర్వహిస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించకపోయినా, ఎగ్గొట్టినా, సెటిల్‌మెంట్ చేసుకున్నా, రుణం కావాలంటూ విచారణలు చేసినా, అవన్నీ సంబంధిత వ్యక్తి పేరిట రికార్డుగా నమోదవుతాయి. వీటి ఆధారంగానే క్రెడిట్ బ్యూరోలు స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. 750, అంతకుమించి క్రెడిట్ స్కోర్ ఉంటే అది మెరుగైనది. రుణం సులభంగా వస్తుంది. మెరుగైన రేటుకు వస్తుంది. 750కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. ఒకవేళ రుణం లభించినా, అది అధిక వడ్డీ రేటుపై తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలి. నేడు దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ స్కోర్ ఆధారంగానే అన్‌సెక్యూర్డ్ రుణాలు మంజూరు చేస్తున్నాయి.

తదుపరి పరిణామాలు..

బకాయి చెల్లించాలంటూ రుణగ్రహీతను రుణం ఇచ్చిన సంస్థలు కోరతాయి. గడువు తీరిన 30 రోజులకూ చెల్లింపులు చేయకపోతే అప్పుడు ఆయా రుణగ్రహీతల సమాచారాన్ని క్రెడిట్ బ్యూరోలకు పంపిస్తుంటాయి. 30–60 రోజుల పాటు చెల్లింపులు చేయకపోతే అది క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. ఇక రుణ వాయిదా 60 రోజులు దాటినా చెల్లించలేని వారి క్రెడిట్ స్కోర్ మరింత తగ్గిపోతుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ వల్ల భవిష్యత్తులో రుణానికి ద్వారాలు మూసుకుపోతాయి. అత్యవసరంలో రుణం కావాల్సి వస్తే నిరాకరణ ఎదురుకావచ్చు. డిజిటల్‌గా రుణాలు ఇచ్చే సంస్థలు కనీసం ఒక్క రోజు ఆలస్యం చేసినా,ఎగవేతదారుల జాబితాలో చేరాల్సి వస్తోంది. 650–750 మధ్య స్కోర్ ఉన్న వారికి గృహ రుణం కావాలంటే, మెరుగైన స్కోర్ ఉన్న వారితో పోలిస్తే 2 శాతం అధిక రేటు చెల్లించాల్సి వస్తుంది. రూ.50 లక్షల రుణం 20 ఏళ్ల కాలవ్యవధికి కావాలంటే, తక్కువ స్కోర్ కారణంగా వడ్డీ రూపంలో అదనంగా రూ.12 లక్షల వరకు భారాన్ని మోయాల్సి రావచ్చు. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య ఈ రేటు వ్యత్యాసం మారుతుంది.

రుణం ఎగ్గొట్టడం సివిల్ నేరం కిందకు వస్తుంది. రుణ గ్రహీత ఇచ్చిన చెక్కుల ద్వారా వసూలు చేసుకునే చర్యలను ఆర్థిక సంస్థలు ప్రారంభిస్తాయి. గడువు ముగిసిన 90 రోజుల్లోపు కూడా రుణ గ్రహీత చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నోటీసు వస్తుంది. 180 రోజులు (ఆరు నెలలు) ముగిసినా ఎలాంటి ఫలితం లేకపోతే అప్పుడు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద రుణం ఇచ్చిన సంస్థ కేసు దాఖలు చేస్తుంది. చెల్లించే సామర్థ్యం ఉన్నా, చెల్లించకపోతే ఉద్దేశపూర్వక ఎగవేతదారు అనే ముద్ర పడుతుంది. సరైన కారణంతో రుణం చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటే అప్పుడు రుణం ఇచ్చిన సంస్థతో చర్చలు నిర్వహించి పరిష్కారానికి, పరస్పర అంగీకారానికి రావచ్చు.

హోమ్‌లోన్ లేదా ప్రాపర్టీ లోన్ లేదా బంగారంపై రుణం వంటి సెక్యూర్డ్ రుణాల్లో రుణ గ్రహీత చెల్లింపుల్లో చేతులు ఎత్తేస్తే.. తనఖాగా ఉంచిన ఆస్తులను బ్యాంకులు వేలం వేస్తుంటాయి. అలాగే, ఆటోమొబైల్ రుణాల్లోనూ వాహనాన్ని జప్తు చేసి, చెల్లింపులకు తగినంత వ్యవధి ఇస్తాయి. అప్పటికీ చెల్లించకపోతే వాహనాన్ని వేలం వేసి రుణంలో సర్దుబాటు చేసుకుంటాయి.

బ్యాంక్ జాబ్ కష్టమే!

బలహీన క్రెడిట్ స్కోర్ ఉందంటూ ఉద్యోగ దరఖాస్తు తిరస్కరించే అధికారం బ్యాంకుల బోర్డులకు ఉంటుంది. బ్యాంక్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 650 క్రెడిట్ స్కోర్ ఉండాలన్న నిబంధనను ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) విధించింది. బాధ్యతాయుత ఆర్థిక నడవడిక ఉండాలన్నది దీని వెనుక ఉద్దేశం. ఎంతో విలువైన లావాదేవీల వ్యవహారాల బాధ్యతలను బ్యాంకుల ఉద్యోగులు చూస్తుంటారు. అందుకే ఈ నిబంధన ప్రవేశపెట్టారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలకు ప్రయత్నించే వారు మెరుగైన స్కోర్ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్త చర్యలను పాటించడం మంచిది. కొన్ని బహుళజాతి సంస్థలు కూడా ఉద్యోగం కోరుతున్న వారి క్రెడిట్ స్కోర్‌ను పరిశీలిస్తుంటాయి. 2022 మార్చిలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన




ప్రకటనలో.. బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకున్న ఏ రుణం చెల్లింపుల్లో అయినా విఫలం అయినట్టయితే, క్రెడిట్ కార్డ్ బకాయిలు సకాలంలో చెల్లింపులు చేయకపోతే అటువంటి వారు నియామకానికి అర్హులు కాదని స్పష్టంగా పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగార్థుల క్రెడిట్ రిపోర్ట్‌లను పరిశీలించడం సర్వసాధారణమని.. దీనివల్ల ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉంటారనేది తెలుస్తుందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ఫైబ్ హెచ్‌ఆర్ హెడ్ మోనికా మిశ్రా తెలిపారు. ఇది సంస్థలో మోసాలు, చోరీల అవకాశాలను తెలియజేస్తుందన్నారు. ఆర్థిక అంశాల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా ఉండే వ్యక్తి, కంపెనీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సరైన వ్యక్తి కాదని మిశ్రా వివరించారు.

రుణం కోసం రుణం...



తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితుల్లో మరో రుణం తీసుకుని చెల్లించే ఆలోచనలు సరికాదు. ముందు తీసుకున్న రుణంపై అధిక వడ్డీ రేటు ఉండి, చాలా తక్కువ రేటుకే మరో సంస్థ రుణం ఇవ్వడానికి ముందుకు వస్తే అప్పుడు ఆలోచించొచ్చు. తక్కువ రేటుపై రుణం తీసుకుని అధిక రేటుతో కూడిన రుణాన్ని తీర్చివేయవచ్చు. వ్యక్తిగత రుణాలపై 14–15 శాతం మేర వడ్డీ రేటు ఉంటే, మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 12 శాతానికే లభిస్తుంది. అలాంటప్పుడు పరిశీలించొచ్చు. అంతేకానీ, చెల్లింపుల సమస్య నుంచి బయటపడేందుకు మరో రుణాన్ని ఆశ్రయిస్తే సమస్యను పెంచుకున్నట్టు అవుతుంది. అలాగే, క్రెడిట్ కార్డ్‌పై 3–4 రూపాయల వడ్డీ పడుతుంది. వ్యక్తిగత రుణాన్ని తీసుకుని క్రెడిట్ కార్డ్ రుణాన్ని తీర్చివేయవచ్చు.

రుణ గ్రహీత ముందున్న మార్గం



రుణం తీసుకుని, చెల్లింపులు సకాలంలో చేయకపోయినా.. రుణం ఇచ్చిన సంస్థలు గౌరవప్రదంగా, పారదర్శకంగానే వ్యవహరించాలి కానీ, వేధించడం, బెదిరించడం చేయకూడదని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు. రుణం 90 రోజులకు మించి చెల్లింపులు లేకపోతే, అప్పటికీ చెల్లించేందుకు 60 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సెక్యూర్డ్ రుణం చెల్లించనప్పుడు, తనఖాలో ఉంచిన ఆస్తులు లేదా వాహనాలను విక్రయించగా, వచ్చే మొత్తం నుంచి రుణం మినహాయించుకుని మిగిలినది తిరిగి రుణ గ్రహీతకు ఇచ్చేయాల్సి ఉంటుంది. రుణం చెల్లించలేనప్పుడు మారటోరియం లేదా వన్‌టైమ్ పరిష్కారం కోసం డిమాండ్ చేయవచ్చు. రుణం చెల్లించలేకపోవడం వెనుక సహేతుక కారణాలు ఉంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థను సంప్రదించాలి. చెల్లించడానికి మరింత సమయం ఇవ్వాలని కోరొచ్చు. మీరు చెప్పిన కారణాల్లో వాస్తవికత ఉందని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ భావిస్తే రుణ చెల్లింపులపై స్వల్పకాలం పాటు మారటోరియం (విరామం) కల్పిస్తాయి. లేదంటే రుణ కాల వ్యవధిని పెంచి, ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తాయి.

ఏ రుణంలో ప్రతికూలతలు ఎలా..?

క్రెడిట్ కార్డు రుణం



క్రెడిట్ కార్డ్ బిల్లు మొత్తం చెల్లించలేని సందర్భాల్లో, మినిమం డ్యూ (బిల్లులో నిర్ణీత శాతం) చెల్లించినా సరిపోతుంది. ఈ మినిమం డ్యూని కూడా చెల్లించనట్టయితే ఆరు నెలలు వేచి చూసిన తర్వాత డిఫాల్ట్‌గా ఖరారు చేస్తారు. డిపాజిట్‌ను సెక్యూరిటీగా ఉంచి క్రెడిట్ కార్డు తీసుకుంటే, బకాయి పడిన సందర్భంలో డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద సర్దుబాటు చేసుకుంటారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పొందిన క్రెడిట్‌కార్డు అయితే, బకాయి వసూలు బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగిస్తాయి క్రెడిట్ కార్డు కంపెనీలు. రుణ గ్రహీత నుంచి రుణాన్ని రప్పించే ప్రయత్నాలను ఏజెన్సీలు చేస్తాయి. అప్పటికీ ఫలితం లేకపోతే కోర్టులో కేసు దాఖలవుతుంది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు బ్లాక్ లిస్ట్‌ను నిర్వహిస్తుంటాయి. చెల్లింపులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తాయి.

విద్యా రుణం



విద్యా రుణం ఈఎంఐ చెల్లింపులు సాధారణంగా కోర్సు ముగిసి, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి మొదలవుతాయి. కానీ, కొన్ని కారణాల వల్ల కోర్స్‌లో సకాలంలో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం రాదు. కోర్సు పూర్తి చేసినా కానీ వెంటనే అందరికీ ఉపాధి లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. లేదంటే ఉద్యోగం వచ్చినప్పటికీ, అది కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వచ్చిన సందర్భాల్లో రుణ ఈఎంఐ చెల్లించలేకపోతే, తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే ఉద్యోగం లభించకపోయినా, వచ్చిన ఉద్యోగం కోల్పోయినా బ్యాంకులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలియజేయాలి. మరింత గడువు కోరాలి. లేదంటే బ్యాంక్‌లు నిర్ణీత కాలం పాటు వేచి చూసి మిగిలిన రుణాల మాదిరే నోటీసు జారీ ద్వారా తదుపరి చర్యలు ప్రారంభిస్తాయి. విద్యా రుణానికి సంబంధించి డిఫాల్టర్‌గా మారితే భవిష్యత్‌లో ఎన్నో రుణాలకు అవరోధంగా మారొచ్చు. రూ.4–10 లక్షల వరకు విద్యా రుణాలకు బ్యాంక్‌లు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. అంతకుమించితే మరో వ్యక్తిని గ్యారంటర్‌గా, లేదా ప్రాపర్టీని తనఖాగా ఉంచాలని కోరతాయి. సకాలంలో చెల్లించలేకపోతే గ్యారంటర్ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

వినియోగ రుణం



కన్జ్యూమర్ ఉత్పత్తుల కోసం తీసుకునే రుణాలు, వాహన రుణాలు అయినా గడువులోపు చెల్లించకపోతే ఒకటి రెండుసార్లు నోటీసును జారీ చేస్తాయి. 30 రోజుల్లోగా చెల్లించకపోతే అప్పుడు ముందుగా సమర్పించిన చెక్కులను నగదుగా మార్చుకునే చర్యలు మొదలు పెడతాయి. చెక్కులు బౌన్స్ అయితే కోర్టులో కేసు దాఖలు చేస్తాయి. వాహనం లేదా ఉత్పత్తిని స్వాధీనం చేసుకుంటాయి. వడ్డీసహా రుణ మొత్తాన్ని చెల్లించి సమస్య నుంచి బయటపడవచ్చు.

వ్యక్తిగత రుణం



వ్యక్తిగత రుణం వాయిదా గడువు ముగిసిన 30 రోజుల వరకు చెల్లించకపోతే డిఫాల్ట్‌గా పరిణిస్తాయి. ఇదే విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తాయి. ఇలా వరుసగా మూడు వాయిదాల్లో విఫలమైతే అప్పుడు రుణంపై అదనపు వడ్డీ రేటును (పీనల్ ఇంటరెస్ట్) వడ్డిస్తాయి. 30 నుంచి 60 రోజుల్లోపు రుణ వాయిదాను వడ్డీ, అన్ని చార్జీలతో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్‌పై స్వల్ప ప్రభావమే పడుతుంది. 90 రోజులకు కూడా చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. 180 రోజుల తర్వాత కూడా చెల్లింపులు రాకపోతే అప్పుడు రుణ గ్రహీతపై కేసులు దాఖలవుతాయి.

గృహ రుణం



ఇంటిపై పొందే మార్ట్‌గేజ్ రుణం చెల్లించకపోతే ఇంటిని కోల్పోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు చెల్లింపులు లేకపోతే దాన్ని డిఫాల్ట్ (బకాయిపడినట్టు)గా పరిగణిస్తారు. వరుసగా మూడు ఈఎంఐలు కూడా చెల్లించకపోతే, అప్పుడు బకాయిలను 60 రోజుల్లోగా సెటిల్ చేసుకోవాలంటే లీగల్ నోటీసు పంపిస్తాయి. ఆ గడువులోపు స్పందించకపోతే, సర్ఫేసీ చట్టం కింద ఇంటి జప్తు ప్రక్రియను మొదలు పెడతాయి. ఆ తర్వాత కూడా కొల్లేటరల్ (తాకట్టు) విలువ, వేలం తేదీ తదితర వివరాలతో ఒక నోటీసు పంపిస్తాయి. అప్పుడు స్పందించినా, బ్యాంక్‌లు పరిష్కారానికి అవకాశం ఇస్తాయి. చివరి ఆప్షన్‌గా ఇంటిని వేలం నిర్వహిస్తాయి. దీనివల్ల ఇంటిని కోల్పోవడంతోపాటు, క్రెడిట్ రిపోర్ట్‌లో కొన్నేళ్లపాటు దీని ప్రభావం కనిపిస్తుంది.

మిరే నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 24న ముగుస్తుంది. కనీసంగా రూ. 5,000, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించిన నిధులను ఈక్విటీ, డెట్.. మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఎక్స్చేంజ్ ట్రేడెడ్ కమోడిటి డెరివేటివ్స్ మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-1-2024	
విశాఖ	599-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
14-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

అదనపు పన్ను ఆదాకు మార్గం..?

పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద ఇప్పటికే రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. దీనికి అదనంగా పన్ను ఆదా కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– రాకేశ్ వర్మ



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

ఐటీ చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్ట పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఇప్పటికే మీరు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అప్పుడు అదనపు పన్ను ఆదా కోసం మీ ముందున్న మార్గం నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్-1. రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో గరిష్టంగా రూ.50,000 పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. సెక్షన్ 80సీకి అదనంగా కల్పించిన ప్రయోజనం ఇది. విశ్రాంత జీవనం కోసం నిధి ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వీలుగా 2004లో కేంద్ర సర్కారు ఎన్‌పీఎస్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 18–70 ఏళ్ల వయసు పరిధిలోని ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులే. ఒక ఏడాదిలో ఇందులో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేసినా సరిపోతుంది. ఇందులో చేసిన పెట్టుబడి ఏదైనా కానీ 60 ఏళ్ల వరకు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. అంటే అప్పటి వరకు లాకిన్ అయి ఉంటుంది. కొన్ని అసాధారణ పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనే దీన్నుంచి ఉపసంహరణలకు అనుమతి ఉంటుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తారు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇటీవలి తీసుకొచ్చిన సవరణ నేపథ్యంలో 60 ఏళ్లు నిండిన తర్వాత.. నెల లేదా త్రైమాసికం లేదా ఏడాదికోసారి క్రమంగా కావాల్సినంత ఉపసంహరించుకోవడానికి వీలు ఏర్పడింది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు 2 రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లలో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఆటో లేదా యాక్టివ్. ఆటో ఆప్షన్ ఎంపిక చేసుకోవడం కొంత బెటర్. ఈ ఆప్షన్‌లో ఈక్విటీలకు కేటాయింపులు ఇన్వెస్టర్ వయసు ఆధారంగా మారుతుంటాయి. ఉదాహరణకు ఇన్వెస్టర్ వయసు 35 ఏళ్లు అనుకుందాం. 100 నుంచి 35 ఏళ్లు తీసివేయగా, మిగిలిన మేర (65%) ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఇన్వెస్టర్ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. యాక్టివ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు గరిష్టంగా 75% వరకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఈక్విటీ కేటాయింపులు పోను, మిగిలినదాన్ని డెట్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలకు కేటాయించొచ్చు.

జేకే లక్ష్మీ సిమెంట్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 869 **టార్గెట్:** రూ. 1,000



ఎందుకంటే: అనుబంధ సంస్థ ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ లిమిటెడ్ ద్వారా జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుతం చేపట్టిన సామర్థ్య విస్తరణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. వార్షికంగా 2.5 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) గ్రైండింగ్ యూనిట్ పనులు పటిష్ట రీతిలో కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికానికల్లా(ఏప్రిల్–జూన్) వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభంకావచ్చని అంచనా. ఇప్పటికే 1.5 ఎంటీపీఏ సామర్థ్యంగల క్లింకర్ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకావడంతోపాటు నిలకడను సైతం సాధించింది. ఉదయ్‌పూర్ సిమెంట్ ప్లాంటులో తయారయ్యే క్లింకర్‌ను గ్రైండింగ్ కోసం జేకే లక్ష్మీ సిమెంట్ వినియోగించుకుంటుంది. మరోపక్క సూరత్‌లోనూ 1.35 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు రూ. 220 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. 1.35 ఎంటీపీఏలో 0.7 మిలియన్ టన్నుల సామర్థ్యం వచ్చే ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)కల్లా అందుబాటులోకి రానుంది. మిగిలిన 0.65 ఎంటీపీఏ సామర్థ్యం రెండేళ్ల తదుపరి(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రారంభంకావచ్చని అంచనా. ప్రణాళికల ప్రకారమే దుర్గ్ ప్లాంటులో రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణ లాభాలను పెంచుకునే బాటలో కంపెనీ విభిన్న చర్యలు తీసుకుంటోంది.

తేజాస్ నెట్‌వర్క్స్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 860 **టార్గెట్:** రూ. 1,050



ఎందుకంటే: పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) ఆధారిత టెలికం పరికరాల తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా తేజాస్ నెట్‌వర్క్స్ నిలుస్తోంది. వైర్‌లైన్, వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ ప్రొడక్టుల తయారీ, డిజైనింగ్‌లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదలు 2027–28 వరకూ కంపెనీ రూ. 29,200 కోట్ల విలువైన ఆర్డర్లను పూర్తి చేయనుంది. వెరసి రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 6,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించే అవకాశముంది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్, భారత్ నెట్ ప్రాజెక్టులు తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం గరిష్టస్థాయికి చేరే వీలుంది. ఈ ఏడాదితో పోలిస్తే 5 రెట్లు పుంజుకోవచ్చు. దేశీయంగా తయారీ రంగంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) ద్వారా కంపెనీ ప్రధానంగా లబ్ధిని పొందే అవకాశముంది. బీఎస్ఎన్ఎల్, భారత్‌నెట్, రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వ భారీ పెట్టుబడి వ్యయాలు ఇందుకు సహకరించనున్నాయి. అంతేకాకుండా కీలక మౌలిక సదుపాయాలు, ప్రయివేట్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్, ప్రపంచస్థాయిలో చైనాకు ప్రత్యామ్నాయ టెలికం పరికరాల కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యత సైతం తేజాస్ నెట్‌వర్క్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. టాటా గ్రూప్ సెమీకండక్టర్ కార్యకలాపాలు కంపెనీకి ప్రయోజనం చేకూర్చే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

సింహగిరిపై వేడుకగా సంక్రాంతి సంబరాలు


సింహగిరిపై భోగి మంటను వెలిగిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం (పెందుర్తి): సింహగిరిపై సంక్రాంతి సంబరాలు ఆదివారం వేడుకగా జరిగాయి. విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో భోగి మంటను వెలిగించి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ ఏ చరిత్ర చూసినా నృసింహస్వామి ప్రస్తావన తప్పకుండా ఉంటుందన్నారు. ఆదిశంకరాచార్యుల అద్వైత గ్రంథాల్లో నృసింహస్వామి గురించి ఎంతో గొప్పగా వివరించారని తెలిపారు. సింహాచలం దేవస్థానం సంక్రాంతి సంబరాలను నిర్వహించడం ఆనందంగా ఉందని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

విమానాలకు ఢిల్లీ పొగమంచు ఎఫెక్ట్!

సాక్షి, విశాఖపట్నం: ఢిల్లీలో పొగమంచు ప్రభావం పలు విమానాలపై పడింది. పొగమంచుతో ఢిల్లీ విమానాశ్రయంలో విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విశాఖపట్నం రావలసిన, ఇక్కడ నుంచి వెళ్లవలసిన ఆరు విమాన సర్వీసులు ఆదివారం రద్దయ్యాయి. దీంతో సంక్రాంతి పండుగకు వెళ్లడానికి విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులు విమానయాన సంస్థల ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. రద్దయిన విమానాల్లో ప్రయాణించే వారికి ఇబ్బంది లేకుండా ఆయా ఎయిర్‌లైన్స్ సంస్థలు తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని, సోమవారం ఢిల్లీలో పొగమంచు ప్రభావం తగ్గితే విమాన సర్వీసులకు అంతరాయం ఉండబోదని విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

రేపు భీమవరంలో 'మల్లఖంబ్' పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా మల్లఖంబ్ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్టు శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 31 వరకు చెన్నైలో 6వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. దీన్లో భాగంగా మంగళవారం భీమవరంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి ప్రతిభగల క్రీడాకారులను గుర్తించేందుకు అండర్–19 బాలబాలికలకు ఎంపిక పోటీలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. 2005 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు ఆధార్ కార్డ్, 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, అంతకు ముందు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పొందిన సర్టిఫికెట్లతో ఎంపికలకు హాజరవ్వాలని సూచించారు. ఈ సమయంలో క్రీడాకారులకు ఎటువంటి టీఏ, డీఏలు వర్తించవని పేర్కొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- అక్కాచెల్లెళ్లను ఢీకొన్న లారీ
- చెల్లి మృతి, అక్కకు గాయాలు


రహదారిపై గ్రామస్తుల ధర్నా. ఇన్‌సెట్‌లో తేజస్వి మృతదేహం

కైకలూరు/మండవల్లి: సంక్రాంతి పండుగ వేళ ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. భోగి పండుగ సందర్భంగా శనివారం రాత్రి ముగ్గులు వేసే సందడిలో ఉన్న అక్కా చెల్లెళ్లను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చెల్లి అక్కడికక్కడే మృతిచెందగా, అక్క తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన ఏలూరు జిల్లా, మండవల్లి మండలం కానుకొల్లులో జరిగింది. కానుకొల్లు గ్రామానికి చెందిన పగిళ్ల సూరిబాబు, సుగుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పల్లవి దుర్గ (18), చిన్న కుమార్తె తేజస్వి (15). వీరిద్దరూ ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. శనివారం రాత్రి ముగ్గులు వేస్తున్న సమయంలో తల్లికి కడుపునొప్పిగా ఉందని, సోడా తెచ్చేందుకు రోడ్డు దాటారు. తిరిగి వస్తుండగా కైకలూరు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తేజస్వి అక్కడికక్కడే మృతి చెందగా, దుర్గ తీవ్రంగా గాయపడింది. ఆమెను గుడివాడలో ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు మండవల్లి ఎస్‌ఐ సీహెచ్‌ఎస్ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా లారీ నడిపి తేజస్వి మరణానికి కారకుడైన లారీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. కైకలూరు రూరల్ సీఐ బీ కృష్ణకుమార్ తదితరులు మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


కృష్ణా జిల్లా ఉప్పులూరులో బరివద్ద పందేలను ఆసక్తిగా తిలకిస్తున్న జనం


కృష్ణా జిల్లా ఈడుపుగల్లులో కోడిపందేల జాతర


పందేల బరిలో వీక్షకుల సందడి

తొలిరోజే పుంజుకున్నాయ్

- కత్తులు దూసిన పందెం కోళ్లు
- బరుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఫ్లడ్ లైట్లు
- సందర్శకుల రాకతో జాతరను తలపించిన పందేలు
- జాడలేని తెలంగాణ రాజకీయ నేతలు


తలపడుతున్న పుంజులు

సాక్షి, అమరావతి/భీమవరం/అమలాపురం: భోగి రోజైన ఆదివారం పందెం కోళ్లు జూలు విదిల్చాయి. బరిలోకి దూకి కత్తులు దూశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు మొదలయ్యాయి. గోదావరి జిల్లాల్లో భారీఎత్తున పందేలు జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకొల్లు, నరసాపురం, ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నిడమర్రు, దెందులూరు మండలాలు, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పందేలు సందడిగా సాగాయి. కోనసీమ జిల్లా రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల కోడి పందేలు జోరుగా సాగాయి. కొన్నిచోట్ల బరులకు ప్రత్యేకంగా ఫెన్సింగ్ కూడా వేశారు. పెద్దాపురం, కరప తదితర మండలాల్లో కోడిపందేలు జరిగాయి. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి రూరల్, కడియం, మండపేట తదితర ప్రాంతాలతోపాటు నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, తాళ్లపూడి తదితర మండలాల్లో కోడిపందేలు జోరుగా నిర్వహించారు. వరి చేలు, కొబ్బరి తోటలు, మైదాన ప్రాంతాల్లో భారీ బరులు ఏర్పాటు చేశారు. బెట్టింగ్ స్థాయిని బట్టి బరులు ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చే


పశ్చిమగోదావరి జిల్లా కలగంపూడి బరి వద్ద బౌన్సర్లు

వారికి వీవీఐపీ, వీఐపీ, సామాన్యుల కోసం ప్రత్యేక గ్యాలరీలు నెలకొల్పారు. బరులను ఆనుకుని ప్రత్యేకంగా సిట్టింగ్ (బెంచీలు, కుర్చీలు) ఏర్పాటు చేశారు. బరుల చుట్టూ ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఫ్లడ్‌లైట్లు పెట్టారు. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందేలు మోస్తరుగా కొనసాగాయి. అన్నిచోట్లా పందేల బరులకు ఆనుకుని గుండాట, పేకాట, కోసు ఆటలు నిర్వహించారు. పందేలకు వచ్చిన వారి కోసం బిర్యానీ, మాంసం పకోడి, కూల్‌డ్రింక్స్, సిగరెట్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో జాతరను తలపించింది. గోదావరి జిల్లాల్లో నిర్వహించే కోడి పందేలను తిలకించేందుకు, పందేలు వేసేందుకు బెట్టింగ్ రాయుళ్లు పయనమవడంతో హైదరాబాద్, విజయవాడ మార్గంలో వాహనాల రద్దీ కన్పించింది. పందేలకు వచ్చిన వారితో గోదావరి జిల్లాల్లోని లాడ్జిలు, అతిథి గృహాలు సైతం నిండిపోయాయి.

ట్యాగ్‌లు ఉంటేనే అనుమతి

పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలంలోని పెదఅమిరం, సీసలి గ్రామాల్లో కోడి పందేలు వీక్షించడానికి ఎల్‌ఈడీ డిస్‌ప్లేను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పందేలను వీక్షించడానికి వచ్చే వారి చేతులకు ట్యాగ్‌లు వేశారు. బరుల వద్ద బౌన్సర్లను ఏర్పాటు చేసి ట్యాగ్‌లు ఉన్నవారిని మాత్రమే బరుల్లోకి ప్రవేశించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోని యలమంచిలి మండలం కలగంపూడి, కాపవరం, పూలపల్లి, పాలకొల్లు మండలం, నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు మండలం, ఆచంట నియోజకవర్గంలోని కవిటం, తణుకు నియోజకవర్గం అత్తిలి, వేల్పూరు, తేతలి గ్రామాల్లోనూ భారీ స్థాయిలో పందేలు నిర్వహించారు. ఏలూరు జిల్లాలోని కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి, ఏలూరు, నూజివీడు నియోజకవర్గాల్లోనూ భారీ స్థాయిలో కోడి పందేలు నిర్వహించారు. ఎన్నికల ఏడాది కావడంతో వివిధ పార్టీల నేతలు బరులకు వెళ్లి నిర్వాహకులను, పందేల రాయుళ్లను పలకరించారు. అక్కడే కొంత సమయం గడిపి స్థానికులతో మమేకమై ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాగా.. ఈసారి హైదరాబాద్ నుంచి రాజకీయ నేతల రాక పెద్దగా కనిపించలేదు.

బుసకొట్టిన 'కట్టల' పాములు


కాళ్ల మండలంలో బరి వద్ద కౌంటింగ్ మెషిన్‌తో క్యాష్ లెక్కింపు

కోడి పందేలతో పాటు పేకాట, గుండాట వంటి జూద క్రీడల శిబిరాలు కూడా భారీగానే వెలిశాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 200 బరుల్లో పందేలు నిర్వహించగా సుమారు రూ.150 కోట్ల వరకు చేతులు మారినట్టు అంచనా. కోనసీమ జిల్లాలోనూ నోట్ల కట్టలు బుసలు కొట్టినట్టుగా చేతులు మారాయి. కోడి పందేలు నిర్వహించే పెద్ద బరుల వద్ద సొమ్ములు లెక్కించడానికి కౌంటింగ్ మెషిన్లు ఏర్పాటు చేయడం విశేషం. కైకలూరు నియోజకవర్గ పరిధిలోని కలిదిండి మండలం మిలట్రీపేట, మండవల్లి మండలం భైరవపట్నం శిబిరాల వద్ద ఎక్కువ పందేలు గెలిచిన వారికి బుల్లెట్లను బహుమతిగా ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి జూదాలు విపరీతంగా పెరిగాయి. అక్కడ కూడా రూ.కోట్లు చేతులు మారాయి.



భోగి మంటల వెలుతురులో ఇంటింటా సంక్రాంతి

- రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్ని తాకిన సంబరాలు
- భోగి మంటల వద్ద చిన్నారుల కేరింతలు
- ఊరూవాడా సందడే సందడి
- సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికిన తెలుగు లోగిళ్లు



సాక్షి, అమలాపురం/భీమవరం/అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండుగ శోభతో తెలుగు లోగిళ్లు కళకళలాడాయి. భోగి పర్వదినాన ఊరూవాడా తెల్లవారుజామునే సందడి నెలకొంది. ఏడాదంతా సుఖశాంతులతో ఉండాలని, నవ ధాన్యాలు, సిరి సంపదలు కలగాలని కోరుకుంటూ భోగి మంటలు వేశారు. కొత్త కాలానికి స్వాగతం పలుకుతూ.. భోగిమంటల చుట్టూ చిన్నా పెద్దా కేరింతలు కొట్టారు. పైరు పచ్చని కోనసీమ సంక్రాంతి కాంతులతో మెరిసిపోతోంది. మూడు రోజుల ముచ్చటైన పండుగకు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పెద్దసంఖ్యలో రావడంతో అటు పల్లెలు.. ఇటు పట్టణాలు కళకళలాడుతున్నాయి. ఉద్యోగం, ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లినవారు రెక్కలు కట్టుకుని సొంతూళ్లలో వాలిపోయారు. రైళ్లలో చాంతాడంత నిరీక్షణ జాబితా ఉన్నా.. ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక బస్సులు.. ప్రైవేట్ బస్సులలో సీట్లు లేకున్నా అష్టకష్టాలు పడి స్వగ్రామాలకు చేరుకున్నారు. భోగి పండుగ రోజైన ఆదివారం కూడా దూరప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు వస్తూనే ఉన్నారు. పట్టణాల్లోని వస్త్ర దుకాణాల్లో ఆదివారం కూడా కొనుగోళ్లు కొనసాగాయి. గంగిరెద్దుల కళాకారుల సందడి, హరిదాసు కీర్తనలతో వీధులు మార్మోగుతున్నాయి. ఎటు చూసినా పండగ సందడి కనిపిస్తోంది. కొత్త అల్లుళ్లకు జరుగుతున్న మర్యాదలు అన్నీ ఇన్నీ కాదు. సంక్రాంతి, కనుమ నాడు జరిగే సంప్రదాయ పండగ కోసం రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కోనసీమ జిల్లాలో సోమవారం నుంచి ప్రభల తీర్థాలు ప్రారంభం కానున్నాయి. దేశంలోనే ఖ్యాతి పొందిన జగ్గన్నతోట ప్రభల తీర్థం మంగళవారం జరగనుంది. దీనికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు.

గిరిసీమలో 'కొత్త'బడులు

- ఏజెన్సీ ప్రాంతాల్లో 1,331 పాఠశాలలకు కొత్త భవనాలు
- రూ.500 కోట్లతో పనులు చేపట్టిన ప్రభుత్వం
- నాడు–నేడులో 424 గిరిజన సంక్షేమ స్కూళ్లు పూర్తి

సాక్షి, అమరావతి: గిరిజన స్కూళ్లకు మహర్దశ పట్టింది. ఇప్పటి వరకు చెట్ల కింద, పూరిపాకల్లో కొనసాగుతున్న గిరిజన గ్రామాల్లో చదువులకు ప్రభుత్వం కొత్త రూపునిస్తోంది. తక్కువ మంది విద్యార్థులున్న బడులకు సైతం పక్కా భవనాలు నిర్మిస్తోంది. మరిన్ని శిథిలమైన భవనాలకు మెరుగులు అద్దుతోంది. ఆరు జిల్లాల్లో 1,331 గిరిజన సంక్షేమ పాఠశాలలు సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో మైదాన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తే.. గిరిజన గ్రామాల్లో పూర్తిగా గాలికి వదిలేశారు. రవాణా సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో విద్యను పట్టించుకోకపోవడంతో అక్కడి పిల్లలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే, వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన 'మనబడి నాడు–నేడు'తో దాదాపు 1,331 గిరిజన స్కూళ్లను సుమారు రూ.500 కోట్లతో సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. వీటితో పాటు మరో 817 పాఠశాల భవనాల్లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే నాడు–నేడు మొదటి దశలో 350, రెండో దశలో మరో 74.. మొత్తం 424 గిరిజన సంక్షేమ పాఠశాలలను పూర్తి చేశారు. కొండ ప్రాంతాల్లోని గూడేల్లో ఎన్నో ఏళ్లుగా పాఠశాలలున్నా వాటిలో అత్యధిక ప్రాంతాల్లో పక్కా భవనాల్లేవు. ఇలాంటి చోట బడులు, పాకలు లేదా చెట్ల కింద నామమాత్రంగా నడుస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఉన్న పాఠశాలల భవనాలు బీటలు వారి శిథిలమయ్యాయి. ఇలాంటి పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించడంతో పాటు పాత వాటికి మెరుగులు దిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మారుమూల బడుల్లోనూ సకల సదుపాయాలు

తొలి విడతలో 26 జిల్లాల్లోనూ 20 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులున్న 1,331 స్కూళ్లను గుర్తించారు. వీటిలో కొత్త భవనాలు నిర్మించాల్సినవి దాదాపు 500 వరకూ ఉండగా, మిగిలినవి మెరుగులు దిద్దాల్సినవి. మొత్తం రూ.500 కోట్లతో ఆయా పనులు చేపట్టారు. ఇప్పటికే 424 స్కూళ్ల పనులు పూర్తిచేయగా, మిగిలిన స్కూళ్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతుల కల్పన విభాగం లక్ష్యంగా నిర్దేశించుకుంది. కేవలం భవనాలు నిర్మించడమే కాకుండా వాటికి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లను సైతం తప్పనిసరి చేసింది. ప్రస్తుతం నాడు–నేడు రెండో దశ పనుల్లో భాగంగా ఈ స్కూళ్లను బాగుచేస్తుండగా, మూడో విడతలో ఏజెన్సీలోని 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

'అగ్ని గుండం' నందీశ్వరులు

సంక్రాంతి పండుగ అంటే సరదాలకు పెట్టింది పేరు. ఒక చోట కోడి పందేలు..మరో చోట పొట్టేళ్ల పందేలు..ఇంకో చోట ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగుతుంటే కర్ణాటక రాష్ట్రం మైసూరు సమీపంలోని సిద్దలింగపురంలో మాత్రం ఎద్దుల విన్యాసాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం మంటలు ఎగసిపడుతున్న అగ్నిగుండాన్ని ఎద్దులు అలవాకగా దాటి అబ్బురపరిచాయి. ఇలా చేయడం వల్ల మంచి జరుగుతుందనేది ఇక్కడి రైతుల విశ్వాసం. – మైసూరు


మైసూరు వద్ద మంటల్లో నుంచి ఎద్దులను దూకిస్తున్న రైతులు

ఏపీ భవన్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సాక్షి, న్యూఢిల్లీ/శ్రీశైలం టెంపుల్: దేశ రాజధాని ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల మహిళలు పోటెత్తారు. పోటీలు పడి మరీ రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. గుంటూరు కారం, సైంధవ్ చిత్రాలను చూసేందుకు ప్రేక్షకులు క్యూ కట్టారు. ముగ్గులు, పెయింటింగ్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వాహకులు ఏర్పాటు చేసిన 15 స్టాల్స్ కిటకిటలాడాయి. 'అనకాపల్లి బెల్లం రుచులు (అనకాపల్లి), ఆర్గానిక్ ఆంధ్రా మిల్లెట్ కిచెన్(అనకాపల్లి), లేపాక్షి(ఢిల్లీ), ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ సొసైటీ(ఆప్కో విజయవాడ), ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, గిరిజన ప్రొడక్ట్స్, శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల దేవస్థానం(శ్రీశైలం), టీటీడీ(గోల్‌మార్కెట్, ఢిల్లీ), శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం (ఇంద్రకీలాద్రి, విజయవాడ) లడ్డూ ప్రసాదాలు, క్యాలెండర్లు, డైరీలు, ఏపీ తినుబండారాలు, శ్రీనివాస ఫుడ్ ఐటమ్స్, సాంబారు పాట్, విజయ్ సౌత్ ఇండియన్ నంకీన్, ఏపీ మార్కెట్ ఫెడ్, ఆంధ్రా కిచెన్ వంటి స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

కొత్త అల్లుళ్లకు బాహుబలి విందు


ఏలూరు జిల్లా రాజవరంలో కొత్త అల్లుడికి పెట్టిన విందు

- ఏలూరు జిల్లాలో 225 రకాలతో భోజనం
- తూర్పుగోదావరి జిల్లాలో 150 రకాలతో..

కొయ్యలగూడెం/రాజానగరం: సంక్రాంతి రోజుల్లో కొత్త అల్లుళ్లకు చేసే మర్యాద అంతా ఇంతా కాదు. ఈ విషయంలో గోదారోళ్లకు పెట్టింది పేరు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం, రాజవరం గ్రామానికి చెందిన కాకి నాగేశ్వరరావు, లక్ష్మి దంపతుల కుమార్తె జ్యోత్స్నకు విజయవాడకు చెందిన చీమకుర్తి శ్రీమన్నారాయణ, దీప్తి కుమారుడు లోకేశ్ సాయితో ఇటీవల వివాహం జరిగింది. సంక్రాంతికి కొత్త అల్లుడిని 225 రకాల తినుబండారాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గోదావరి జిల్లాలో సంక్రాంతి పండుగను ఇంత సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన చవ్వా నాగ వెంకట శివాజీ సంక్రాంతి పండగకు వచ్చిన అల్లుడు రిషేంద్రకు అత్తమామలు సునీతరాణి, శివాజీ 150 రకాలతో ఘనంగా విందు భోజనం ఏర్పాటు చేశారు.


రాజానగరంలో కొత్త అల్లుడికి వంటకాలు తినిపిస్తున్న అత్తమామలు

ఉరితాడైన చైనా మాంజా

- మెడకు చుట్టుకుని ఆర్మీ అధికారి దుర్మరణం
- హైదరాబాద్‌లో దుర్ఘటన
- మృతుడి సొంత ఊరు విశాఖ



సాక్షి, హైదరాబాద్/బీచ్‌రోడ్డు (విశాఖతూర్పు): గాలిపటం మాంజా (చైనా దారం) ఆ ఆర్మీ అధికారి పాలిట ఉరితాడైంది. క్షణాల్లో మెడకు బిగుసుకుని నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. సంక్రాంతి వేళ ఆనందంగా ఉన్న కుటుంబంలో విషాదం నింపింది. ఈ హృదయవిదారక ఘటన శనివారం రాత్రి హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ ప్రాంతంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెదవాల్తేరు కాగితాల వీధికి చెందిన కాగితాల కోటేశ్వర్‌రెడ్డి (30) 12 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో ఉన్న మిలటరీ ఆస్పత్రిలో నాయక్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. భార్య ప్రత్యూష, ఏడాది కుమార్తెతో కలిసి బాపునగర్‌లో నివసిస్తున్నారు. శనివారం రాత్రి 7.20 గంటలకు ఆయన విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై లంగర్‌హౌస్ వైపు వస్తున్న సమయంలో గాలిపటం మాంజా (దీనిని గాజు రవ్వతో తయారు చేస్తారు) మెడకు చుట్టుకుంది. కంఠ నరాలు కోసుకుపోవడంతో ఆయన ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయారు. రక్తపుమడుగులో పడి ఉన్న కోటేశ్వర్‌రెడ్డిని స్థానికులు గుర్తించి చికిత్స కోసం ఆయన పనిచేసే మిలటరీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు కోటేశ్వర్‌రెడ్డిని కాపాడేందుకు రెండు గంటలపాటు శ్రమించినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని ఆర్మీ కార్యాలయ వర్గాలు విశాఖపట్నంలో ఉన్న కోటేశ్వర్‌రెడ్డి తల్లిదండ్రులకు తెలియజేశాయి. ఫలితంగా విశాఖ జిల్లా పెదవాల్తేరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ లంగర్‌హౌస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కోటేశ్వర్‌రెడ్డి మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

తండ్రి ఆర్మీ మాజీ ఉద్యోగే

కోటేశ్వర్‌రెడ్డి తండ్రి వరప్రసాద్ కూడా ఆర్మీలో కొన్నేళ్లు సేవలు అందించారు. కుమారుడు ఆర్మీలో చేరిన తర్వాత వరప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తూ విశాఖలో ఉంటున్నారు. ఏడాది కిందట వరకు ఢిల్లీలో ఉద్యోగం చేసిన కోటేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. తల్లిదండ్రులను చూసేందుకు ఆరు నెలల క్రితం భార్యాపిల్లలతో కలిసి విశాఖ వచ్చారు.

బోసిపోయిన జాతీయ రహదారి

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడు రోజులుగా రద్దీగా ఉన్న హైదరాబాద్‌–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి ఆదివారం ఒక్కసారిగా బోసిపోయింది. ప్రజలు ఇప్పటికే సొంతూళ్లకు వెళ్లిపోవడం, ఆదివారం భోగి పండుగ కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సైతం పెద్దగా రాకపోకలు సాగించక జాతీయ రహదారి ఖాళీగా కనిపించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా నిర్మానుష్యంగా మారింది. అడపాదడపా వచ్చే వాహనాలు వేగంగా దూసుకుపోయాయి. రద్దీతో మూడు రోజులపాటు అవస్థలు పడిన వివిధ శాఖల యంత్రాంగం, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


నిర్మానుష్యంగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943



సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆదివారం బెంగళూరు కేఆర్ పూల మార్కెట్‌లో రద్దీ. పూలు పండ్ల ధరలు పెరిగినప్పటికీ కొనుగోళ్ల జోరు ఏమాత్రం తగ్గలేదు. రంగురంగుల పుష్పాల చుట్టలు కనువిందు చేసిన దృశ్యం

న్యూస్‌రీల్

ప్రేమ, రాగిణి.. పొంగల్



పొంగల్ వండుతున్న నటీమణులు

శివాజీనగర: నగరంలోని భారతీ నగరలో కాక్స్ టౌన్ శ్రీ గంగమ్మ దేవాలయం ముందు నటీమణులు ప్రేమ, రాగిణి ద్వివేదిలు సంక్రాంతి పండుగ సంబరాలను జరుపుకొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక నివాసితులు, పౌర కార్మికులతో కలిసి భోగి మంటలు వెలిగించి పొంగల్ వండారు. గోపూజ చేసి సంబరాలను చేసుకొన్నారు. పౌర కార్మికులకు చీరలను, స్వీట్స్ పంపిణీ చేశారు.

ఆదర్శనీయులు వివేకానందుడు



కార్యక్రమంలో స్వామీజీ

గౌరిబిదనూరు: నేటి యువతరానికి వివేకానందులవారు ఆదర్శ పురుషులని, హిందుత్వానికి వీరు ప్రతీకలని, మౌఢ్యాచరణ వ్యతిరేకులని బిజాపూర్ కు చెందిన శాంతికుటీర ఆశ్రమం స్వామి కృష్ణమహారాజ్ తెలిపారు. ఇక్కడికి సమీపంలోని శ్రీ రామకృష్ణ శారదాదేవి విద్యా సంస్థలో వివేకానంద జయంతి, యువజనోత్సవం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ మనిషికి పరిపూర్ణత్వాన్ని ప్రసాదించేది విద్య, మనిషిలోని వినయాన్ని నిద్రలేపుతుంది. హిందుత్వాన్ని ప్రపంచ దేశాలకు చాటిన వారు వివేకానందులవారు, లేవండి, లేచి లక్ష్యం చేరేవరకు విశ్రమించకండి అని యువతకు పిలుపునిచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరత్‌రాజ్, ప్రవీణ్‌కుమార్, విడి గణేశ్, రేష్మా తాజ్ తదితరులు పాల్గొన్నారు. బాలలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు వితరణ చేశారు.

పొగమంచుతో విమానాలకు ఇబ్బంది



ఎయిర్‌పోర్టులో పొగమంచు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు ఆవహించడంతో ఆదివారం ఉదయం పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు 34 విమానాల టేకాఫ్ ఆలస్యంగా జరిగింది. పొగమంచు వల్ల దారి కనిపించకపోవడంతో 2గంటల పాటు టేకాఫ్, ల్యాండింగ్‌లు వాయిదా పడ్డాయి. దీంతో పలు విమానాలు ఆలస్యంగా సాగడంతో ప్రయాణికులు పడిగాపులు కాశారు.

బీజేపీలో చేరను



మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్ శెట్టర్

హుబ్లీ: తనను తిరిగి బీజేపీలోకి చేర్చుకోవాలని కొందరు ఆశపడుతున్నారు. అయితే తాను ఎట్టి పరిస్థితిలోను తిరిగి వెళ్లే ప్రసక్తే లేదు. తనకు జరిగిన అవమానాలను ఇంకా మరచిపోలేదని మాజీ సీఎం, కాంగ్రెస్ నేత జగదీశ్ శెట్టర్ తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నేను బీజేపీని విడిచిన తర్వాత జరిగిన నష్టం బీజేపీ నేతలకు బోధపడింది. ఈ విషయంలో కొందరు నన్ను తిరిగి ఆ పార్టీ చేర్చుకోవాలని యత్నిస్తున్నారు. అయితే పార్టీ ప్రముఖులెవరు నన్ను సంప్రదించలేదు. ఈ విషయమై చర్చించలేదు. ఎవరి ఎట్టి ప్రయత్నాలు చేసిన నేను బీజేపీలోకి తిరిగి వెళ్లనని ఆయన స్పష్టం చేశారు. అనంతకుమార్ హెగ్డె సీఎంను ఏకవచనంలో నిందించడంపై స్పందిస్తూ అనంతకుమార్ హెగ్డె హద్దుమీరి ప్రవర్తిస్తున్నారు. ఇన్ని రోజులు కనిపించకుండా పోయిన ఆయన ఇప్పుడు ఆకస్మికంగా ప్రత్యక్షమయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చాలా చురుగ్గా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని మోదీ జిల్లాకు వచ్చిన వేళ అనంత్‌కుమార్ ఎక్కడికి వెళ్లారు. ఇప్పుడు వచ్చి నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. రాజ్యాంగ పదవులలో ఉన్న వారి గురించి ఈ విధంగా మాట్లాడటం సబబుకాదన్నారు. రామ మందిరాన్ని బీజేపీ అస్త్రంగా చేసుకుంది. రాజకీయాల్లో మతం ఉండాలి. అయితే మతంలో రాజకీయం ఉండరాదన్నారు. తనతో పాటు ఎందరో రామ మందిరం కావాలని కోరుకున్నారన్నారు.



ఆదివారం ధార్వాడలో భోగి- సంక్రాంతి ఉత్సవాలలో పిండివంటలతో మహిళలు



మైసూరు వద్ద మంటల్లో నుంచి ఎద్దులను ఎగిరిస్తున్న రైతులు



ధార్వాడలో ఉల్లాసంగా భోగి వేడుకలు

ఇంటింటా సంక్రాంతి శోభ

- వాడవాడలా భోగి ఉత్సవాలు
- పల్లెసీమల్లో సంప్రదాయ వైభవం

శివాజీనగర: రాష్ట్రమంతటా సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. పల్లెసీమలు, పట్టణాలు అనే తేడా లేకుండా భోగి పండుగ వేడుకలు ఆదివారం ఉదయం నుంచి ఆదివారం ఘనంగా చేసుకొన్నారు. విద్యా, ఉద్యోగాల కోసం నగరాల్లో ఉంటున్న వేలాది మంది సొంతూళ్లకు వెళ్లిపోయారు. బంధుమిత్రులతో కలిసి వేకువజామునే భోగి మంటలు వెలిగించి ఆనందోత్సాహాలతో గడిపారు. ముగ్గులు, సంప్రదాయ వేడుకలు, పిండివంటలతో ఇంటింటా పండుగ కళ నెలకొంది. కన్నడనాట ఎళ్లుబెళ్లు పేరుతో బంధువుల, ఇరుగుపొరుగు నువ్వులు- బెల్లం పంచుకుని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈ ఏడాది అధిక సంవత్సరమైన కారణాన ఈ నెల 15న మకర సంక్రాంతి ఆచరించనున్నారు.

గవి గంగాధరునికి కిరణ స్పర్శ

బెంగళూరు నగరంలో గవి గంగాధరేశ్వర దేవాలయంలో శివలింగంపై సూర్యకిరణ స్పర్శ కావడం ప్రతి సంక్రాంతికి జరిగే విశేషం. ఆ అరుదైన క్షణాల కోసం వేలాది మంది భక్తులు వేచి ఉండి సాక్షులయ్యారు. బ్యాటరాయనపుర నియోజకవర్గం జక్కూరు మైదానంలో సుగ్గి- హుగ్గి సంబరాలను జరిపారు. రెండు రోజుల పాటు జానపద సంగీతం, గోలీల ఆట, గాలిపటాల ఎగురవేయటం, ఎద్దుల బండి సవారితో పాటుగా జానపద నృత్యాలు, చిత్రకళ వంటి అనేక కార్యక్రమాల్లో పిల్లలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



భోగి వేడుకకు బుజ్జాయి ముస్తాబు

ఉడుపిలో సప్తోత్సవం

ఉడుపి శ్రీకృష్ణమఠంలో శ్రీకృష్ణ ప్రతిష్ఠ స్మరణార్థం ఈ నెల 9 నుంచి 15 వరకు సప్తోత్సవ సంబరాలు జరుగుతున్నాయి. ద్వైత మత స్థాపకులు మధ్వాచార్యులు ఎనిమిది శతాబ్దాల క్రితం మకర సంక్రమణ రోజున శ్రీకృష్ణుని విగ్రహాన్ని తీసుకొచ్చి ఆలయంలో స్థాపించారు. అందుకు గుర్తుగా సప్తోత్సవాలను ఆచరిస్తారు. మకర సంక్రమణ రోజున తెప్పోత్సవం జరుగుతుంది. ఆదివారం రాత్రి మూడు తేరుల ఉత్సవం వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం చూర్ణోత్సవం, పల్లకీ పూజ, అన్నప్రసాదం పంపిణీ నిర్వహిస్తారు.

ధార్వాడలో సంబరాలు

ఉత్తర కర్ణాటకలో సంక్రాంతి సందడి అంబరాన్ని తాకింది. ధార్వాడలో పలు కుటుంబాలు కలిసి రంగవల్లులు వేసి, పిండివంటలు చేసి ఆరగించారు. ధార్వాడలో ఆదివారం సామూహిక భోగి వేడుకలను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఇక మైసూరు, మండ్య, హాసన్ తదితర దక్షిణాది జిల్లాల్లో మంటల్లో నుంచి ఎద్దులను పరిగెత్తించి సంప్రదాయాన్ని చాటుకున్నారు.



ఆదివారం రాత్రి ఉడుపి శ్రీకృష్ణ ఆలయం ముందు మూడు తేర్ల ఉత్సవం



బెంగళూరు కేఆర్ మార్కెట్ పరిసరాలలో కొనుగోలుదారులతో రద్దీ



యాదగిరి జిల్లాలో మైలార లింగేశ్వర జాతర, హాజరైన భక్తజన సాగరం



మైలార లింగేశ్వర జాతరకు తరలివస్తున్న భక్తులు

కారు పల్టీ, ఎమ్మెల్యేకు గాయాలు

యశవంతపుర: కలబురిగి గ్రామీణ ఎమ్మెల్యే బసవరాజ మత్తిమడు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. కలబురగి తాలూకా పాళా గ్రామం వద్ద ఆదివారం శహబాద్ పట్టణానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. కారులోని ఎమ్మెల్యే మత్తిమడు, గన్‌మ్యాన్‌తో పాటు ఆయన స్నేహితులు స్వల్పంగా గాయపడ్డారు. కారులో ఉన్నవారే ప్రమాదాన్ని వీడియో తీశారు. కారు అద్దాలు పగిలిపోయాయి. ఎమ్మెల్యే తదితరులు మరో కారులో వెళ్లి కలబురిగి ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

మహిళకు ఖాకీ వేధింపులు

యశవంతపుర: భర్తతో గొడవ పడి న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళకు అక్కడ పోలీస్ రూపంలో కీచకుడు ఎదురయ్యాడు. ఫిర్యాదుదారుపై వేధింపులకు పాల్పడిన ఘటన కలబురిగి జిల్లా కమలాపుర పోలీస్ స్టేషన్‌లో జరిగింది. భర్తతో ఘర్షణ పడిన మహిళ ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. కానిస్టేబుల్ బసవరాజు ఆమెతో మాట్లాడి మొబైల్ నంబర్‌ను తీసుకున్నాడు. అప్పటినుంచి ఆమెకు తరచూ ఫోన్ చేసి ఒక రాత్రి తనతో గడపాలంటూ వేధిస్తున్నట్లు మహిళ వాపోయింది. ఒక రోజు బలవంతంగా బసవరాజు కారులో తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు, పెళ్లి చేసుకొంటా, భర్తను వదిలేసి రావాలని ఒత్తిడి చేశాడని ఆరోపించింది. తన మాట వినకుంటే మహిళతో పాటు నీ తల్లిదండ్రులను కూడా జైలుకు పంపుతానంటూ వేధించాడని తెలిపింది.

డివైడర్‌ను ఢీకొని ఎగిరిపడ్డ కారు

- ఇద్దరు ప్రైవేటు బ్యాంకు అధికారులు మృతి
- మండ్య వద్ద దుర్ఘటన

మండ్య: ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులు ప్రయాణిస్తున్న కారు రోడ్డు డివైడర్‌కు ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండ్య నగర శివార్లలోని కె.కొడిహళ్లి సమీపంలోని బెంగళూరు-మైసూరు జాతీయ రహదారిపై జరిగింది. వివరాలు.. బెంగళూరు జేపీ నగరలో ఉండే ఐసీఐసీఐ హోం ఫైనాన్స్ కంపెనీ ప్రాంతీయ బిజినెస్ మేనేజర్ హెచ్‌ఏ శంకర్ (45), ఫైనాన్స్ విభాగం అధికారి మహదేవ్ తిరూర్ (37), మేనేజర్ కిశోర్ మైసూరులో జరిగిన కంపెనీ సమావేశంలో పాల్గొని, స్కార్పియో కారులో బెంగళూరుకు తిరుగుపయానమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున 4.45 గంటలకు కారు అతి వేగంతో వెళ్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఎగిరి పడింది. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను తగలడంతో అది ధ్వంసం అయింది. అవతలి లేన్లను దాటుకుని ఒక గోడను ఢీ కొట్టింది. శంకర్, మహదేవ్ తిరూర్‌లు తీవ్ర గాయాలతో మృతి చెందారు.

సహాయక చర్యలు

ఈ ప్రమాదంతో రహదారిపై కొంత సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సీఐ జేఈ మహేశ్, మరో 20 మంది సిబ్బంది అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన కిశోర్‌ను బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. ఏఎస్పీ తిమ్మయ్య, డీఎస్పీ కృష్ణప్ప తదితరులు పరిశీలించారు. శంకర్ స్వస్థలం మండ్య జిల్లా కేఆర్ పేటే తాలూకా హెమ్మనహళ్లికి, మహదేవ్ బెళగావి జిల్లా హుక్కేరికి చెందిన వారు. కిశోర్ కోలారు జిల్లా వేమగల్ తాలూకా శెట్టిహళ్లివాసి.



ప్రమాదంలో ధ్వంసమైన ఇన్నోవా కారు

ఎంపీ హెగ్డేని అరెస్టు చేయాలి

శివాజీనగర: సీఎం సిద్దరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఎంపీ అనంత్ కుమార్ హెగ్డేకు వ్యతిరేకంగా ఆదివారం నగరంలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కారవార ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే మతం, శ్రీరాముని పేరుతో ముఖ్యమంత్రిపై నీచమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సీఎంను దూషించి, మసీదులను పడగొట్టాలని మాట్లాడిన ఎంపీని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

మహిళా కండక్టర్‌కు కత్తిపోట్లు

యశవంతపుర: బెంగళూరులో బీఎంటీసీ బస్‌లో మహిళా కండక్టర్‌ను చాకుతో పొడిచి గాయపరిచారు. నిందితులు కూడా మహిళలే. వివరాలు.. దాసరహళ్లి డిపో- 40కి చెందిన బీఎంటీసీ బస్సు నెలమంగల వైపు వెళుతుండగా మహిళలు ఎక్కారు. టికెట్ తీసుకోకుండా సీటులో కూర్చున్నారు. మహిళా కండక్టర్ సుకన్య వచ్చి టికెట్ తీసుకోవాలని, లేదా ఆధార్ కార్డు చూపాలని కోరారు. దీంతో వివాదం మొదలైంది. తనిఖీ అధికారులు వస్తే తనపై చర్యలు తీసుకుంటారని కండక్టర్ గట్టిగా మాట్లాడారు. దీంతో కోపోద్రిక్తులైన మహిళలు కత్తి తీసుకుని ఆమెపై దాడి చేసి బస్సు దిగి పరారయ్యారు. గాయపడిన కండక్టర్ నెలమంగల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఇద్దరు నిందితులు అరెస్ట్

- హానగల్ గ్యాంగ్ రేప్ కేసు..
- సాంత్వన కేంద్రంలో యువతి
- హావేరి ఎస్పీ వెల్లడి

యశవంతపుర: హావేరి జిల్లాలో హానగల్‌లో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు హావేరి జిల్లా ఎస్పీ అంశుకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న జరిగిన ఘటనకు సంబంధించి బంకాపురలో, దావణగెరెలో ముగ్గురిని అరెస్టు చేశారు. కొత్తగా ఇమ్రాన్ బషీర్ జకినకట్టి, రేహన్ మహ్మద్ హుసేన్ వలీకార్ అనేవారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. హావేరి లాడ్జిలో నాలుగైదు మంది యువకులు యువతిపై దాడి చేసి, లైంగికదాడి చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 306, 376 డి సెక్షన్లు కింద కేసు నమోదు చేసి, విచారణకు ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఆరుమంది ఎస్ఐలను నియమించినట్లు తెలిపారు.

బాధితురాలితో ఎమ్మెల్యే భేటీ?

నిందితులను తీసుకెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించామని, ఆపై వైద్య పరీక్షలకు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. యువతిపై దాడి వీడియోలు వైరల్ కావడంతో సుమోటోగా కేసుగా స్వీకరించి విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాధితురాలిని సాంత్వన కేంద్రంలో ఉంచామని, గత రాత్రి ఆమెను ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే కలిశారని విలేకరులు ప్రస్తావించగా, సాంత్వన కేంద్రం మా పరిధిలో లేదు. అక్కడి సీఐ అవకాశం కల్పించి ఉండవచ్చు, దీనిపై పరిశీలన చేస్తామన్నారు. బాధితురాలు ఎవరినైనా కలవవచ్చని, తాము అభ్యంతరం చెప్పబోమని అన్నారు. సాంత్వన కేంద్రానికి మహిళా అధికారిని ఎందుకు నియమించలేదని విలేకర్లు ప్రశ్నించారు. కాగా, ఉత్తరకన్నడ జిల్లా ఎస్పీతో చర్చించి సిర్సిలోని బాధిత యువతి ఇంటికి భద్రత కల్పిస్తాన్నారు. నిందితులపై పాత నేరాలు ఉన్నట్లు లేవన్నారు. వారిలో బాల నేరస్తులు కూడా లేరన్నారు. మరో వైపు హానగల్‌లో ఒక వర్గం యువతి కిడ్నాప్ కేసులోనూ సత్వరమే చర్యలు తీసుకుంటామని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ

నెమలికి వైద్యం



నెమలికి చికిత్స అందిస్తున్న దృశ్యం

కంప్లి: గాయపడిన నెమలికి సండూరు తారానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది చికిత్స చేసి మానవత్వం చాటుకున్నారు. నెమలి నడవలేని స్థితిలో ఉండగా అటవీ ఉద్యోగి రాము వెంటనే పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. పరీక్షించిన ఆరోగ్య కేంద్ర డాక్టర్లు సునీల్, హరీశ్ బయటి నుంచి మందులు తెప్పించి జాతీయ పక్షికి ప్రాణం పోశారు.

ఘనంగా భోగి సంబరాలు

- రంగు రంగుల ముగ్గులతో లోగిలన్నీ ముస్తాబు
- ఇంటింటా భోగి మంటలు
- సంక్రాంతి, కనుమకు సర్వంసిద్ధం

సాక్షి,బళ్లారి: మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగ భోగితో ప్రారంభమవుతుంది. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరయాణంలోకి ప్రవేశించించే మొదటి రోజైన భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భోగి పండుగ నేపథ్యంలో బళ్లారి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో మన సంస్కృతి వారసత్వాలకు అద్దం పట్టేలా పండుగను ఆచరించారు. తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకునే ఈ పండుగ కర్ణాటకలో కూడా తెలుగు, కన్నడిగులు కలిసి, మెలసి పండుగలను ఎంతో వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భోగి పండుగ రోజున ఉదయాన్నే ఇంటింటా భోగిమంటలు వేశారు. అనంతరం రంగురంగులు ముగ్గులు వేసి పండుగను ఆచరించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇంటి ఆడపడుచులు, అల్లుళ్లతో సంబరాలు చేసుకుని పిండివంటలు ఆరగించారు.

ఇక సంక్రాంతి, కనుమ సందడి :

సంక్రాంతి రోజు ప్రతి ఇంటి ముందు ముగ్గులను వేసి వాటి మధ్యలో పేడతో గొబ్బెమ్మలను ఉంచుతారు. ఇక కనుమను పశువుల పండుగ అంటారు. రైతులు పశువులను శుభ్రంగా కడిగి అలంకరించి పూజిస్తారు. అన్నదాతలు తుంగభద్ర ఆయకట్టు కింద కష్టపడి చేసిన వ్యవసాయ ఫలితం ధాన్యలక్ష్మీ రూపంలో ఇళ్లకు చేరడంతో పండగను విశేషంగా ఆచరిస్తున్నారు. ఇక గంగిరెద్దుల వారి సందడి అక్కడక్కడ కనిపించడంతో కొత్తశోభను సంతరించుకుంటోంది.



ఇంటి ముంగిట అందమైన రంగవల్లులు వేస్తున్న మహిళలు



సంక్రాంతి ముగ్గును తీర్చిదిద్దుతున్న దృశ్యం



గొబ్బెమ్మలు ఉంచి పూజ చేస్తున్న ఓ కుటుంబం



నగరంలో చెరకు విక్రయాలు

మకర జ్యోతి దర్శనానికి ఏర్పాట్లు

బళ్లారి అర్బన్: శబరిమల అయ్యప్ప స్వామి జ్యోతి దర్శనం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా బళ్లారి వాసులు దర్శించుకునేందుకు అనంతపురం రోడ్డు తారానాథ ఎదురుగా శ్రీ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు జయ ప్రకాష్ గుప్తా ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం విశేష అష్టద్రవ్యాభిషేకం, శ్రీ శబరిమల అయ్యప్ప స్వామి అలంకరణ, మహామంగళారతి, సాయంత్రం శబరిమలలో కనిపించే జ్యోతి దర్శనం అనంతరం 7 గంటలకు బళ్లారి గాయకురాలు ప్రకృతి రెడ్డిచే శ్రీ అయ్యప్ప స్వామి భక్తి గీతాల ఆలాపన, అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి బోసురాజ్

రాయచూరు రూరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మౌలిక సౌలభ్యాలు కల్పిస్తామని రాష్ట్ర మంత్రి బోసు రాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించి పాఠకులతో మాట్లాడారు. తాగునీరు, శౌచాలయం, అదనపు పుస్తకాలను తెప్పించేందుకు అధికారులతో చర్చిస్తామన్నారు. మంత్రి వెంట నగర సభ కమిషనర్ గురు సిద్దయ్య, జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి నిర్మల, నగర సభ సభ్యులు జయన్న, రుద్రప్ప అంగడి తదితరులు పాల్గొన్నారు.

ఉస్తాద్ రషీద్ ఖాన్‌కు నివాళి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న స్వామిజీ

రాయచూరు రూరల్: సంగీత విద్వాంసుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ సంగీతంలో మేరు బంగారమని కిల్లే బ్రహ్మన్మఠం మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అన్నారు. శనివారం సాయంత్రం కిల్లే బ్రహ్మన్మఠంలో ఉస్తాద్ రషీద్ ఖాన్ స్వర నమన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు ఉస్తార్ రషీద్ ఖాన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రఘుపతి పూజార్, వెంకటేష్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీ మాత ప్రభోదమయి

బళ్లారి అర్బన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని గురు తిప్పేరుద్ర (ఎస్‌జీటీ) కళాశాలలో ఏర్పాటు కార్యక్రమంలో పూజ్య శ్రీ మాత ప్రభోదమయి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వివేకానంద గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన బోధించిన తత్వాలు ఎందరికో ఆదర్శమని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీ సంస్థ కార్యదర్శి జీ.నాగరాజు, కోశాధికారి మంజుల, ఉపాధ్యాయులు ఉమాదేవి, ఉమా మహేశ్వరి, విద్యా, సౌమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్లు కిటకిట

మాలూరు: పట్టణంతో పాటు తాలూకా వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ఆనందంతో జరుపుకోవడానికి ప్రజలుసిద్ధమయ్యారు. పండుగ ముందురోజు ఆదివారం పెద్ద సంఖ్యలో ప్రజలు పండుగ సామాగ్రిని కొనుగోలు చేయడానికి మార్కెట్లకు తరలి వచ్చారు. ఇక పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. కనకాంబరాలు కిలో రూ. 1500, కాగడాలు రూ. కిలో 1100, మల్లెలు కిలో రూ. 1600, రూలు, గులాబీలు కిలో రూ. 300, చేమంతులు రూ. 300, బంతిపూలు కిలో 80, అనపకాయలు కిలో 80 నుంచి 100 రూపాయల వరకు విక్రయించారు.

బిస్కెట్ ఫ్యాక్టరీలో పేలుడు ఒకరి మృతి

సాక్షి, బళ్లారి: బళ్లారి నగరంలోని గుగ్గరహట్టి సమీపంలో భారత్ బిస్కెట్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి సలీం అనే కార్మికుడు మృతి చెందాడు. ఆదివారం రాత్రి ఫ్యాక్టరీలో ఉన్న ఫలంగా మంటలు వ్యాపించడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల్లో ఒకరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిన్నారుల సంక్రాంతి సందళ్లు



అతిథులకు స్వాగతం పలుకుతున్న చిన్నారులు



ఎద్దుల బండ్ల ఊరేగింపు దృశ్యం

- చీకలపర్విలో పండుగ సంబురాలు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో పల్లె సంస్కృతిని మరువకూడదనే ఆశయంతో మాన్వి తాలూకాలో పాఠశాల విద్యార్థులు సంక్రాంతి పండుగకు అద్దం పట్టే విధంగా ఉత్సవాలు నిర్వహించారు. మాన్వి తాలుకా చీకలపర్విలో రుద్రమునీశ్వర ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు గ్రామీణ సోయగాలను ఒలకబోస్తూ ఎద్దుల బండ్లపై ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కసాప అధ్యక్షుడు రవి కుమార్ ప్రారంభించారు. పూర్వకాలం నాటి సంప్రదాయాలను మరచిపోకుండా నేటి యువతకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో చిన్నారులకు హరిదాసు వేషధారణ, జోస్యం చెప్పే చెంచులక్ష్మీ, వృషభ వేషాలను వేయించారు. కార్యక్రమంలో గిరిధర్ పూజార్, రక్షిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హరిదాసు వేషధారణలో చిన్నారి



గాలిపటాలను ఎగురవేసే కార్యక్రమంలో నిర్వాహకులు

22న శ్రీ భగీరథ మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన

బళ్లారి అర్బన్: బళ్లారి నగరంలోని 24వ వార్డు కప్పగల్ రోడ్డు వీరబ్రహ్మేంద్ర దేవస్థానం వద్ద జిల్లా భగీరథ ఉప్పార సంఘం ఆధ్వర్యంలో రాజరుషి శ్రీ భగీరథ మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఈ నెల 22న సోమవారం నిర్వహిస్తున్నట్లు సమాజ ప్రముఖులు ఉప్పార మల్లప్ప తెలిపారు. ప్రతిష్ఠాపన సందర్భంగా గణపతి హోమం, ప్రతిష్ఠ హోమం, ప్రధాన కలశ పూజ, పూర్ణవృతి, భగీరథ మహర్షి ప్రాణప్రతిష్ఠ, మహామంగళారతి తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠాపన రోజునే భగీరథ మహర్షి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జగ్గురు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ డాక్టర్.పురుషోత్తమానందపూరి మహాస్వామీజీకి, పూజ్య గురువుల బసవరాజ్ గురుజీ సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఉప్పార సమాజ ప్రముఖులు హనుమేష్, దుర్గేష్, ఎర్రిస్వామి, సిద్దేష్, నాగేంద్ర, ఉరుకుందు, అంజి, ఆనంద్, మల్లప్ప తదితరులు విగ్రహ పనులను పరిశీలించారు.



విగ్రహ పనులు పర్యవేక్షిస్తున్న ఉప్పార సమాజ ప్రముఖులు

నగరంలో శ్రీరాముడి బృహత్ కటౌట్

కోలారు : నగరంలోని డూం లైట్ సర్కిల్ వద్ద సోమవారం 40 అడుగుల శ్రీరాముడి కటౌట్‌ను ప్రారంభిస్తున్నట్లు కుడ మాజీ అధ్యక్షుడు ఓం శక్తి చలపతి తెలిపారు. ఆదివారం ఆయన నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 500 సంవత్సరాల రామమందిర నిర్మాణం కలలు నేడు నెరవేరుతున్న శుభతరుణంలో శ్రీరాముడి బృహత్ కటౌట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు, కార్యక్రమంలో నాగలాపురం మఠం శ్రీ తేజేశ లింగ మహాస్వామీజీ, చొక్కహళ్లి మహాస్వామి, ఇస్కాన్ భజన బృందం, హనుమాన్ చాలీసా బృందం సభ్యులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇది దేశ వ్యాప్తంగా పండుగ జరుపుకోవాల్సిన సమయమన్నారు. కటౌట్ ప్రారంభ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రామ భక్తులు హాజరు కావాలన్నారు. విలేకరుల సమావేశంలో భజరంగదళ్ బాలాజీ, దిశా సమితి సభ్యుడు సామబాబు, నామల్ మంజు, ఏబీవీపీ మహేష్, శివమూర్తి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఓం శక్తి చలపతి

ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడండి

కెజీఎఫ్ : సరిహద్దు ప్రాంతాలలో ఏనుగులు పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తున్నాయని, దీంతో పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న సాయంత్రం 7 గంటలకు బంగారుపేట తాలూకా తొప్పనహళ్లి క్రాస్ వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహిస్తామని రైతు సంఘం పదాధికారులు తీర్మానం చేశారు. ఆదివారం బంగారుపేట తాలూకా కదరినత్త గ్రామంలో ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతు పొలం వద్ద సమావేశమై రైతు సంఘం పదాధికారులు ఈ తీర్మానం చేశారు. ఏనుగుల దాడిలో లక్షల రూపాయల నష్టం కలుగుతోందన్నారు. ఏనుగుల బెడదకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం కనుగొనాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపన్యాసకుల డిమాండ్లు పరిష్కరించాలి

కోలారు: తమ డిమాండ్లు పరిష్కరించాలని అతిథి ఉపన్యాసకులు ఆదివారం ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 4 వేల మందికి పైగా అతిథి ఉపన్యాసకులు జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేవలం నెలకు రూ. 12 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. వేతనాన్ని రూ. 25 వేలకు పెంచాలని, విద్యా సంవత్సరం పూర్తయిన తరువాత వచ్చే విద్యా సంవత్సరంలో కూడా అతిథి ఉపన్యాసకులను కొనసాగించాలని, శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని. వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యుడు ఎన్ సాగర్, రాజణ్ణ, ప్రభావతి, అమృత, సుప్రియ పాల్గొన్నారు.



సంక్రాంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం ధార్వాడ జిల్లా నవలగుంద సమీపంలోని శిరూరు వద్ద అజ్జనవర స్వామి జాతర జరిగింది. మలప్రభ కాలువలో స్వామివారి తెప్పోత్సవం.

పాఠశాలలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

కంప్లి: కురుగోడు పట్టణంలోని సస్యశ్యామల ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. పాఠశాల వ్యవస్థాపకులు ఉమేష్ గౌడ, హెచ్ లలితకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన ధరలు



నగరంలో గుమ్మడి, చెరకు విక్రయాలు

రాయచూరు రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కూరగాయలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రజలు మాత్రం ఈ ఏడాది తొలి పండుగ కావడంతో అవసరం మేరకు పండుగ సామాగ్రి కొనుగోలు చేశారు. బెల్లం కేజీ రూ. 80, నువ్వులు సేరు రూ. 150, గుమ్మడి కాయ ఒకటి రూ. 75, చింతకాయలు కిలో రూ. 175, చెరకు ఒకటి రూ. 90 పలికింది. ఇక పూలు ధరలు కూడా భారీగా పెరిగాయి.

భక్తి శ్రద్ధలతో మైలార ఉత్సవాలు



మైలార లింగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా మైలారలో వెలసిన మైలార లింగేశ్వరుడి జాతర ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. కురబ, యాదవులు పెద్ద ఎత్తున స్వామి వారికి బండారు సమర్పించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. నాగపూజలు జరిపి నాగోళి రోజున బహుపరాక్ అంటూ నినాదాలు చేశారు.

రూ. 2.67 కోట్లు కొట్టేశారు

హుబ్లీ: రాష్ట్రంలో మహిళలే లక్ష్యంగా సైబర్ ఆగడాలకు అంతులేకుండా పోతోంది. తాజాగా ఓ మహిళ సైబర్ నేరగాళ్ల బారిన పడి ఏకంగా రూ. 2.67 కోట్లు మోసపోయింది. ధార్వాడకు చెందిన గాయత్రి బాధితురాలు. వివరాలు...ఐపీఓలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని గాయత్రికి ఓ వ్యక్తి వాట్సాప్‌లో సందేశం పంపాడు. ఆమెను తన మాటల ద్వారా బాగా నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె వ్యాట్సాప్ గ్రూప్ మెంబర్‌గా చేర్చుకొని ఆ మహిళ బ్యాంక్‌ల ఖాతా వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి విడతల వారీగా 2.67 కోట్లు వంచకులు బదలాయించుకున్నారని గాయత్రి నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.